
'నేను కలలుగన్న మరో ప్రపంచానికి మహిళలే మూలస్తంభాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 11

సోమవారం 3-4-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ ఢమాల్...

రాజస్తాన్ రాయల్స్ చేతిలో 72 పరుగులతో ఓడిన హైదరాబాద్ జట్టు. - 12లో



పన్ను శూన్యం.. ఆదాయం అదనం

పన్ను ఆదా చేసే పెట్టుబడి సాధనాలపై ప్రత్యేక కథనం - 13లో



చైనా కాలేజీల్లో 'లవ్ బ్రేక్'

చైనాలో విద్యార్థులు ప్రేమలో మునిగి తేలడానికి కాలేజీలు కొత్త ఆలోచన చేశాయి. ప్రేమ భావనలు మొలకెత్తడానికి సెలవులిచ్చాయి.

వివరాలు 6లో ▸



చాట్‌జీపీటీపై ఇటలీ నిషేధం

చాట్‌జీపీటీపై తాత్కాలిక నిషేధం విధిస్తూ ఇటలీ నిర్ణయం తీసుకుంది. ఇలాంటి చర్య తీసుకున్న తొలి దేశం ఇటలీయే.

వివరాలు 6లో ▸



పిట్ట కొంచెం రాత ఘనం

అబుదాబిలో ఉండే రషీద్ అనే నాలుగేళ్ల బాలుడు పుస్తకాన్ని రాయడంతోపాటు దానిని ప్రచురించి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కాడు.

వివరాలు 6లో ▸



ఆర్‌ఎల్‌వీ-ఎల్‌ఈఎక్స్ సక్సెస్

రీయూజబుల్ లాంచ్ వెహికల్ అటానామస్ ల్యాండింగ్ మిషన్ రాకెట్ ప్రయోగ పరీక్షలను ఇస్రో విజయవంతంగా నిర్వహించింది.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఈ నెలాఖరుకు ఇంటర్ ఫలితాలు!



పరీక్షలు పూర్తయిన నెలరోజుల్లోపే ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడనున్నాయి. మార్చి 15 నుంచి మొదలైన ఇంటర్ పరీక్షలు ఈ నెల 4వ తేదీతో ముగియనున్నాయి. ఏప్రిల్ నెలాఖరులోగా ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు.

- వివరాలు 2లో▶

టీడీపీలో నైరాశ్యం.. బాబు మౌనరాగం



రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల్లో అభ్యర్థులనే ఎంపిక చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్న చంద్రబాబు.. 'అసలు సినిమా ముందుంది' అంటూ డాంబికాలు పలకడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. 175 స్థానాల్లో పోటీపై వైఎస్సార్‌సీపీ సవాల్‌పై మాత్రం ఆ పార్టీ ఇప్పటిదాకా స్పందించనే లేదు.

- వివరాలు 10లో▶

'బాబా సాహెబ్'కు తుదిమెరుగులు



బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం ఆవిష్కరణకు దాదాపుగా సిద్ధమైంది. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ విగ్రహానికి కళాకారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు.

- వివరాలు 2లో▶

మోదీ వస్తున్నారు

అటు అభివృద్ధి.. ఇటు రాజకీయం ద్విముఖ వ్యూహంతో కార్యక్రమాలు



- 8న పర్యటన ఖరారు.. షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- సికింద్రాబాద్-తిరుపతి వందే భారత్ రైలుకు పచ్చజెండా..
- స్టేషన్ ఆధునీకరణ పనులకు భూమి పూజ..
- సికింద్రాబాద్- మహబూబ్‌నగర్ డబ్లింగ్ రైల్వేలైన్ జాతికి అంకితం
- ఎంఎంటీఎస్ ఫేజ్-2లో భాగంగా 13 కొత్త సర్వీసుల ప్రారంభం
- 6 జాతీయ రహదారుల ప్రాజెక్టులు, ఎయిమ్స్‌లో పనులకు భూమిపూజ
- పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని
- ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి
- సభలో మోదీ ఏం మాట్లాడతారన్న దానిపై రాజకీయ వర్గాల్లో చర్చలు

సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన ఖరారైంది. ఈ నెల 8వ తేదీన రాష్ట్రానికి రానున్న మోదీ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునీకరణతోపాటు పలు రైల్వే, రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీనితోపాటు పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో పాల్గొననున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకుప్రాధాన్యత ఏర్పడింది. అటు అభివృద్ధి, ఇటు రాజకీయం అనే ద్విముఖ వ్యూహంతో మోదీ తెలంగాణ పర్యటన సాగనున్నట్టు బీజేపీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రాజకీయ ప్రకంపనల మధ్య..

ఢిల్లీ లిక్కర్ స్కాంలో సీఎం కేసీఆర్ కుమార్తె, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ విచారిస్తుండటం, కవితను ఈడీ అరెస్టు చేస్తుందనే ప్రచారం, రాష్ట్రంలో సంచలనంగా మారిన టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు, దానిపై బీఆర్‌ఎస్–బీజేపీ నేతల మధ్య మాటల మంటలు కొనసాగుతున్నాయి. అంతేగాకుండా ఈసారి ఎలాగైనా తెలంగాణలో పాగా వేయాలన్న ఉత్సాహంతో కమల దళం వ్యూహాలు పన్నుతోంది. బీఆర్‌ఎస్ సర్కారు, సీఎం కేసీఆర్ కుటుంబం, ఆ పార్టీ నేతలపై దూకుడుగా విమర్శలు

మిగతా 2వ పేజీలో ▶

ప్రధాని మోదీ హాజరయ్యే పరేడ్‌గ్రౌండ్స్ సభకు బీజేపీ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో భారీస్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే జనసమీకరణపై దృష్టి పెట్టిన పార్టీ నాయకత్వం.. పెద్ద సంఖ్యలో కార్యకర్తలను, ప్రజలను తరలించేందుకు సన్నాహాలు ప్రారంభించింది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా

బహిరంగ సభకు భారీగా ఏర్పాట్లు

లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి జనాన్ని తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సభలో ప్రధాని మోదీతోపాటు పలువురు కేంద్రమంత్రులు, జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు పాల్గొననున్న నేపథ్యంలో భారీస్థాయిలో సభను విజయవంతం చేయడం ద్వారా పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపాలని భావిస్తున్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

హాజరుకానున్న 4.94 లక్షల మంది విద్యార్థులు | 6 పేపర్లు.. 100% సిలబస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 13 వరకు జరిగే ఈ పరీక్షలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో కలిపి మొత్తం 4,94,620 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు. ఇప్పటికే వారికి హాల్‌టికెట్లు అందాయి. మొత్తం 2,652 కేంద్రాల్లో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. సైన్స్, కాంపోజిట్ సబ్జెక్టులకు 20 నిమిషాల అదనపు సమయం ఇవ్వనున్నారు. కోవిడ్ మూలంగా గత రెండేళ్లుగా 70 శాతం సిలబస్ ఆధారంగానే పరీక్షలు జరగ్గా ఈసారి వంద శాతం సిలబస్‌తో పరీక్షలు జరుగుతున్నాయి. అలాగే 11 పేపర్లకు బదులు ఈసారి ఆరు పేపర్లతోనే పరీక్షలు జరగనుండటం గమనార్హం. మరోవైపు టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటన నేపథ్యంలో ఆ తరహా అనుభవాలు ఎదురవకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. అలాగే పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటిని రాష్ట్ర కార్యాలయం నుంచి పరిశీలించనున్నారు. మరోవైపు పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. విద్యార్థులు హాల్ టికెట్లు చూపించి ఈ సౌకర్యం పొందొచ్చు.

తెలుగు
రామాయణ పాఠంపై పట్టు ఉంటే 12 మార్కులు వచ్చే వీలు

గణితం
గ్రాఫ్‌లు, నిర్మాణాల సమస్యలకు సమాధానాలు కనుగొనడంపై దృష్టి పెడితే నూటికి నూరు మార్కులు సాధించే వీలుంది.

సైన్స్
భౌతిక శాస్త్రంలో ప్రయోగాలపై పట్టు సాధిస్తే పరీక్షల్లో పూర్తి మార్కులొస్తాయి. ప్రయోగ సమాచార సేకరణలో నైపుణ్యాలు, బొమ్మలు, నిత్య జీవితంలో వాటి వినియోగం అంశాలపై దృష్టి పెట్టాలి.

ఆఖరి నిమిషంలో సాధనా కీలకమే



ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రీతిన పునశ్చరణతో ఉపయోగం

- భాషల్లో తప్పుల్లేకుంటే మంచి మార్కులు ఖాయం
- భయం వీడితే లెక్కలు లెక్కే కాదు
- 'సాంఘిక'విజయానికి సమన్వయం ముఖ్యం
- కలవరం వీడితే సైన్స్ నులువే.. టెన్త్ పరీక్షల ప్రిపరేషన్‌పై నిపుణుల సూచనలతో 'సాక్షి'కథనం

- వివరాలు 2లో

డేటా లీకుపై ఈడీ ఆరా

కీలక సూత్రధారి వినయ్ భరద్వాజ్‌పై కేసు నమోదు



- 24 రాష్ట్రాలకు చెందిన 70 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం చౌర్యం
- అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన సైబరాబాద్ పోలీసులు
- ఇప్పటికే 50 మందికి డేటా విక్రయించిన నిందితుడు వినయ్
- 11 కంపెనీలకు నోటీసులు జారీ చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్

దేశంలోని సగం జనాభా వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి, విక్రయించిన కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టిసారించింది. 70 కోట్ల మంది ప్రజలు, సంస్థలకు చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని చోరీ చేసిన ఫరీదాబాద్ (హరియాణా)కు చెందిన వినయ్ భరద్వాజ్‌పై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేయనుంది. ఇప్పటికే 17 కోట్ల మంది డేటా లీకు కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు నితీశ్ భూషణ్ కుమార్, పూజా కుమారి, సుశీల్ తోమర్, అతుల్ ప్రతాప్ సింగ్, ముస్కాన్ హసన్, సందీప్ పాల్, జియా ఉర్ రెహ్మాన్‌లపై పీఎంఎల్‌ఏ చట్టం కింద కేసు నమోదు చేసి, విచారిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా దేశంలోని అతిపెద్ద డేటా లీకు కేసులో ప్రధాన సూత్రధారి వినయ్ భరద్వాజ్‌పై కూడా ఈడీ కేసులు నమోదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రజల వ్యక్తిగత సమాచారంతోపాటు రక్షణ, టెలికం, విద్యుత్, ఇంధనం, జీఎస్‌టీ వంటి ముఖ్యమైన ప్రభుత్వ శాఖల కీలక సమాచారాన్ని నిందితులు తస్కరించి, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నిందితుల కార్యకలాపాల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణతోపాటు ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు మనీలాండరింగ్

మిగతా 2వ పేజీలో ▶

అమ్ముడైంది రూ. 40 లక్షలకు.. | అందింది రూ. 23 లక్షలు!

టీఎస్‌పీఎస్సీ ఏఈ పరీక్ష పత్రాల విక్రయం సాగిందిలా

- వచ్చిన మొత్తంలో ప్రవీణ్‌కు ముట్టింది రూ.10 లక్షలు
- ఈ విక్రయాల్లో సూత్రధారిగా ఉన్న కేతావత్ రాజేశ్వర్
- నేడు కమిషన్ చైర్మన్ వాంగ్మూలం నమోదుకు చాన్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో 'ఆర్థికాంశాలు'కొలిక్కివచ్చాయి. ఈ పత్రాల విక్రయంలో కేతావత్ రాజేశ్వర్ కీలకపాత్ర పోషించినట్లు సిట్ అధికారులు గుర్తించారు. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నియామక పరీక్షకు సంబంధించిన మూడు ప్రశ్నపత్రాలను రూ.40 లక్షలకు విక్రయించారని, ఇప్పటికే నిందితులకు రూ.23 లక్షలు ముట్టగా మిగతా సొమ్ము పరీక్ష ఫలితాలు వచ్చాక ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నట్లు పోలీసులు తేల్చారు. ఇందులో ఇప్పటికే రూ.8.5 లక్షలు రికవరీ చేశారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పేపర్లను పంచుకున్నారే తప్ప అమ్ముకోలేదని అధికారులు చెబుతున్నారు. టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా పని చేసిన పులిదిండి ప్రవీణ్ కుమార్, మాజీ నెట్‌వర్క్ అడ్మిన్ అట్ల రాజశేఖర్ రెడ్డి సంయుక్తంగా ఈ పేపర్లు తస్కరించినట్లు ఇప్పటికే సిట్ స్పష్టం చేసింది. ఏఈ పరీక్ష పేపర్లను ప్రవీణ్ తన స్నేహితురాలైన రేణుక రాథోడ్, ఆమె భర్త లవడ్యావత్ డాక్యాలకు ఇచ్చాడు. నమ్మకమైన వారికే వీటిని విక్రయించాలని చెప్పాడు. తనకు రూ.10 లక్షలు ఇవ్వాలని చెప్పి రూ.5 లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. డాక్యా ఈ పేపర్ల గురించి సమీప బంధువైన



మిగతా 2వ పేజీలో ▶

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

- కొత్త చైర్మన్‌ను నియమించాకే పరీక్షలు పెట్టాలి: కోదండరాం
- ప్రభుత్వంపై పోరాటానికి అఖిలపక్ష కమిటీ
- కమిటీకి చైర్మన్‌గా కోదండరాం: మల్లు రవి
- లీకేజీపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం

3లో

పుష్పవిలాపం!



- మొక్కలు ఏడుస్తాయట
- బాధ కలిగితే మాట్లాడుకుంటాయట

ఏదైనా బాధ కలిగితే మొక్కలు కూడా ఏడుస్తాయట. అంటే, బాధతో మూలుగుతాయి. తోటి మొక్కలతో ఆ బాధను పంచుకుంటాయి. మొక్కలు ఏడుస్తాయని, తమకే తెలిసిన భాషలో ఇతర మొక్కలతో మాట్లాడతాయని, బాధని పంచుకుంటాయని ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మొక్కలు చేసే ఈ శబ్దాలను కూడా శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారిగా రికార్డు చేశారు. ఈ అధ్యయన ఫలితాలను సైన్స్ జర్నల్ సెల్‌లో ప్రచురించారు.

- వివరాలు 6లో

ఏడాదిలో కిడ్నీ మార్పిడులు 11,423

3,700 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- దేశవ్యాప్తంగా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- అవయవాల దానానికి ముందుకొస్తున్న దాతలు
- పదేళ్లలో మూడింతలైన అవయవ మార్పిడి చికిత్సలు
- డోనర్ల కోసం ఎదురుచూస్తున్న బాధితులూ పెద్ద సంఖ్యలోనే..
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి

14లో



... ఓడిపోవడానికి కాదెహే!

తిరస్కరణకు కారణం చెప్పాల్సిందే

దరఖాస్తుల స్థితిగతులపై 'ధరణి'లో మార్పులకు సీసీఎల్‌ఏ కసరత్తు

ఆమోదించినా లేక తిరస్కరించినా

కలెక్టర్లు కారణాలు తెలిపేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు

సాక్షి, హైదరాబాద్: ధరణి పోర్టల్ ద్వారా వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో కీలక మార్పులు రానున్నాయి. ఇకపై పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను ఆమోదించినా, తిరస్కరించినా అందుకు తగిన కారణాలను కలెక్టర్లు విధిగా తెలియజేసేలా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసేందుకు భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నవీన్ మిత్తల్ కసరత్తు చేస్తున్నారు. రైతుల భూములపై తీసుకొనే నిర్ణయాలకు గల కారణాలు పబ్లిక్ డొమైన్‌లో కనిపించేలా మార్పులు చేస్తున్నారు. అదే జరిగితే దరఖాస్తు తిరస్కరణకు గల కారణం రైతుకు తెలుస్తుందని, మరోసారి అలా తిరస్కారానికి గురికాకుండా అవసరమైన పత్రాలు సమకూర్చుకొనేందుకు, రికార్డులను రెవెన్యూ యంత్రాంగానికి సమర్పించి మళ్లీ దరఖాస్తు చేసుకోవడం ద్వారా సమస్యకు పరిష్కారం పొందేందుకు రైతుకు వీలు కలుగుతుందని, ఈ కోణంలోనే సీసీఎల్‌ఏ స్థాయిలో కసరత్తు జరుగుతోందని తెలుస్తోంది.

ఇప్పటివరకు కారణమేంటో తెలియక..

ప్రస్తుతం ధరణి పోర్టల్ ద్వారా నమోదవుతున్న అర్జీలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. దరఖాస్తు ఎక్కడకు వెళ్లింది... ప్రస్తుతం ఎక్కడ ఉంది? ఏ స్థాయిలో నిర్ణయం తీసుకుంటున్నారు? ఏం నిర్ణయం తీసుకున్నారు? ఎందుకు తీసుకున్నారు? వంటి వివరాలేవీ రైతులకు తెలియట్లేదు. దరఖాస్తును

మిగతా 5వ పేజీలో ▶



త్వరలో మరో 10 మాడ్యూల్స్

ధరణి పోర్టల్ ద్వారా ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం 10వరకు కొత్త మాడ్యూల్స్ కూడా త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. ధరణి పోర్టల్ అందుబాటులోకి రాకముందే 'నాలా' కేటగిరీలోకి మారినా వ్యవసాయ కేటగిరీలోనే నమోదైన భూములు, వారసత్వ హక్కులు కల్పించాల్సిన భూములు, సంస్థల పేరిట పట్టా హక్కులు కల్పించాల్సిన భూముల విషయంలో కొత్త మాడ్యూల్స్ అందుబాటులోకి వస్తున్నాయని సీసీఎల్‌ఏ వర్గాలు చెబుతున్నాయి. అలాగే మరికొన్ని సమస్యలకు కూడా త్వరలోనే ఫుల్‌స్టాప్ పడనుందని అంటున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో పొన్నాల, వీహెచ్, మాణిక్‌రావ్, బోసురాజు, మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు

'పోస్టుకార్డు' ఉద్యమం

రాహుల్ గాంధీపై అనర్హత వేటును తప్పుబడుతూ నిర్వహణ

- నేడు గాంధీభవన్‌లో ప్రారంభించనున్న రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఠాక్రే
- 8న మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్ష
- జై భారత్ సత్యాగ్రహ దీక్షలపై సమావేశంలో నిర్ణయాలు.. హాజరైన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వంపై అనర్హత వేటు వేయడాన్ని తప్పుబడుతూ కాంగ్రెస్ పార్టీ పోస్టుకార్డు ఉద్యమాన్ని నిర్వహించనుంది. సోమవారం గాంధీ భవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఈ ఉద్యమాన్ని ప్రారంభించనున్నారు. అలాగే ఈ నెల 8న మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్ష చేపట్టనున్నారు. ఆదివారం గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ

మిగతా 5వ పేజీలో ▶

15 రోజుల్లో నీరా సెంటర్ల ఏర్పాటు: శ్రీనివాస్‌గౌడ్



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులను ప్రోత్సహిస్తోందని పర్యాటక, ఎక్సైజ్ శాఖమంత్రి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. రానున్న పదిహేను రోజుల్లో నగరంలో నీరా సెంటర్లను ఏర్పాటు చేయడంతో పాటు గౌడ భవనాన్ని కూడా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఆదివారం రవీంద్రభారతిలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వాయి పాపన్నగౌడ్ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మహనీయుల జయంతి, వర్ధంతిలను ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ అన్నివర్గాల ప్రజల కోసం కృషి చేశారని తెలిపారు. పాపన్న ఆలోచనలను యువతరానికి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ కమిషన్ సభ్యులు కిశోర్‌గౌడ్, గౌడ హాస్టల్ చైర్మన్ పల్లె లక్ష్మణ్‌రావుగౌడ్, గౌడ సంఘాల నాయకులు పల్లె రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డేటా లీకుపై ఈడీ ఆరా

▶ మొదటి పేజీ తరువాయి

కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం.

అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు 24 రాష్ట్రాలకు చెందిన ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని నిందితులు విక్రయానికి పెట్టారు. దీంతో అన్ని రాష్ట్రాల పోలీసులను సైబరాబాద్ పోలీసులు అప్రమత్తం చేశారు. వినయ్ భరద్వాజ్ ఏడాది కాలంగా ఫరీదాబాద్ కేంద్రంగా డేటా నిల్వ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఇన్‌స్పైర్ వెబ్జ్ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటివరకు 50 మందికి డేటాను విక్రయించినట్టు విచారణలో పోలీసులు గుర్తించారు. దీంతో నిందితుడి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లతోపాటు బ్యాంకు లావాదేవీలను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఏడాది కాలంగా నిందితులు డేటా చోరీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. ఏ రాష్ట్ర పోలీసులకు చిక్కకపోవటం గమనార్హం.

ఈ-కామర్స్ కంపెనీలు, బ్యాంకులకు నోటీసులు

ఈ-కామర్స్, ఐటీ కంపెనీలు వినియోగదారుల సమాచారంలో గోప్యత, భద్రత పాటించకపోవడం వల్లే డేటా లీకైనట్టు సైబరాబాద్ పోలీసులు నిర్ధారించారు. యూజర్ల సెన్సిటివ్ పర్సనల్ డేటా ఇన్ఫర్మేషన్ (ఎస్‌పీడీఐ)ను గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత సంస్థలదే. కానీ, ఆయా సంస్థలు ఐటీ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినట్టు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. దీంతో ఆయా ఈ-కామర్స్ కంపెనీల చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లను విచారించాలని నిర్ణయించారు. ఈ మేరకు బిగ్ బాస్కెట్, ఫోన్ పే, ఫేస్‌బుక్, క్లబ్ మహీంద్రా, పాలసీ బజార్, అస్యూట్ గ్రూప్, యాక్సిస్ బ్యాంకు, మ్యాట్రిక్స్, టెక్ మహీంద్రా, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థలకు సెక్షన్ 91 కింద నోటీసులు జారీ చేశారు.

నేటి భవితలో..



నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

- **స్కిల్ వలప్‌మెంట్: సెంట్రల్ బ్యాంక్‌లో అప్రెంటీస్!** బ్యాంకింగ్ రంగమంటే యువతకు ఎంతో క్రేజ్! బ్యాంకు కొలువులో చేరాలని.. ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవాలని కోరుకుంటారు. ఇలాంటి వారు బ్యాంకింగ్ రంగంలో క్షేత్ర నైపుణ్యాలు సొంతం చేసుకొని.. భవిష్యత్తులో కొలువుల సాధనలో ముందంజలో నిలిచే అవకాశం కల్పిస్తోంది.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా! ఆన్ జాబ్ ట్రైనింగ్ పేరుతో.. బ్యాంకుల్లోని పనితీరుపై శిక్షణ అందిస్తోంది. ఇందుకోసం తాజాగా అయిదు వేల అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. అప్రెంటీస్ ట్రైనీ నోటిఫికేషన్, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు...
- **గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్:** పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ ..అఫైర్స్ రౌండప్
- **విద్య, ఉద్యోగ సమాచారం**



ఇవీ ప్రత్యేకతలు.....

- ఈ విగ్రహం కోసం ఆగ్రా, నోయిడా, జైపూర్ తదితర ప్రాంతాల నుంచి ఎరుపు, గోధుమ రంగురాళ్లను తెప్పించారు.
- విగ్రహం పటిష్టంగా ఉండేందుకు లోపలి వైపు స్టీల్‌ను, పాలీయురేథీన్ కెమికల్స్‌తో విగ్రహానికి కోటింగ్ చేస్తున్నారు. స్టీల్ స్ట్రక్చర్ అతిభారీ తుపాన్లను కూడా తట్టుకొనేందుకు దోహదం చేయనుండగా రసాయన కోటింగ్ వాతావరణ కాలుష్యానికి విగ్రహం దెబ్బతినకుండా కాపాడనుంది.
- విగ్రహ విడిభాగాలన్నింటినీ నోయిడాలోనే తయారు చేయించి లారీల్లో హైదరాబాద్‌కు తరలించారు.

రాష్ట్రంలో భారీ విగ్రహాలు ఇవే...

శంషాబాద్ వద్ద ఏర్పాటు చేసిన రామానుజుడి సమతామూర్తి విగ్రహం **216** అడుగులు..

అంబేడ్కర్ విగ్రహం **125** అడుగులు..

హుస్సేన్‌సాగర్‌లోని బుద్ధుని విగ్రహం **58** అడుగులు

‘బాబా సాహెబ్’కు తుదిమెరుగులు

125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు ముమ్మర ఏర్పాట్లు



- చివరిదశకు చేరుకున్న ల్యాండ్‌స్కేపింగ్ పనులు
- సిద్ధమవుతున్న ఆడియో, వీడియో కాన్ఫరెన్స్ హాళ్లు, లైబ్రరీ

సాక్షి, హైదరాబాద్: దేశ రాజ్యాంగ నిర్మాత, భావి భారత స్ఫూర్తిప్రదాత బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల ఎత్తయిన భారీ విగ్రహం ఆవిష్కరణకు దాదాపుగా సిద్ధమైంది. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఈ విగ్రహానికి కళాకారులు తుదిమెరుగులు దిద్దుతున్నారు. దేశ భవిష్యత్తు కోసం దిశానిర్దేశం చేస్తున్నట్లుగా ఎడం చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకొని కుడి చేతిని ముందుకు చాచి గొప్ప ఆత్మవిశ్వాసంతో చూస్తున్న బాబా సాహెబ్ విగ్రహం నెక్లెస్ రోడ్డులో ఇప్పుడు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒకవైపు రాష్ట్ర పరిపాలన కేంద్రమైన నూతన సచివాలయం మరోవైపు కోట్లాది మంది తెలంగాణ ప్రజల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షల కోసం ప్రాణాలొడ్డిన అమరుల స్మారకం... అంబేడ్కర్ భారీ విగ్రహం ఏర్పాటుతో నెక్లెస్‌రోడ్డు మరింత చారిత్రక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది.

ఆరేళ్ల యజ్ఞం....

అంబేడ్కర్ 125వ జయంతి సందర్భంగా ఆయన 125 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ 2016లో ప్రకటించారు. ఆ ఏడాది అంబేడ్కర్ జయంతి రోజున నెక్లెస్‌రోడ్డులోని ఎన్టీయార్ పార్కు పక్కన 11.4 ఎకరాల స్థలాన్ని కేటాయించి అదేరోజు భూమి పూజ కూడా చేశారు. నిజానికి ఏడాది వ్యవధిలోనే విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అనేక కారణాల వల్ల జాప్యం జరిగింది. ఆరేళ్ల నిరీక్షణ తర్వాత ఇప్పుడు విగ్రహం రూపుదిద్దుకుంది. సుమారు రూ. 146 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి.

155 టన్నుల స్టీల్ | 111 టన్నుల కంచు

మహారాష్ట్రకు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ట్, పద్మభూషణ్ రాంవంజి సుతార్, ఆయన కుమారుడు అనిల్ సుతార్‌లు అంబేడ్కర్ భారీ కళాఖండానికి రూపకర్తలు. బాబాసాహెబ్ గంభీరమైన విగ్రహాన్ని మమ్మూర్తులా రూపొందించడంలో వారి అద్భుతమైన ప్రతిభ కనిపిస్తుంది. ఎలాంటి ప్రతికూల వాతావరణాన్ని అయినా తట్టుకొనేవిధంగా విగ్రహం నిర్మాణం చేపట్టారు. విగ్రహం కోసం 155 టన్నుల స్టీల్‌ను, 111 టన్నుల కంచును వినియోగించారు. విగ్రహం బయటి వైపు లేయర్ కోసమే సుమారు 9 టన్నుల కంచును వాడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ విగ్రహం వెడల్పు 45 అడుగులు ఉంటుంది. కింద పార్లమెంటు ఆకృతిలో ఏర్పాటు చేసిన పీఠం 50 అడుగుల ఎత్తు ఉంటుంది. ప్రస్తుతం పనులు చివరి దశకు చేరుకున్నాయి. గ్రీనరీ ఏర్పాటు చేయవలసి ఉంది. అలాగే బేస్‌మెంట్‌లోని హాళ్లలో అంబేడ్కర్ జీవితంపై విస్తారమైన సమాచారంతో కూడిన గ్రంథాలయం, ఆయన జీవిత విశేషాలను, రాజ్యాంగ రచనాకాలం నాటి ఫొటోలను ఏర్పాటు చేయనున్నారు. ఆడియో, వీడియో ప్రదర్శనలు కూడా ఉంటాయి. ఈ పనులు ఇంకా పూర్తి చేయవలసి ఉంది. అలాగే విగ్రహం చుట్టూ గ్రీనరీ ఏర్పాటు చేయాలి. అన్ని పనులు పూర్తయితే ఆహ్లాదభరితమైన వాతావరణంలో మహనీయుడి అద్భుతమైన విగ్రహాన్ని వీక్షించవచ్చు.

రానున్న రెండ్రోజులు సాధారణ ఉష్ణోగ్రతలే

ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి.. దీని ప్రభావంతో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: ఉత్తర ఛత్తీస్‌గఢ్ మీదుగా తెలంగాణ నుంచి ఏపీ, తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఇది సముద్రమట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వివరించింది. ఆదివారం రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో గరిష్టంగా 38.3 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 18.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండ్రోజులు రాష్ట్రంలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయని వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు ఉష్ణతాపం నుంచి ఉపశమనం కలిగించే వార్తను భారత వాతావరణ శాఖ మోసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ వేసవిలో దడపుట్టించే ఎండలు, వడగాడ్పులకు అంతగా ఆస్కారం ఉండదని తెలిపింది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం గానీ అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తాజా నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు కొనసాగే ఎండాకాలం సీజనులో దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో వేసవి తాపం అంతగా ఉండదని పేర్కొంది.

తెలంగాణ, ఏపీల్లోని ఆదివారం ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.6	22.9
రెంటచింతల	39.5	28.2
కడప	39.2	26.0
ఆదిలాబాద్	38.3	18.2
మహబూబ్‌నగర్	38.2	23.4
నిజామాబాద్	37.5	2.3
భద్రాచలం	36.8	26.5
రామగుండం	36.8	23.4
ఖమ్మం	36.6	26.0
మెదక్	36.2	20.8
హైదరాబాద్	35.9	23.5
దుండిగల్	35.0	22.3
నల్లగొండ	35.0	21.0
హకీంపేట్	34.8	20.0
హనుమకొండ	34.5	23.5
విశాఖపట్నం	33.8	24.8

ఈ నెలాఖరుకు ఇంటర్ ఫలితాలు!

- మొదటి, రెండో ఏడాది ఒకేసారి... మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- మొదలైన మూల్యాంకన ప్రక్రియ... ఆన్‌లైన్ మూల్యాంకనకు తాత్కాలిక బ్రేక్



సాక్షి, హైదరాబాద్: పరీక్షలు పూర్తయిన నెలరోజుల్లోపే ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడనున్నాయి. మార్చి 15 నుంచి మొదలైన ఇంటర్ పరీక్షలు ఈ నెల 4వ తేదీతో ముగియనున్నాయి. ప్రధాన సబ్జెక్టుల పరీక్షలన్నీ ఇప్పటికే పూర్తికాగా, 4న మాడ్రన్ లాంగ్వేజ్, జాగ్రఫీ పరీక్షలు మాత్రమే జరగనున్నాయి. ఏప్రిల్ నెలాఖరులోగా ఇంటర్ ఫలితాలు విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సమాధానపత్రాల మూల్యాంకన ప్రక్రియ మొదలైంది. రాష్ట్రంలోని పాత ఉమ్మడి జిల్లాల్లో ప్రతీ చోట మూల్యాంకన ఏర్పాటు చేశారు. మూల్యాంకనకు నైపుణ్యం గల అధ్యాపకుల ఎంపిక కూడా జరిగింది. ముందుగా పరీక్షలు జరిగిన పేపర్లకు మూల్యాంకన మొదలుపెట్టినట్టు అధికారులు చెబుతున్నారు. మొదటి, రెండో ఏడాదికి కలిపి మొత్తం 9.6 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. తొలుత 35 లక్షల సమాధానపత్రాలను ఆన్‌లైన్ విధానంలో మూల్యాంకన చేపట్టాలని నిర్ణయించారు. విద్యార్థుల సమాధానపత్రాలను స్కాన్ చేసి, వెబ్‌సైట్‌లో ఉంచి, అవసరమైన అధ్యాపకులు లాగిన్ అయి, మూల్యాంకన చేపట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. కానీ, ఈలోగా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్, కొన్ని నెలల క్రితం ఇంటర్ బోర్డ్ సీసీ కెమెరాల డేటా టాంపర్ అవడంతో అధికారులు కాస్తా వెనకడుగు వేశారు. ఈసారి ఆఫ్‌లైన్ ద్వారానే మూల్యాంకన చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ రెండోవారం ముగుస్తుందని భావిస్తున్నారు. ఆ తర్వాత వారం రోజుల్లో మార్కుల క్రోడీకరణ పూర్తి చేసి, ఒకటి రెండు రోజులు ట్రయల్‌రన్ వేయాలని నిర్ణయించారు. అంతిమంగా ఏప్రిల్ 30 నాటికి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు విడుదల చేసే యోచనలో బోర్డ్ అధికారులున్నారు. దీనివల్ల ఎంసెట్‌కు వెళ్లే విద్యార్థులకు ఇబ్బంది ఉండదని, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీని వెంటనే నిర్వహించడం సాధ్యమని భావిస్తున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు వీలు కాని పక్షంలో మే తొలి వారంలో ఫలితాల విడుదలవుతాయని ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

అమ్ముడైంది రూ.40 లక్షలకు.. అందింది రూ.23 లక్షలు!

▶ మొదటి పేజీ తరువాయి

కేతావత్ రాజేశ్వర్‌కు చెప్పాడు. ఇతడు మధ్యవర్తుల ద్వారానే గోపాల్, నీలేశ్, ప్రశాంత్, రాజేంద్రకుమార్‌లకు రూ.40 లక్షలకు విక్రయించాడు. వీరి నుంచి రూ. 23 లక్షలు వసూలు చేసిన రాజేశ్వర్.. డాక్యాకు రూ.10 లక్షలిచ్చాడు. తన వాటాగా వచ్చిన దీని నుంచి ఇతగాడు మరో రూ.5 లక్షలు ప్రవీణ్‌కు ఇచ్చాడు. ప్రవీణ్ తన వద్దకు వచ్చిన డబ్బులోంచి (మొత్తం రూ.10 లక్షలు) రూ.4 లక్షలు ఇంట్లోనే ఉంచుకుని, రూ.3.5 లక్షలు తన బంధువుకు ఇచ్చాడు. ఓ బీమా పాలసీకి సంబంధించి రూ.1.2 లక్షలు చెల్లించాడు. మిగిలిన మొత్తం ఇతర ఖర్చులకు వాడేశాడు. ఈ సొమ్ములో సిట్ అధికారులు రూ.7.5 లక్షలు రికవరీ చేశారు.

గ్రామానికి రూ.8 లక్షలు వెచ్చించిన రాజేశ్వర్

గతంలో చిట్టీల వ్యాపారం చేసిన రాజేశ్వర్ నష్టాలు రావడంతో ఆపేశాడు. ఇతడి తల్లి ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం మన్సూర్‌పల్లి తండాకు సర్పంచ్‌గా ఉన్నారు. ఈమె తరఫున గ్రామంలో అభివృద్ధి పనులను ఇతడే పర్యవేక్షిస్తుంటాడు. పేపర్లు విక్రయించగా వచ్చిన మొత్తంలో డాక్యాకు ఇచ్చింది మినహా మిగిలింది తన వద్దే ఉంచుకున్నాడు. పరీక్ష ఫలితాలు వచ్చిన తర్వాత చేతికందే రూ.17 లక్షల నుంచి మిగిలిన వారికి వాటాలు ఇవ్వాలనుకున్నాడు. తన వద్ద ఉన్న సొమ్ములో రూ.8 లక్షలు వెచ్చించి గ్రామంలో అభివృద్ధి పనులు చేశాడు. వీటికి సంబంధించిన బిల్లులు ప్రభుత్వం మంజూరు చేశాక ఆ మొత్తం తాను తీసుకోవాలని భావించాడు. విచారణలో సిట్ అధికారులకు ఈ విషయం తెలిసింది. దీంతో ఆ బిల్లులకు సంబంధించిన మొత్తం తమకు అందేలా చర్యలు తీసుకోవాలని సిట్ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాయనున్నారు. అలా వచ్చిన మొత్తాన్ని సీజ్ చేసి కోర్టుకు సమర్పించాలని భావిస్తున్నారు.

చైర్మన్‌కు నోటీసులు ఇవ్వకుండా...

సిట్ అధికారులు శనివారం కమిషన్ కార్యదర్శి అనిత రామచంద్రన్, సభ్యుడు లింగారెడ్డిని ప్రశ్నించి వాంగ్మూలాలు నమోదు చేశారు. టీఎస్‌పీఎస్సీలో ప్రశ్నపత్రాలకు సంబంధించిన కాన్ఫిడెన్షియల్ సెక్షన్ చైర్మన్ ఆధీనంలోనే పని చేస్తుంది. ఈ స్కామ్ మొత్తం ప్రశ్నపత్రాలకు సంబంధించిందే కావడంతో చైర్మన్ వాంగ్మూలం నమోదు అనివార్యంగా మారింది. అయితే కార్యదర్శి, సభ్యులు, ఉన్నతోద్యోగుల మాదిరిగా చైర్మన్‌కు నోటీసులు జారీ చేయడం సాధ్యం కాదని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈ పోస్టు రాజ్యాంగ బద్ధమైంది కావడంతోపాటు ప్రస్తుత చైర్మన్ సీనియర్ ఐఏఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో ఆయనకు నోటీసులు జారీ చేయడానికి బదులు స్టేట్‌మెంట్ తీసుకోవాలని సిట్ అధికారులు నిర్ణయించారు. సోమవారమే దీన్ని పూర్తి చేయాలని భావిస్తున్నారు.

మోదీ వస్తున్నారు

▶ మొదటి పేజీ తరువాయి

ఆరోపణలు చేస్తోంది. ఇందుకు దీటుగా బీఆర్ఎస్ నేతలు విమర్శలు, ప్రత్యారోపణలతో విరుచుకుపడుతున్నారు. ఇలాంటి సమయంలో మోదీ రాష్ట్ర పర్యటన ఉత్కంఠ రేపుతోంది. బహిరంగ సభలో మోదీ ఏం మాట్లాడుతారు, ఎలాంటి విమర్శలు చేస్తారన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఇప్పటికే చర్చలు మొదలయ్యాయి. కొన్ని నెలల్లో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో ప్రధాని మాట్లాడే అంశాలు, ఆ తర్వాత జరిగే పరిణామాలు.. రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసేలా ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి

వచ్చే 40 ఏళ్ల వరకు కూడా ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలను అందించగలిగేలా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం చుట్టనున్నారు. ప్రస్తుతం స్టేషన్‌కు 25 వేల మంది ప్రయాణికుల సామర్థ్యం ఉండగా.. భవిష్యత్తులో రద్దీ సమయాల్లో 3,25,000 మందికి సరిపోయేలా రైల్వేస్టేషన్ సామర్థ్యాన్ని పెంచనున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతమున్న 11,427 చదరపు మీటర్ల బిల్డింగ్ ఏరియాను అంతర్జాతీయ ప్రమాణాలతో 61,912 చదరపు మీటర్లకు పెంచటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. టెర్మినల్ బిల్డింగ్ నుంచి అన్ని ప్లాట్‌ఫామ్‌లను కలిపేలా 108 మీటర్ల ప్రత్యేక డబుల్ లెవెల్ వంతెనను ఏర్పాటు చేయనున్నారు. ఆధునీకరణ పనుల్లో భాగంగా ఈస్ట్, వెస్ట్ మెట్రోస్టేషన్లకు, రేతిఫైల్ బస్‌స్టేషన్‌కు నేరుగా కనెక్టివిటీని ఏర్పాటు చేయనున్నారు. మల్టీలెవెల్ కార్ పార్కింగ్, ప్రయాణికులకు ప్రత్యేక మార్గాల ఏర్పాటు వంటి వసతులను కల్పిస్తారు.

ప్రధాని కార్యక్రమాలు ఇవీ

ఈ నెల 8న తెలంగాణ పర్యటనలో భాగంగా మొత్తం రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శ్రీకారం చుడతారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. ఆ షెడ్యూల్ ప్రకారం..

- మోదీ ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి వస్తారు. అక్కడి నుంచి నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడ సికింద్రాబాద్– తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ఇది దేశంలో ప్రవేశపెట్టనున్న 13వ వందేభారత్ రైలు)ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు.
- రూ.715 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారు. సికింద్రాబాద్– మహబూబ్‌నగర్ మధ్య రూ.1,410 కోట్ల వ్యయంతో నిర్మించిన 85 కిలోమీటర్ల డబ్లింగ్ రైల్వేలైన్‌ను జాతికి అంకితం చేస్తారు.
- ప్రజల రైలుగా మన్ననలు పొందిన ఎంఎంటీఎస్ ఫేస్–2 లో భాగంగా హైదరాబాద్ శివారు పట్టణాల వరకు నిర్మించిన నూతన రైల్వే లైన్ల మీదుగా నడిచే 13 కొత్త ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రారంభిస్తారు.
- ఎంఎంటీఎస్ ఫేస్–2లో భాగంగా బొల్లారం–మేడ్చల్ మధ్య 14 కిలోమీటర్లు, ఫలక్‌నుమా–ఉందానగర్ మధ్య 14 కిలోమీటర్ల కొత్త డబ్లింగ్ లైన్లను నిర్మించారు. ఈ అభివృద్ధి పనులు, వాటి ప్రయోజనాలపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను ప్రధాని తిలకించనున్నారు. తర్వాత సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి పరేడ్‌గ్రౌండ్‌లో బహిరంగ సభా స్థలికి ప్రధాని చేరుకుంటారు.
- సభా వేదిక వద్దే రూ.7,864 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 6 జాతీయ రహదారులకు, రూ.1,366 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్‌లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రసంగిస్తారు.

ఆఖరి నిమిషంలో సాధనా కీలకమే

ఒక్కో సబ్జెక్టుకు ఒక్కో రీతిన పునశ్చరణతో ఉపయోగం

టెన్త్ పరీక్షల ప్రిపరేషన్‌పై నిపుణుల సూచనలతో ‘సాక్షి’కథనం

టెన్త్‌లో మంచి మార్కులు సాధించాలని ప్రతి విద్యార్థీ ఆరాట పడతారు. మరికొద్ది గంటల్లో జరిగే పదో తరగతి పరీక్షలకు ఆఖరి నిమిషంలో సాధనా కీలకమేనని గత అనుభవాలు చెబుతున్నాయి. పరీక్ష రాసే సబ్జెక్టును ఏ విధంగా చదువుకుంటే మంచి మార్కులొస్తాయి? అనే విషయాన్ని ‘సాక్షి’అనేక మంది నిపుణుల ద్వారా సేకరించిన సూచనలను క్రోడీకరించి అందిస్తోంది. టెన్త్ పరీక్షలు ఈసారి గతంకన్నా భిన్నమైనవని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. 11 పేపర్లకు బదులు ఆరు పేపర్లే ఇస్తున్నారు. సైన్స్ రెండు పేపర్లనూ వెంటవెంటనే రాయాల్సి ఉంటుంది. ఏదేమైనా టెన్షన్ విడిచి పెట్టి, పరీక్షకు వెళ్ళే ముందు ఒక్కసారి తేలికైన పద్ధతిలో, అంశాల వారీగా పునశ్చరణ చేసుకుంటే టెన్త్ పరీక్షల్లో మార్కులపై నూటికి నూరు శాతం పట్టు సాధించడం ఖాయమనే చెప్పాలి.


- సాక్షి, హైదరాబాద్

భయం వదిలేస్తే గణితంలో వందశాతం

గణితంలో మంచి మార్కులు రావాలంటే ముందు భయాన్ని పోగొట్టుకోవాలి. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రం అధ్యాయాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలి. పాఠ్యాంశాల చివరలో ఉండే సమస్యలన్నీ మరోసారి రివిజన్ చేస్తే మంచి మార్కులొస్తాయి. గ్రాఫ్‌లు, నిర్మాణాల సమస్యలకు సమాధానాలు కనుగొనడంపై దృష్టి పెడితే నూటికి నూరు మార్కులు సాధించే వీలుంది.

మార్కుల తంత్రం ఆంగ్లం..

పార్ట్–ఏలో బీ, సీ సెక్షన్లపై దృష్టి పెట్టాలి. అక్షర దోషాలు లేకుండా రాసేందుకు ప్రయత్నించాలి. లేబుల్స్, పై డయాగ్రమ్స్, బార్ డయాగ్రమ్స్, చార్ట్స్ వంటి వాటిపై ఎక్కువ శ్రద్ధతో రివిజన్ చేయాలి. పాఠ్యాంశాలను సొంతంగానే విశ్లేషించే సామర్థ్యం ఉందనే భావనతో ఉండాలి. ముఖ్యమైన పద్యాలు, యాంటనిమ్స్, సినానిమ్స్, ప్యాసివ్ వాయిస్‌ను ఒక్కసారి సాధన చేస్తే పరీక్ష తేలికవుతుంది. ఆంగ్లంలో విద్యార్థుల విశ్లేషణ నైపుణ్యాన్ని పెంచుకుంటే పరీక్షల్లో ప్రతిభను చాటే అవకాశంగానే భావించాలి. వ్యాసాలు చదువుతూ సాధన చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి.



తెలుగులో అక్షర దోషం రానివ్వొద్దు...

తెలుగులో పద్య, గద్య భాగాలు ముఖ్యమైనవి. ఇంతకాలం సాధన చేసిన వాటినే పునశ్చరణ చేస్తే మేలు. రామాయణ పాఠంపై పట్టు ఉంటే 12 మార్కులు వచ్చే వీలుంది. బట్టీ విధానం కాకుండా రామాయణ ఉద్దేశ్యాన్ని, సారాంశాన్ని అర్థం చేసుకుంటే సమాధానాలు తేలికగా రాయొచ్చు. ఉపవాచకంలోనూ పాత్రల స్వభావాన్నే తెలుసుకుంటే మంచిది. వ్యాకరణంలో సంధులు, సమాసాలు, చందస్సు, అర్థాలు, సొంత వ్యాక్యాలు, ప్రకృతి, వికృతులు, ఉత్పత్త్యార్థాలపై దృష్టి పెట్టాలి. అక్షర దోషాలను రానివ్వకుండా ఉంటే మంచి మార్కులొచ్చే వీలుంది.

పాత ప్రశ్నపత్రాల సాధనతో హిందీలో మెరుగైన మార్కులు..

భాషాదోషాలు లేకుండా రాస్తే హిందీలో ఎక్కువ మార్కులు సాధించే వీలుంది. హిందీ ‘పార్ట్–ఏ’లో 60 మార్కులుంటాయి. పేరాగ్రాఫ్‌కు 20 మార్కులిస్తారు. వాటిని చదవి అర్థం చేసుకుంటే సమాధానాలు తేలికగా రాయొచ్చు. వ్యాసాలు, లేఖారచన ద్వారా సృజనాత్మకతను పరిశీలిస్తారు. ప్రశ్నలన్నీ బహుళ ఐచ్ఛిక రూపంలో ఉంటాయి. పాఠ్యపుస్తకంలోని భాషా కీ బాత్ ఆధారంగా అభ్యసిస్తే మేలు జరుగుతుంది. ఒక్కసారి పాత ప్రశ్నపత్రాలు సాధన చేసే మంచి మార్కులు సాధించే వీలుంది.

సాంఘికం పద్ధతి ఇలా...

సాంఘిక శాస్త్రాన్ని రివిజన్ చేసేప్పుడు కచ్చితంగా తేలికైన వాటిని ముందుగా చదవాలి. ఆ తర్వాత కఠిన అంశాలు ఒకటికి రెండుసార్లు చదవాలి. పార్ట్–ఏలో 60 మార్కులు, పార్ట్–బీలో 20 మార్కులుంటాయి. భేదాలు, పోలికలు, ఉదాహరణలతో సమాధానాలివ్వడం ముఖ్యం. హిమాలయాల ప్రాధాన్యత, పశ్చిమ కనుమల మధ్య భేదాలు, వాతావరణంలో వచ్చే మార్పులు, జనాభా పెరుగుదలకు కారణాలు, వలసల వర్గీకరణ, ఉత్పత్తి కారకాలు, ప్రపంచీకరణ ప్రభావం, ఆహార భద్రత ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ యుద్ధాలకు కారణాలు, ఆర్థిక మాంద్యం ప్రభావం వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. సమాచార, పట నైపుణ్యం, ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యలు రాయడంపై చివరి వరకూ సాధన చేయాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై రివిజన్ చేసుకుంటే మంచిది.

ప్రధాన హెడ్డింగుల్లో ‘భౌతిక’ రహస్యం

భౌతిక శాస్త్రంలో ప్రయోగాలపై పట్టు సాధిస్తే పరీక్షల్లో పూర్తి మార్కులొస్తాయి. ప్రయోగ సమాచార సేకరణలో నైపుణ్యాలు, బొమ్మలు, నిత్య జీవితంలో వాటి వినియోగం అంశాలపై దృష్టి పెట్టాలి. పార్ట్–ఏ అంశాలను అప్లికేషన్ అప్రోచ్‌తో చదవాలి. నిజజీవిత ఘటనలతో పాఠ్యాంశాలను అన్వయించుకోవాలి. విషయ అవగాహనతోపాటు ప్రశ్నించడం, పరికల్పన చేయడం, ప్రయోగాలు, క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్టు పనులు పట్టాలు తదిత అంశాలపై అధ్యయనం చేయాలి. ప్రధాన హెడ్డింగులు గుర్తుంచుకుంటే సమాధానాలు బాగా రాసే వీలుంది. కాంతి పరివర్తనం, వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కర్బన సమ్మేళనాలపై దృష్టి పెట్టాలి. వర్గీకరణ, రసాయన సమీకరణలు వస్తాయి. లఘు, అతిలఘు బహుళైచ్ఛిక ప్రశ్నలు సులభంగా రాసి ఎక్కువ మార్కులు పొందొచ్చు.

తులనాత్మకతతోనే జీవశాస్త్రం..

గతానికి భిన్నంగా భౌతిక, జీవశాస్త్రాల పరీక్షలు ఒకేరోజు రాయాల్సి ఉంటుంది. ఒక్కో పరీక్షకు గంటన్నర సమయం ఉంటుంది. కాబట్టి జీవ శాస్త్రంలో విషయంపై పట్టుకోసం రివిజన్ చేసుకోవాలి. ఇది కూడా స్వీయ విశ్లేషణతో ముందుకెళ్లాలి. చాలామందిలో రెండు పరీక్షలున్నాయనే భయం, ఒత్తిడి కనిపిస్తున్నాయి. దీన్ని దూరం చేసుకోవాలి. అంశాలవారీగా చార్టులు, బ్లాక్ డయాగ్రమ్స్‌ను సొంతంగా తయారు చేసుకొని చదివితే పరీక్ష రాయడం తేలిక. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనం చేస్తే మంచి ఫలితాలొస్తాయి. అన్వయం చేసేటప్పుడు వాస్తవ పరిస్థితులను గుర్తుకు తెచ్చుకోవాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై ఎక్కువ అగాహన ఉంటే పూర్తి మార్కులు రాబట్టడం కష్టమేమీ కాదు. పోషణ, శ్వాసక్రియ, ప్రసరణ, విసర్జన, నియంత్రణ సమన్వయ వ్యవస్థలు, ప్రత్యుత్పత్తి వంటి వాటిపై లోతుగా రివిజన్ చేసుకుంటే మంచిది.

క్లుప్తంగా...



ప్రజల నడ్డి విరుస్తున్న బీజేపీ ప్రభుత్వం

మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్

మరిపెడ: పెట్రోల్, గ్యాస్, నిత్యావసరాల ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ విమర్శించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడారు. అక్రమ కేసులతో కేంద్ర సర్కారు రాష్ట్ర ప్రభుత్వాన్ని భయపెడుతోందని, సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ ప్రజలు ధైర్యంగా ఎదుర్కొంటారని తెలిపారు. తెలంగాణలో ఇతర రాజకీయ పార్టీల మధ్య కుల, మతాల చిచ్చు పెట్టాలని బీజేపీ చూస్తోందని మంత్రులు ఆరోపించారు. గ్రామాల్లో ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఫలాల గురించి కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, బీఆర్ఎస్ నాయకులు రంగారెడ్డి, రవిచంద్ర, పార్టీ మహబూబాబాద్ జిల్లా పరిశీలకులు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, జెడ్పీ చైర్మన్ బిందు తదితరులు పాల్గొన్నారు.


దేశంలో బలమైన శక్తిగా బీఆర్ఎస్: వేముల



సాక్షి, కామారెడ్డి: దేశంలో బీఆర్ఎస్ పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతోందని రోడ్లు, భవనాల శాఖమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశానికి కేసీఆర్ నాయకత్వం వహించడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో వేముల మాట్లాడారు. మహారాష్ట్ర ప్రజలు కేసీఆర్ పథకాలను చూసి మనతో కలిసి నడవడానికి ముందుకు వస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మిగతా రాష్ట్రాల్లోనూ బీఆర్ఎస్ ప్రభంజనం ఖాయమని చెప్పారు. ప్రధాని నరేంద్రమోదీ సంపదనంతా అదానీ లాంటి వాళ్లకు దోచిపెడుతున్నారని, దీన్ని సీఎం కేసీఆర్ ఎండగడుతుండటంతోనే ఈడీతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక పాలనపై పోరాటం కొనసాగిస్తామని వేముల తెలిపారు. పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిలర్, బ్రోకర్ అంటూ విరుచుకుపడ్డారు. రేవంత్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని, నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్ పాల్గొన్నారు.


కేంద్రం తీరుతో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మిర్యాలగూడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో భవిష్యత్తులో ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకంగా మారనుందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు మోదీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్నారు. దేశాన్ని సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలు పాలిస్తున్నాయని, ఇది దేశ మనుగడకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ వ్యవస్థకు విఘాతం కలిగించే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర హక్కులను జీఎస్టీ పేరుతో హరించి వేస్తోందని పేర్కొన్నారు. గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధికి అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కేంద్రం తీరు పట్ల కేసీఆర్ బలంగా కొట్లాడుతున్నారని, దీనికి అన్ని పక్షాలు కలిసి రావాలని కోరారు. పేపర్ లీకేజీపై ప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. సమయం వచ్చినప్పుడు అవసరం అనుకున్నప్పుడు తన వారసుడు రాజకీయాలకు వస్తాడని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ప్రధాని పదవికి తలవంపులు: నిరంజన్



సాక్షి, హైదరాబాద్: తన ప్రతిష్టను నాశనం చేయడానికి కొందరు దేశం లోపల, కొందరు బయట పనిచేస్తున్నారని, వారికి సుపారీ ఇచ్చారంటూ.. ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించడం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారిక కార్యక్రమాల్లో రాజకీయ వ్యాఖ్యలు చేయడం ద్వారా మోదీ ప్రధాని పదవికి ఉన్న ప్రతిష్టను దిగజారుస్తున్నారని విమర్శించారు.

చీమ.. ఓ అల్పజీవి. కానీ.. ఒకప్పుడు పరిమాణంలో హమ్మింగ్ బర్డ్ అంత పెద్ద చీమలు పిపీలిక సామ్రాజ్యాన్ని ఏలాయట. ఇటీవల లభించిన చీమ శిలాజాన్ని బట్టి 47 మిలియన్ ఏళ్ల కిందట మహా భారీ చీమలు ఉండేవని శాస్త్రవేత్తలు తేల్చారు. చీమ జాతుల్లో ఏకంగా 30 ఏళ్లు జీవించేవి కూడా ఉండటం విశేషమే. కాగా.. చీమలు వేడి వాతావరణంలోనే జీవించడానికి ఇష్టపడతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. వర్షాకాలం, శీతాకాలంలో చలికి తట్టుకోలేక మన ఇళ్లల్లోకి చొరబడి తలదాచుకుంటాయని.. వంటింట్లోని ఆహార పదార్థాలను దోచుకుపోతాయని వెల్లడించారు.

పిట్టంత పిపీలికం

హమ్మింగ్ బర్డ్ సైజులో ఉండే చీమ శిలాజం గుర్తింపు

- డైనోసార్ల కాలం నుంచి చీమల జాతి మనుగడ
- డెన్మార్క్‌లో 99 మిలియన్ ఏళ్ల కిందటి చీమ నమూనా గుర్తింపు
- వెచ్చని వాతావరణమే వాటికి ఇష్టం
- చలికాలంలో ఇళ్లల్లోకి చొరబడి ఆహార అన్వేషణ
- నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ ప్రొసీడింగ్స్‌లో ప్రచురణ
- భూమిపై ప్రతి వ్యక్తికి 2.50 మిలియన్ల చీమలు
- రాణీ చీమ జీవిత కాలం 30 ఏళ్లు





అతిపెద్ద చీమ శిలాజాన్ని, హమ్మింగ్ బర్డ్‌తో పోలుస్తూ తీసిన చిత్రం

సాక్షి, అమరావతి: అమెరికాలోని వయోమింగ్ రాష్ట్రంలో 47 మిలియన్ ఏళ్ల కిందట భారీ మాంసాహార చీమలు అక్కడి కాలనీలను పాలించినట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. హమ్మింగ్ బర్డ్ పరిమాణంలో ఉండే రాణి చీమ శిలాజాన్ని 2011లో కనుగొన్నారు. రెండు అంగుళాలకు పైగా సైజులో ఉన్న ఈ శిలాజాన్ని డెన్వర్ మ్యూజియం ఆఫ్ నేచర్ సైన్సెస్‌లో భద్రపరిచారు. అంతకు ముందు టైటానోమైర్మా జాతికి (2 అంగుళాల పొడవు, 16 సెంటీమీటర్ల రెక్కలు) చెందిన చీమ శిలాజాన్ని జర్మనీలో గుర్తించారు. చీమలు చల్లటి రక్తం (కోల్డ్ బ్లడెడ్) కలిగిన జాతికి చెందినవి. వాటి శరీర ఉష్ణోగ్రత పర్యావరణంలోని సూర్యరశ్మిపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే.. అవి వెచ్చని వాతావరణంలో ఉండటానికే ఇష్టపడతాయి. గ్లోబల్ వార్మింగ్ చీమ జాతిని భయపెడుతున్నా.. కొంచెం తేమ ఉన్న ప్రాంతాల్లోనూ ఇవి మనుగడ సాగించగలుగుతున్నాయి. అందుకే శీతాకాలంలో (డిసెంబర్–జనవరి మధ్య) బయట చీమలు కనిపించవు. ఆహార పదార్థాలు ఉండే ఇళ్లలోకి చొరబడి జీవనం సాగిస్తాయి.

డైనోసార్లు అంతరించినా.. ఇవి బతికే ఉన్నాయ్

జీవుల్లో అత్యంత సంపన్నమైన (సోషల్ ఇంజనీరింగ్), శక్తివంతమైన సమూహాలలో చీమలకు ప్రత్యేక స్థానం ఉంది. భూగ్రహంపై డైనోసార్లు అంతరించిపోయినా.. వాటితో కలిసి జీవించిన చీమ జాతులు మాత్రం ఇప్పటికీ మనుగడ సాగిస్తున్నాయి. చీమలకు 130 మిలియన్ సంవత్సరాల చరిత్ర ఉందని శాస్త్రవేత్తల అంచనా. మూడేళ్ల కిందట మయన్మార్‌లో 99 మిలియన్ సంవత్సరాల క్రితం 'హెల్ యాంట్' పేరుతో జీవించిన చీమ నమూనాను గుర్తించారు. ఇదే క్రమంలో భూమిపై చీమల సంఖ్యపై హాంకాంగ్ విశ్వవిద్యాలయం, జర్మనీలోని వుర్జ్‌బర్గ్‌లోని జూలియస్ మాక్సిమిలియన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇందులో భూమిపై 20 క్వాడ్రిలియన్ (20 వేల ట్రిలియన్) చీమలు ఉన్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ ప్రొసీడింగ్స్‌లో ప్రచురించింది. వీటి సంఖ్య గతంలో కంటే రెండు నుంచి 20 రెట్లు పెరిగినట్టు పేర్కొంది. ప్రపంచంలో ప్రతి వ్యక్తికి 2.5 మిలియన్ చీమల జనాభా ఉండటం గమనార్హం.

వీటి బరువు 12 మిలియన్ టన్నులు

ప్రపంచంలో సుమారు 12 వేల నుంచి 15 వేలకు పైగా రకాల చీమ జాతులను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అడవి పక్షులు, క్షీరదాల కంటే చీమల బరువు (చీమల బయోమాస్ 12 మిలియన్లు) ఎక్కువగా ఉంటుంది. ఇది మానవుల బయోమాస్‌లో దాదాపు 20 శాతం. బయోమాస్ అనేది జీవుల్లోని కర్బనాల మొత్తం బరువుగా కొలుస్తారు. చీమలు మొక్కల విత్తనాల పంపిణీలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మానవ సంచార ప్రాంతాలతో పోలిస్తే అడవుల్లో, ఆశ్చర్యకరంగా శుష్క ప్రాంతాల్లో చీమలు సమృద్ధిగా పెరుగుతున్నాయి.

ఏడాదిలో 50 టన్నుల మట్టి తరలింపు

చీమలు తమ శరీర బరువు కంటే 50 రెట్లు ఎక్కువ బరువును మోయగలవని అంచనా. చీమల జట్టు ఒక సంవత్సర వ్యవధిలో 50 టన్నుల మట్టిని ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తరలిస్తుంది. ఇది ప్రకృతికి మేలు చేయడంలో వానపాముల కంటే ఎక్కువ ప్రాముఖ్యతను కలిగిఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చీమలకు ఊపిరితిత్తులు, సాధారణ శ్వాసకోశ వ్యవస్థ లేదు. శరీరంలోని రంధ్రాల వ్యవస్థను (స్పిరకిల్స్) శ్వాస పీల్చుకునేందుకు ఉపయోగిస్తాయి. అందుకే ఇవి నీటి అడుగులో 24 గంటల పాటు జీవించగలవు.

ఇదే అతిపెద్ద చీమల కాలనీ

ఐరోపా, జపాన్, అమెరికా అంతటా అతిపెద్ద చీమల కాలనీ వ్యాపించింది. తొలుత వీటిని మూడు ప్రత్యేక కాలనీలుగా భావించారు. ఇక్కడ అర్జెంటీనా చీమ జాతి ఒక్కటే ఉండటంతో మనుగడ కోసం ఒకదానితో మరొకటి పోరాడుకోవడానికి నిరాకరించడంతో కాలనీ చాలా పెద్దదిగా పెరిగినట్టు భావిస్తున్నారు. ఈ కాలనీ 3,750 మైళ్ల మేర విస్తరించి ఉందని.. అందులో 370 మిలియన్ చీమలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

30 ఏళ్ల జీవన కాలం

చీమలు కందిరీగల నుంచి ఉద్భవించినట్టు పలు పరిశోధనల్లో తేలింది. పరిమాణంలో 0.07–2 అంగుళాల మధ్యలో ఉండే చీమలు అంటార్కిటికా, ఐస్‌ల్యాండ్, గ్రీన్‌ల్యాండ్ మినహా ప్రపంచంలోని ప్రతిచోట కనిపిస్తున్నాయి. మగ కార్మిక చీమల జీవిత కాలం మూడేళ్లలోపు (కొన్ని కార్మిక చీమలు స్వల్పకాలమే జీవిస్తాయి) ఉంటుంది. చీమల్లో కూడా తేనెటీగల మాదిరిగానే రాణీ చీమ కాలనీ స్థాపకురాలు. రాణి ఫలదీకరణం చేసిన తర్వాత కాలక్రమేణా మిలియన్ల గుడ్లు పెట్టగలదు. అమెరికాలోని ఇడాహోలోని తన సహజ నిర్మాణంలో ఓ రాణి చీమ 30 ఏళ్లపాటు నివసించింది. క్వీన్ బ్లాక్ గార్డెన్ చీమలు ల్యాబ్ సెట్టింగ్‌లలో 28 సంవత్సరాల వరకు జీవించినట్టు గుర్తించారు. మారికోపా హార్వెస్టర్ చీమకు 12 తేనెటీగలు కలిసి కఠినంగా కుట్టగలిగే సామర్థ్యం ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైనదిగా భావిస్తారు. చీమల్లో ఆశ్చర్యకరంగా రెండు పొట్టలు ఉంటాయి. ఒకటి తన ఆహారం తీసుకోవడానికి, రెండోది ఇతర చీమలను పోషించడానికి (ట్రోఫాలాక్సిస్ ప్రక్రియ) ఉపయోగిస్తాయి.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు రవి. చిత్రంలో కోదండరాం, విశ్వేశ్వర్‌రావు, ఖాసీం, వినోద్ కుమార్

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

- కొత్త చైర్మన్‌ను నియమించాకే పరీక్షలు నిర్వహించాలి: కోదండరాం
- ప్రభుత్వంపై పోరాటానికి అఖిలపక్ష కమిటీ
- అఖిలపక్ష పోరాట కమిటీకి చైర్మన్‌గా కోదండరాం: మల్లు రవి
- ప్రశ్నపత్రాల లీకేజీపై అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశం

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో వెంటనే చైర్మన్, సభ్యులను తొలగించాలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. లీకేజీ వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. చైర్మన్, సభ్యులను తొలగించాలన్న డిమాండ్‌పై పోరాటానికి అన్ని పార్టీల నేతలు, ప్రజా సంఘాలు, విద్యార్థి నేతలతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. 'టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ – ప్రభుత్వ వైఫల్యం'అనే అంశంపై ఆదివారం నాంపల్లి మదీనా ఎడ్యుకేషనల్ సొసైటీలో అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి వివిధ పార్టీల నేతలతోపాటు విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు హాజరయ్యారు. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు రవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోదండరాం మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్‌ను నియమించిన తరువాతే పరీక్షల నిర్వహణ, ఉద్యోగాల భర్తీ చేపట్టాలన్నారు. లీకేజీ వ్యవహారంపై అఖిలపక్షం తరఫున హైదరాబాద్‌లో భారీ ధర్నా నిర్వహించాలని సూచించారు. మల్లు రవి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ తక్షణమే టీఎస్‌పీఎస్సీ చైర్మన్, సభ్యులను తొలగించేలా గవర్నర్‌కు తీర్మానం పంపాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీకి కోదండరాం చైర్మన్‌గా వ్యవహరిస్తారని చెప్పారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు బల్మూరి వెంకట్ మాట్లాడుతూ పేపర్ల లీకేజీ వ్యవహారంలో కోట్లు చేతులు మారాయని, దీనిపై ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించనున్నట్లు చెప్పారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీలో సర్కార్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్రజా గాయకుడు గద్దర్ మాట్లాడుతూ పేపర్ లీకేజీపై ప్రజా ఉద్యమం నిర్మించాలన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు, ప్రొఫెసర్ ఖాసీం, ప్రొఫెసర్ రియాజ్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, పీఓడబ్ల్యు సంధ్య, ఇందిరా శోభన్ పాల్గొన్నారు.

పోరాటానికి జేఏసీ చారిత్రక అవసరం


ఎంఐఎం ఒవైసీతో సహా ప్రతిపక్షాలకు వైఎస్ షర్మిల లేఖలు



సాక్షి, హైదరాబాద్: రాజకీయ విభేదాలను పక్కనపెట్టి నిరుద్యోగుల కోసం పోరాడే సమయం ఆసన్నమైందని.. అందుకు జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) ఏర్పాటు చారిత్రక అవసరమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ఇందుకు కలిసి రావాలని ప్రతిపక్షాలకు ఆమె లేఖలు రాశారు. ఆదివారం ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జనసేన తెలంగాణ ఇన్‌ఛార్జ్ ఎన్.శంకర్ గౌడ్‌కు లేఖలు పంపారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీ స్కాంపై విపక్షాలు చేస్తున్న పోరాటానికి ఆమె అభినందనలు తెలిపారు. బిస్వాల్ కమిటీ సిఫార్సు ప్రకారం 1.91 లక్షల ఖాళీలు భర్తీ చెయ్యాలన్నారు. ప్రతిపక్ష పార్టీలన్నీ రాజకీయ విభేదాలను మరిచి, చేతులు కలిపి, ఒక్క పోరాటవేదికపై చేరి, ఈ క్రూర పాలనపై పోరాడాల్సిన చారిత్రక అవసరం ఆసన్నమైందన్నారు. ఒక ఉమ్మడి కార్యాచరణను రూపొందించి నిరుద్యోగులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ భవిత కోసం, యువత కోసం కలిసి నడుద్దాం, నిలిచి పోరాడదామని షర్మిల లేఖలో కోరారు.

సమ్మేళనాల పర్యవేక్షణకు కమిటీ

- మధుసూదనాచారి సారథ్యంలో 10 మంది నియామకం
- సోషల్ మీడియా కమిటీలను బలోపేతం చేయాలి
- టెలికాన్ఫరెన్స్‌లో నేతలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ సమ్మేళనాలు కొనసాగుతున్న తీరుపై మాజీ స్పీకర్ మధుసూదనాచారి సారథ్యంలో 10 మందితో కూడిన కార్యక్రమాల అమలు కమిటీని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు తెలిపారు. పార్టీ ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణ తీరును తెలుసుకొనేందుకు ఆదివారం నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన కేటీఆర్... నూతన కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ఆత్మీయ సమ్మేళనాల అమలు తీరును పరిశీలిస్తుందని చెప్పారు. అందువల్ల కమిటీ సభ్యులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ కమిటీ ద్వారానే పార్టీ కార్యక్రమాల అమలు పర్యవేక్షణ తీరును, వాటికి సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను పార్టీ అధినేత కేసీఆర్ తీసుకుంటారని ఆయన వివరించారు. ప్రతి నియోజకవర్గంలో సామాజిక మాధ్యమాలలో విస్తృతంగా పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రచారం నిర్వహించేలా సోషల్ మీడియా కమిటీలను బలోపేతం చేసుకోవాలని నేతలకు సూచించారు. ఈ ఎన్నికల సంవత్సరంలో ప్రతి ఎమ్మెల్యే అత్యంత చురుకైన పార్టీ కార్యకర్తలతో కలిపి ఒక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, పార్టీ కార్యకర్తలను సమాచార సైనికులుగా తయారు చేసేందుకు ఆత్మీయ సమ్మేళనాలు ఉపయోగపడతాయని చెప్పారు.

నేతలకు కేటీఆర్ కీలక సూచనలివీ...

● సమ్మేళనాలను పార్టీ ఎమ్మెల్యేలు మరింత విస్తృతంగా, కూలంకషంగా, పకడ్బందీగా నిర్వహించి ప్రణాళికలు రచించాలి. ● ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్తనూ భాగస్వామిని చేయాలి. ● కేసీఆర్ పార్టీ కార్యకర్తలకు రాసిన ఆత్మీయ సందేశంతోనే ప్రతి ఆత్మీయ సమ్మేళనాన్ని ప్రారంభించాలి. ● కేసీఆర్ ఆత్మీయ సందేశం ప్రతి కార్యకర్తకు అందేలా అవసరమైన కరపత్రాలను సిద్ధం చేసి విస్తృతంగా పంపిణీ చేయాలి. ● పార్టీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధులు, పదవుల్లోఉన్న ప్రతి ఒక్కరూ ఈ సమ్మేళనాల్లో పాల్గొనేలా ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ అధ్యక్షులు చొరవ తీసుకోవాలి.

బీఆర్ఎస్‌లో చేరిన మహారాష్ట్ర ముస్లిం నేత ఖదీర్ మౌలానా



ఖదీర్ మౌలానాకు పార్టీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర ముస్లిం నాయకుడు సయ్యద్ అబ్దుల్ ఖదీర్ మౌలానా ఆదివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ గులాబీ కండువాను కప్పి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించారు. ఔరంగాబాద్ సెంట్రల్ నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో అబ్దుల్ ఖదీర్ ఎన్సీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. గతంలో ఎన్సీపీ జాతీయ ఉపాధ్యక్షుడిగా, మహారాష్ట్ర పార్టీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఎన్సీపీ మహారాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడిగా కూడా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మహారాష్ట్ర బీఆర్ఎస్ పార్టీ నేతలు, రైతు నాయకుడు, మాజీ ఎమ్మెల్యే శంకర్ అన్నా థోంగే, వైజాపూర్ విధానసభ నియోజకవర్గ నాయకుడు అభయ్‌పాటిల్, చిక్కగాంకర్ సాహెబ్, దళిత యువజన నాయకుడు ఏవీన్ష్ వస్మత్, ప్రహ్లాద్ రాఖోండే సాహెబ్, గోరఖ్ పాటిల్, శ్యామ్ కదమ్, గోవింద్ ధెంబారే, దేవానంద్ పాటిల్, తుకారాం సాల్వే, చంద్రవిలాస్ తొంబరే పాటిల్, గజానన్ కదమ్, సంతోష్ పాటిల్, యువ నేత ప్రవీణ్ జెతెవాడ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని ప్రైవేటీకరిస్తున్న సర్కారు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపణ



భీమారం సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

భీమారం: రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ సింగరేణిని రాష్ట్ర సర్కారు ప్రైవేటుపరం చేస్తోందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్రను మంచిర్యాల జిల్లా భీమారం మండలం దాంపూర్‌లో ఆదివారం ప్రారంభించారు. యాత్ర బూర్గుపల్లి, పోతన్‌పల్లి మీదుగా భీమారం వరకు కొనసాగింది. రాత్రి భీమారంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. తెలంగాణలో లక్షకుపైగా ఉన్న ఉద్యోగుల సంఖ్య ఇప్పుడు 42 వేలకు తగ్గిందని, ఈ ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. సింగరేణిలోని ఉపరితల, భూగర్భ గనులను ప్రైవేటుకు అప్పగించడంతో ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో మంజూరైన జైపూర్ పవర్ ప్లాంట్‌లో ఇప్పుడు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలేదని ఆరోపించారు. ఎప్పుడూ లేనివిధంగా ఇసుక మాఫియాను పెంచి పోషిస్తూ కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ కుటుంబానికి ఆర్థికంగా లబ్ధి చేకూరిందని ఆరోపించారు. చెన్నూరు అసెంబ్లీ నియోజకవర్గంలో పంట పొలాలు ముంపునకు గురై రైతులు నష్టపోతున్నారని తెలిపారు. అంతకుముందు గొల్లవాగు ప్రాజెక్టును విక్రమార్క సందర్శించారు. యాత్రలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఎదుర్కోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి కుట్ర


బండి సంజయ్ ఆరోపణ




ములుగు: వచ్చే శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమై తమ పార్టీని ఓడించేందుకు కుట్ర చేస్తున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన నియోజకవర్గ బూత్ కమిటీ సమ్మేళనంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సాల్‌తో కలిసి పాల్గొన్నారు. సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటామని కాంగ్రెస్ సీనియర్ నేతలు జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెబుతున్నారని అన్నారు. బీజేపీ ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని, సింహం సింగిల్‌గానే పోటీ చేస్తుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి బీజేపీకి అవకాశమివ్వాలని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు రైతుబంధు ఇచ్చి సబ్సిడీలన్నీ బంద్ చేసిందని, తమ పార్టీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. తెలంగాణను అభివృద్ధి చేస్తే బీజేపీకి, ప్రధాని నరేంద్రమోదీకి పేరు వస్తుందని సీఎం కేసీఆర్ అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సునీల్ బన్సాల్ మాట్లాడుతూ రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్ విధానాన్ని తెలంగాణలో అమలు చేసి విజయం సాధిస్తామని అన్నారు. రేయాన్స్ ఫ్యాక్టరీ పున: ప్రారంభం కోసం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌తో కలిసి ప్రధానమంత్రితో మాట్లాడతామని హామీనిచ్చారు. బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, గుజరాత్, యూపీ, ఇతర కేంద్రపాలిత ప్రాంతాల్లో అవినీతిరహిత పాలన కొనసాగుతున్నదని చెప్పారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎంపీలు గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి, రమేశ్ రాథోడ్, రవీంద్రనాయక్, మాజీ ఎమ్మెల్యేలు కూన శ్రీశైలంగౌడ్, వన్నాల శ్రీరాములు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బంగారు శృతి తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కేసును సిట్టింగ్ జడ్జితో విచారించాలి: కూనంనేని

కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలి: నారాయణ



కూనంనేని



నారాయణ

సాక్షి, హైదరాబాద్: సీబీఐ సంస్థను వ్యతిరేకిస్తూనే పేపర్ లీకేజీ కేసును దానికే అప్పగించాలని కాంగ్రెస్ కోరడం సరైంది కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ కేసును సిట్, సీబీఐతో కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారించాలని డిమాండ్ చేశారు. ఆదివారం 'బీజేపీకో హఠావో, దేశ్ కో బచావో'నినాదంతో 'ఇంటింటికీ సీపీఐ'వాల్ పోస్టర్‌ను కూనంనేని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 14న చేపట్టబోయే 'ఇంటింటికీ సీపీఐ'ప్రారంభసభను హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మే 14న కొత్తగూడెంలో లక్ష మందితో ముగింపు సభను నిర్వహిస్తామని దీనికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కేరళ రెవెన్యూ మంత్రి కె.రాజన్ హాజరవుతారని కూనంనేని చెప్పారు. ఈనెల 9న హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సీపీఐ, సీపీఎం సంయుక్త సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి పార్టీ జాతీ య కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు హాజరవుతారన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 4,128 ఎమ్మెల్యేలుండగా ఇందులో బీజేపీకి 664 మాత్రమే ఉన్నారన్నారు. బీజేపీ సొంతంగా, తమ మిత్రులతో కలిసి మొత్తం 16 రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే, బీజేపీయేతర పార్టీలు 14 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయని కూనంనేని వివరించారు. కాగా, బాధ్యతా రాహిత్యంగా వ్యాఖ్యానిస్తున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్‌చేశారు. సుదీర్ఘకాలంగా ఎటూ తేలకుండా ఉన్న ఆంధ్రా ఒడిశా బోర్డర్లలోని 20 గ్రామాల సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టే కుట్ర

- ఇలాంటి పన్నాగాలను ఆపండి.. కేంద్రానికి కేటీఆర్ లేఖ
- కేంద్రమే ఆర్థికసాయం అందించి వైజాగ్ స్టీల్ ఉత్పత్తులు కొనాలి

సాక్షి, హైదరాబాద్: ప్రైవేటీకరణ పేరిట వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్ మిత్రులకు కట్టబెట్టేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు ప్లాన్ చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఇలాంటి పన్నాగాలను మానుకోవాలన్నారు. ఈ మేరకు కేటీఆర్ ఆదివారం కేంద్రానికి బహిరంగ లేఖ రాశారు. కేంద్రం దొడ్డిదారిన ప్రైవేటుకు కట్టబెట్టే కుతంత్రానికి తెరలేపిందని ఆరోపించారు. ''ఒకప్పుడు ప్రభుత్వ రంగంలో భారీ ఎత్తున సిమెంట్ ఉత్పత్తి చేసిన పరిశ్రమలన్నింటినీ ప్రైవేటుపరం చేశారు. ఇప్పుడు స్టీల్ పరిశ్రమను అదే రీతిన ప్రైవేట్‌కు అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ఇనుప ఖనిజం గనులను కేటాయించకుండా కేంద్రం మోకాలడ్డింది. ప్రైవేటు కంపెనీలకు మాత్రం ఇనుపఖనిజంతోపాటు బొగ్గు గనులను కూడా కేటాయించింది. ఇదంతా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టి, ఆ నష్టాలను సాకుగా చూపించి లక్షల కోట్ల విలువైన ఆస్తులను అప్పనంగా కార్పొరేట్ మిత్రులకు అప్పజెప్పే కుట్ర''అని కేటీఆర్ ఆరోపించారు.

సెయిల్‌తో కలపండి

వైజాగ్‌ప్లాంట్‌కు కేంద్రమే ఆర్థిక సాయం చేయాలని, రుణాలు సేకరించే పరిమితిని పెంచాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం వైజాగ్ ప్లాంట్ నుంచి స్టీల్ కొనుగోలు చేయాలన్నారు. ఇప్పటికే స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) దాదాపు రూ.లక్ష కోట్లతో తన విస్తరణ ప్రణాళికలను ప్రకటించిందని.. వైజాగ్ ప్లాంట్‌ను దానితో కలపాలని కోరారు. సెయిల్ ఈ దిశగా ముందుకొస్తే బయ్యారం స్టీల్‌ప్లాంట్‌తో పాటు కడపలోనూ మరో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఈకో సిస్టం ఏర్పడుతుందన్నారు. ప్రైవేటు కంపెనీలు వైజాగ్ ప్లాంట్‌కు మూలధనం అందించి స్టీల్ ఉత్పత్తులను కొనుగోలు చేయాలనే పేరిట విడుదల చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ కుట్రలను అడ్డుకొనేందుకు బీఆర్ఎస్ కలిసి వచ్చే పార్టీల, శక్తులు, ప్రజాసంఘాలతో ఆందోళనలు చేపడతామన్నారు. వైజాగ్ స్టీల్ తెలుగు ప్రజల హక్కు అని, దాన్ని కాపాడుకోవడానికి తెలుగువారంతా కలసి రావడం అవసరమని పేర్కొన్నారు.



హృదయానికి బోధించకుండా కేవలం మెదడుకు మాత్రమే బోధించేది అసలు బోధనే కాదు.
- అరిస్టాటిల్

సాక్షి
సోమవారం, ఏప్రిల్, 3

మాటా మంచీ

మనుషులకున్నదీ, ఇతర ప్రాణులకు లేనిదీ ఒక్క ఆలోచనాశక్తే కాదు, మాట కూడా! మాట శ్రుతిమించితే వివాదమవుతుంది, అతి అయితే వాచలత అవుతుంది, అదుపులో ఉంటే విజ్ఞతవుతుంది, రసాత్మకమైతే కవిత్వమవుతుంది, జనహితైషి అయిన ఒక మహనీయుని అంతరంగపు లోతుల్లోంచి ఉబికి వచ్చినప్పుడు అశేషజనావళిని కదిలించే మంత్రమవుతుంది. మాట అనేది మంచి, చెడుల కలబోత, రెండంచుల కత్తి! మనిషిని మనుషుల్లోకి తెచ్చి సామాజికుణ్ణి చేసినదీ, సంభాషణకు ఉపక్రమింపజేసినదీ, ఆ సంభాషణ నుంచి సంఘటిత కార్యంవైపు నడిపించినదీ, అందుకు అవసరమైన వ్యవస్థల అభివృద్ధికి దోహదమైనదీ, మాటే. ఆ క్రమంలోనే మాటకు వ్యాకరణం పుట్టింది, ఉచితానుచితాలనే హద్దులు ఏర్పడ్డాయి, ఆ హద్దుల నుంచి నాగరికత వచ్చింది. మనిషి చరిత్రలో ఇంతటి మహత్తర పాత్ర వహించిన మాట విలువ రానురాను పాతాళమట్టానికి పడిపోవడం నేటికాలపు విషాదం. ఏ రంగంలో చూసినా అసత్యాలు, అర్ధసత్యాల స్వైరవిహారం మాట విలువను దిగజార్చివేసింది.

దుస్సాధ్యమని చెప్పదలచుకున్నప్పుడు 'మాటలు కా'దంటూ మాటను చులకన చేస్తాం. మన కన్నా ప్రాచీనులే మాటను ముత్యాలమూటగా నెత్తిన పెట్టుకుని గౌరవించారు. బహుముఖమైన దాని విలువను గుర్తించి మహత్తును ఆపాదించారు. దానినుంచే మాంత్రికత, వరాలు, శాపాలు పుట్టాయి. మామూలు మాట కన్నా ముందు కవితాత్మక వాక్కు పుట్టిందని మానవ పరిణామ శాస్త్రవేత్తలు తేల్చారు. కొన్ని సమాజాల్లో మామూలు సంభాషణ కూడా కవితాత్మకంగా ఉండేదని ప్రముఖ పురాచరిత్ర అధ్యయనవేత్త జార్జి థామ్సన్ అంటూ, ఐరిష్ సమాజాన్ని ఉదహరిస్తాడు.

రాత వచ్చాకే మాట తలరాత మారింది. మాట మంచిని, మర్యాదను, పొదుపును, అర్థవంతతను పదే పదే బోధించే అవసరం తలెత్తింది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది, కాలు జారితే తీసుకోగలం కానీ, మాట జారితే తీసుకోలేం, పెదవి దాటితే పృథివి దాటుతుంది - వంటి సామెతలు, నుడికారాలు, సూక్తులు ప్రతి వాఙ్మయంలోనూ కొల్లలు. 'మనిషికి మాటే గొప్ప అలంకారం, మిగతా అలంకారాలన్నీ నశించిపోయేవే'నని హెచ్చరిస్తాడు భర్తృహరి. మాటను అబద్ధంతో కలుషితం చేయడానికి నిరాకరించి రాజ్యాన్ని, ఆలుబిడ్డలను సైతం కోల్పోవడానికి హరిశ్చంద్రుడు సిద్ధపడ్డాడు. మహాత్మాగాంధీకి స్ఫూర్తినిచ్చిన కథలలో అదొకటి. గయుడు కృష్ణుని ఆగ్రహానికి గురైన సంగతి తెలియక రక్షిస్తానని అతనికి మాట ఇచ్చిన అర్జునుడు, దానిని నిలబెట్టుకోడానికి తన బహిఃప్రాణమైన కృష్ణునితోనే యుద్ధం చేశాడు.

లిఖిత సంప్రదాయం ఏర్పడని, లేదా పూర్తిగా వేళ్లూనుకొనని రోజుల్లో నోటిమాటగానే అన్ని వ్యవహారాలూ జరిగేవి. ఆర్థికమైన లావాదేవీలలో మాటే వేయి ప్రామిసరీ నోట్ల విలువను సంతరించుకునేది. అలెగ్జాండర్ దండయాత్ర కాలంలో మనదేశాన్ని సందర్శించిన ఒక గ్రీకు చరిత్రకారుడు, ఇక్కడ రుణసంబంధమైన అన్ని ఒప్పందాలూ నోటిమాటగా జరగడం చూసి ఆశ్చర్యపోయాడు. పురాణ, ఇతిహాసాలలో మాట నిలకడతోపాటు, మాటసొంపుకు, నేర్పుకే ప్రాధాన్యం. రామాయణంలోని హనుమంతుడు అటువంటి సుగుణాలరాశి. రాముడికీ, సుగ్రీవుడికీ స్నేహసంధానం చేసింది అతనే. అతని వాక్చతురతను ఉగ్గడించడానికే కాబోలు, వ్యాకరణ పండితుణ్ణి చేశారు.

దాదాపు ప్రతి దేశమూ, ప్రతి ఇతర దేశంతోనూ పాటించే దౌత్యనీతికి మాటే గుండెకాయ. దౌత్యచతురత ఇప్పుడు ఒక ప్రత్యేకవిద్యగా అభివృద్ధి చెందింది. మహాభారతాన్నే చూస్తే, వివిధ సందర్భాలలో ద్రుపదుని పురోహితుడు, విదురుడు, సంజయుడు, కృష్ణుడు కురుపాండవుల మధ్య రాయబారం నెరిపారు. రాజనీతి కుశలతే కాక, అవతలి పక్షానికి సూటిగా తేటగా, ఎక్కువ తక్కువలు కాకుండా సందేశాన్ని చేరవేసే మాటనేర్పే అందుకు వారి అర్హత. ధృతరాష్ట్రునికి గాంధారి నిచ్చి పెళ్లి చేయాలన్న ప్రతిపాదనను భీష్ముడు ఒక మాటకారితోనే గాంధారరాజు సుబలుడికి పంపుతాడు. కుండిన నగరానికి వచ్చి రాక్షస పద్ధతిలో తనను ఎత్తుకెళ్లి వివాహమాడమన్న సందేశాన్ని అగ్నిద్యోతనుడనే పురోహితుని ద్వారా రుక్మిణి కృష్ణునికి పంపుతుంది. రాజ్యం కోల్పోయి అడవుల పాలైన తన భర్త నలుని జాడ కనిపెట్టడానికి దమయంతి, అతనికి మాత్రమే అర్థమయ్యే ఒక సందేశమిచ్చి దానిని సమర్థంగా అందించగల వ్యక్తినే పంపుతుంది. పర్షియన్లకు, గ్రీకులకు యుద్ధం వచ్చినప్పుడు స్పార్టాన్ల సాయాన్ని అర్థిస్తూ గ్రీకులు ఫిలిప్పైడ్స్ అనే వ్యక్తిని దూతగా పంపుతారు. మాట నేర్పుతోపాటు వేగంగా నడవగలిగిన ఫిలిప్పైడ్స్ కొండలు, గుట్టలవెంట మైళ్ళ దూరం నడిచి వెళ్ళి స్పార్టాన్లకు ఆ సందేశం అందించి తిరిగి వచ్చి యుద్ధంలో పాల్గొంటాడు. విచిత్రంగా ఇతనికీ, సముద్రాన్ని లంఘించి లంకకు వెళ్ళి సీతను చూసొచ్చిన హనుమంతుడికీ పోలికలు కనిపిస్తాయి.

మాటల మహాసముద్రంలో సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం వగైరా అనర్ఘరత్నాలే కాదు; మనుషుల మధ్యా, మతాల మధ్యా విరోధం పెంచి విధ్వంసం వైపు నడిపించే తిమింగలాలూ ఉంటాయి. మంచి, మర్యాద, విజ్ఞత, వివేకం ఉట్టిపడేలా నిరంతరం తీర్చిదిద్దుకునే మాటతోనే వాటిని తరిమికొట్టగలం. రకరకాల కాలుష్యాల నుంచి మాటను విడిపించి తిరిగి మంత్రపూతం, అర్థవంతం చేయడం కూడా ఒక తరహా పర్యావరణ ఉద్యమమే. నూరు అబద్ధాల మధ్య ఒక నిజం కూడా అబద్ధంగా మారిపోయే దుఃస్థితి నుంచి మాటను రక్షించకపోతే ఇంతటి మానవ ప్రగతీ అబద్ధమైపోతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, **తిథి:** శు.ద్వాదశి ఉ.6.04 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** మఖ ఉ.7.14 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.3.56 నుండి 5.43 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.15 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.43 వరకు, **అమృతఘడియలు:** రా.2.23 నుండి 4.10 వరకు.

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

సారీ చెప్పడం తెలియకపోతే...

కామెంట్



కరణ్ థాపర్

విధి విచిత్రమైనది. విరుద్ధంగా తిరుగుతాయని ఎంతమాత్రమూ ఊహించని ఘటనలు జరుగుతుంటాయి. 2013లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తెచ్చిన ఒక ఆర్డినెన్స్‌ను 'పూర్తిగా అర్థరహితం' అని పేర్కొంటూ రాహుల్ చింపేశారు. తన విమర్శను బహిరంగంగా ప్రదర్శించడం ద్వారా మన్మోహన్‌ను ఉద్దేశపూర్వకంగా అవమానించారు. ఆ ఆర్డినెన్స్ పాస్ అయి ఉంటే, పార్లమెంట్ నుంచి రాహుల్ ప్రస్తుత అనర్హతను అది అడ్డుకుని ఉండేది. ఆ విషయంలో ఎంత తప్పు చేశారన్నది ఇప్పుడు ఆయనకు కలిగిన దురవస్థ వెల్లడిస్తోంది. కానీ 'దాన్ని చింపి, అవతల పారెయ్యాలి' అన్న వ్యాఖ్య మన్మోహన్‌ను ప్రధానిగా బలహీనపర్చింది. అందుకే, మన్మోహన్‌కు బహిరంగ క్షమాపణ చెప్పడాన్ని రాహుల్ బకాయి పడ్డారు. కానీ ఆయన మూర్ఖంగా 'గాంధీలు ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పరు' అంటూ ప్రగల్భాలకు పోయారు. క్షమాపణ అవసరమైనప్పుడు కూడా అలాగే చేస్తానంటే ఆ బడాయికోరుతనం దోషం అవుతుంది. ఎలా క్షమాపణ చెప్పాలో తెలీని రాజకీయనాయకుడిగా ఆయన మిగిలిపోతారు.

విధికి సంబంధించిన చమత్కారాలు, వక్రోక్తులు నాకు ఎంతో ఆసక్తి గొలుపుతుంటాయి. ఘటనలు మీకు విరుద్ధంగా జరుగుతాయని మీరు అసలు ఎంతమాత్రమూ ఊహించనప్పుడు, అవి వాస్తవంగా అలాగే పైకి తేలుతాయి. అవును, అలాగే జరుగుతాయి. వ్యావహారికంగా దీన్ని 'సోడ్ న్యాయం' అని పిలుస్తారు. (ఒకటి తప్పుగా జరిగే అవకాశం ఉంటే, అది చివరకు తప్పుగానే జరుగుతుందని బ్రిటన్లో నవ్వుతూ చెప్పే మాట.) షేక్‌స్పియర్ వంటి నాటకకర్త చేతుల్లో అది మితిమీరిన గర్వంగా పరివర్తన చెందుతుంది. ఆయన గొప్ప విషాదాంత నాటకాలు ఈ వ్యవహారం పైనే ఆధారపడి రూపొందాయి. ఏ రకంగా చూసినా, ఇది 'దేవుడి లీలావిలాసాలు' మనకు వెల్లడయ్యే క్షణం!

రెండు క్షమాపణలు

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విషయంలో జరిగింది అదే. ఆడంబరంగా, అలా కాదనుకుంటే డాంబికంగా అయన పత్రికా సమావేశంలో ఇలా ప్రకటించారు: ''నా పేరు గాంధీ; గాంధీలు ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పరు''. దురదృష్టవశాత్తూ ఇద్దరు వ్యక్తులకు ఆయన క్షమాపణలు బాకీ పడ్డారని స్పష్టమైన సమయంలోనే, ఆయన ఈ వ్యాఖ్య చేశారు. చాలా స్పష్టంగా అది బహిర్గతమైన విషయం. పైగా అది కచ్చితంగా బహిరంగంగా జరిగిన విషయం.

రాహుల్ తన తొలి క్షమాపణను మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు బాకీ పడ్డారు. 2013లో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం తెచ్చిన ఒక ఆర్డినెన్స్‌ను ''పూర్తిగా అర్థరహితం'' అని పేర్కొంటూ రాహుల్ దాన్ని చింపేశారు. విచిత్రమైన విషయం ఏమిటంటే, ఆ ఆర్డినెన్స్ పాస్ అయి ఉంటే, పార్లమెంట్ నుంచి రాహుల్ గాంధీ ప్రస్తుత అనర్హతను అది అడ్డుకుని ఉండేది. ఎందుకంటే, ఆ ఆర్డినెన్సు ఇలా ఒక శాసనాన్ని పొందుపర్చింది. ''శిక్ష పడిన నాటి నుంచీ 90 రోజులలోపు, ఆ శిక్షను పునర్విమర్శ చేయమని కోరుతూ ఒక విజ్ఞప్తి లేదా అభ్యర్థనను దరఖాస్తు చేసినట్లయితే'' కనీసం రెండేళ్ల శిక్ష పడిన పార్లమెంట్ సభ్యుడి తక్షణ అనర్హత అనేది అనిశ్చిత స్థితిలోకి వెళ్తుంది. (ఇంకోరకంగా చెప్పాలంటే, అప్పటికి నిలుపుదల అవుతుంది.)

ముందుచూపు లేకపోవడం

2013లో రాహుల్ గాంధీ గుర్తించనిది – బహుశా, ఈరోజు ఆయన మర్చిపోనిది ఏమిటంటే, ఆయనకు పడిన శిక్షపై ఒకవేళ న్యాయస్థానం చివరకు స్టే విధించినప్పటికీ... ప్రస్తుత పార్లమెంటులో ఆయన చాలా వారాలపాటు అడుగుపెట్టే అవకాశం అప్పటికి



కోల్పోయివుంటారు. ఇది కేవలం వ్యక్తిగత నష్టం మాత్రమే కాదు. అంతకంటే ముఖ్యంగా, ఆయన నియోజక వర్గమైన వయనాడ్ (కేరళ)కు ఈ కాలంలో ప్రాతినిధ్యం లేకుండా పోతుంది. నిజానికి, ఇది భారతీయ ప్రజాస్వామ్యాన్ని క్షీణింపజేస్తుందని కూడా మీరు వాదించవచ్చు. ఎందుకంటే మామూలుగా లోక్‌సభలో వ్యక్తీకరించగలిగిన ఒక అభిప్రాయం వినలేని పరిస్థితి వస్తున్నది కాబట్టి.

2013లో రాహుల్ గాంధీ ఆ ఆర్డినెన్స్‌ను లాలూ ప్రసాద్ యాదవ్‌ను కాపాడటానికి తెస్తున్న ముతక, ఇంకా చెప్పాలంటే అనైతిక ప్రయత్నంగానే చూశారు. కానీ ఆ ఆర్డినెన్స్‌కు అంతకంటే మించిన విలువ ఉందని ఆయన చూడలేకపోయారు. ఇంకా చెప్పాలంటే చూడదల్చలేదు కూడా. బహుశా ఆ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా ప్రజాగ్రహం ఉందన్న అంశంపైనే ఆయన దృష్టి మొత్తంగా ఉండేది. అయితే ఆయన ఆ విషయంలో ఎంత తప్పు చేశారన్నది ఇప్పుడు ఆయనకు కలిగిన దురవస్థ వెల్లడిస్తోంది.

ఇంకా ఘోరమైన సంగతి ఏమిటంటే, తన విమర్శను బహిరంగంగా ప్రదర్శించడం ద్వారా మన్మోహన్ సింగ్‌ను ఉద్దేశపూర్వకంగా రాహుల్ అవమానించారు. ''దాన్ని చింపి, అవతల పారెయ్యాలి''. ఇది జూలియస్ సీజర్‌ను బ్రూటస్ పొడిచేయడం లాంటిదే. ఆ వ్యాఖ్య మన్మోహన్‌కు నష్టం చేయడమే కాదు, ప్రధానిగా ఆయన్ని బలహీనపర్చింది. అందుకే, డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు పూర్తిగా బహిరంగ క్షమాపణ చెప్పడాన్ని రాహుల్ గాంధీ బకాయి పడ్డారు.

సముచితం కాని స్పందన

రెండో క్షమాపణ – అది చెప్పడం జరిగినట్లయితే– రాహుల్ ఎలాంటి వ్యక్తో వెల్లడవుతుంది. అది ఆయన స్వభావానికి, చివరకు తన నైతిక సమగ్రతకు కూడా పరీక్షే అవుతుంది. అందువల్ల, ఈ రెండు క్షమాపణలు చెప్పడం కష్టమైనవే కానీ అవి మరింతగా అవసరమైనట్టివి.

''ఓబీసీ కమ్యూనిటీని రాహుల్ గాంధీ అవమానించారని బీజేపీ చేసిన ఆరోపణపై మీ అభిప్రాయం ఏమి''టని మార్చి 25న జరిగిన ఒక ప్రెస్ కాన్ఫరెన్సులో అడిగిన ఒక జర్నలిస్టు పట్ల రాహుల్ చాలా గర్వంతోనూ, మొరటుగానూ వ్యవహరించారు. కచ్చితమైన, సముచితమైన ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడానికి బదులుగా రాహుల్ ఆ విలేఖరిపై మాటల దాడికి దిగారు.

''నువ్వు బీజేపీకి ఇంత నేరుగా ఎందుకు పనిచేస్తున్నావ్... నీకు వారి నుంచి ఆదేశాలు అందాయా... నువ్వు బీజేపీ కోసం పనిచేయాలనుకుంటే, బీజేపీ జెండా... లేదా గుర్తు ... తెచ్చుకుని నీ ఛాతీపై పెట్టుకో... అప్పుడు వారికి నేను ఏ రీతిలో సమాధానం చెబుతానో నీకు కూడా అలాగే జవాబు చెబుతాను. అంతేకానీ పత్రికల మనిషిగా నటించవద్దు.''

ఇబ్బంది కలిగించేలా తన స్థిరత్వాన్ని, స్థిమితాన్ని కోల్పోవడం సరిపోలేనట్టుగా– రాహుల్ గాంధీ ఆ జర్నలిస్టును మరింత వెటకారం చేశారు. ఇంకో ప్రశ్న (మరెవరో) అడుగుతుండగా, అందరికీ వినబడేట్టుగా రాహుల్ గాంధీ ''హవా నికల్ గయా''(గాలి పోయింది) అనేశారు. ఆయన ముఖంలో తెలివితో కూడిన నవ్వు పరిస్థితిని మరింతగా దిగజార్చివేసింది.

క్షమాపణ మనిషిని తగ్గించదు

రాహుల్ గాంధీ చెప్పింది సమర్థించుకోలేనిది. దీంతో ఎవరైనా అంగీకరించారంటే నాకు సందేహమే. అయినా సరే ఆయన క్షమాపణ చెబుతారా? ఇది యథాలాపంగా సంధించిన ప్రశ్న కాదు. ఇది రాహుల్ వ్యక్తిత్వానికి, నైతిక స్వభావానికి కొలమానం. నిజాయితీగా చెప్పాలంటే, రాహుల్ ఎలాంటి వ్యక్తి అని తెలిపే పరీక్ష ఇది.

వివేకం, ఆత్మసాక్షి ఉన్న రాజకీయ నాయకుడు క్షమాపణ చెబుతారు. పైగా క్షమాపణ అనేది రాహుల్ గాంధీ స్థాయిని పెంచుతుంది. ఆయన పట్ల మన గౌరవం పెరిగేట్లు కూడా చేస్తుంది. కానీ ఆయన ఇప్పటికే మూర్ఖంగా ప్రగల్భాలకు పోయారు: ''గాంధీలు ఎన్నడూ ఎవరికీ క్షమాపణ చెప్పరు.'' ఒకవేళ అదే ఆయన వైఖరి అయితే, అంటే క్షమాపణ అవసరమైనప్పుడు, దాన్ని బాకీ పడినప్పుడు కూడా అలాగే చేస్తానంటే ఆ బడాయికోరుతనం అనేది దోషం అవుతుంది. ఎలా క్షమాపణ చెప్పాలో తెలీని రాజకీయనాయకుడిగా ఆయన మారిపోతారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

న్యాయమైన మాట



మీరు గాంధీలా మాట్లాడితే మీరు సత్యం మాట్లాడుతారు. మీరు అంబేడ్కర్‌లా మాట్లాడితే మీరు న్యాయం మాట్లాడుతారు.
- విజయ్‌కుమార్, తమిళనాడు ఐపీఎస్ అధికారి

ఇదో తీరు



సురక్షితమైన పరిస్థితులు లేనందున ఎన్నికలు నిర్వహించలేరు ; కానీ ఆసియా కప్‌కు ఆతిథ్యం ఇవ్వడం మాత్రం పర్ఫెక్టుగా సురక్షితం. (పాకిస్తాన్ ప్రధానమంత్రి) షెహబాజ్ షరీఫ్ సర్, మీరు భలే తమాషా చేస్తారు!
- గౌరవ్ ఆర్యా, మాజీ సైనికాధికారి (మేజర్)

చిరు పరిష్కారం



చిరుధాన్యాలు ఏ రకమైన నేల, వాతావరణంలోనైనా పెరుగుతాయి. ప్రపంచంలోని ప్రతి ప్రాంతమూ చిరుధాన్యాలను సాగు చేస్తే, కరువులు అనేవి నమ్మకంగా గతకాలపు విషయాలు అవుతాయి. మన ఆరోగ్యానికీ, నేల ఆరోగ్యానికీ, ప్రపంచంలో ఏ ఒక్కరూ ఆకలితో మరణించకుండా ఉండేందుకూ చిరుధాన్యాలే పరిష్కారం. ఈ 'అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం'లో చిరుధాన్యాలను మన కంచాల్లోకి తెచ్చేలా పూనుకుందాం.
- జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

ప్రణాళిక ఉండాలి



ప్రణాళిక లేని మేధావిని ప్రణాళిక ఉన్న మూర్ఖుడు కూడా ఓడించగలడు. అదీ ప్రణాళిక గొప్పతనం! అందుకే ప్రణాళిక ఉండాలి.
- వారెన్ బఫెట్, ఇన్వెస్టర్

ఏం చెప్పారు!



బెంగాల్ కమ్యూనిస్టుల తర్కం ఎలా ఉందో చూడండి: రాముడు అయోధ్యలో జన్మించాడు కాబట్టి, ఆయన పశ్చిమ బెంగాల్‌కు బయటివాడు అవుతాడు. కానీ కారల్ మార్క్స్ మాత్రం కోల్‌కతాలోని సోనాగాఛీలో పుట్టాడు కాబట్టి, ఆయన లోపలి మనిషి అవుతాడు.
- సునందా రాయ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

అంతకంటే దుర్మార్గుడు



కాంగోను తన ప్రైవేటు ఆస్తిలా 23 ఏళ్లపాటు పాలించాడు బెల్జియంకు చెందిన రెండో లియోపోల్డ్. రబ్బరు ప్లాంట్లలో దినసరి కోటాను పూర్తిచేయని కాంగో కూలీల చేతుల్ని ఆయన నరికేసేవాడు. తన పాలన చివరికి, ఆయన 1.5 కోట్ల కాంగోలీస్ ప్రజలను చంపాడు. కానీ మనకు ఒక్క హిట్లర్ గురించే పాఠాలు చెబుతారు.
- అడేమోలా, పాన్–ఆఫ్రికనిస్ట్

రెండు మార్గాలు



కళ్లు తెరవండి. స్పష్టంగా వినండి. ఇండియాలో కొంత మంది ఇలా చెబుతున్నారు: 'ఆ మతం, ఆ కులం, ఆ సంస్కృతి నీ శత్రువు. వాటిని నాశనం చేయి, నిన్ను నువ్వు కాపాడుకో.' ఇంకొందరు ఇలా చెబుతున్నారు: 'అన్ని మతాలను, అన్ని కులాలను, అందరు మనుషులను ప్రేమించాలి. అందరినీ సామరస్యంగా బతకనివ్వాలి.' వివేకంతో ఎంపిక చేసుకోండి.
- సయేమా, రేడియో జాకీ

మన మనుగడకు అడవులే శరణ్యం

అభిప్రాయం



మోతె రవికాంత్

భూమి మీద ఏ జీవి అయినా మనుగడ సాగించాలంటే చెట్ల ద్వారా వచ్చే ప్రాణవాయువే ఆధారం. ప్రాణవాయువు అందించే అడవులు భూమికి ఊపిరితిత్తుల లాంటివి. అయితే ఇప్పుడు అడవులు క్షీణించిపోతుండటమే విషాదకరం.

మానవ మనుగడ మొదలైనప్పటి నుంచి ముందుగా ఆవాసం కోసం, తరువాత వంట చెరకు కోసం, అనంతరం వ్యవసాయం కోసం, ఆ తర్వాత పరిశ్రమల కోసం... అడవుల నరికివేత కొనసాగుతోంది. అభివృద్ధి పేరుతో రహదారులు, భారీ నీటి ప్రాజెక్టులు, ఖనిజాలు, విలువైన కలప వంటి వాటికోసం అడవిని నిర్మూలించడం మొదలు పెట్టారు. అది ఎంతగా అంటే... గత 30 సంవత్సరాలలో ప్రపంచమంతటా కలిపి దాదాపు 13 లక్షల చదరపు కిలోమీటర్ల అడవులను నరికివేసేంతగా. ఈ విషయాన్ని ప్రపంచ బ్యాంకు నివేదికలు చెబుతున్నాయి. భూభాగం విషయంలో ప్రపంచంలోనే అతిపెద్ద దేశమైన రష్యాలో 45 శాతం అడవులు ఉన్నాయి. అదే భూభాగం విషయంలో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్న మనదేశంలో మాత్రం 23 శాతమే అడవులు ఉన్నాయి. ప్రపంచ దేశాలన్నీ కనీసం 30 శాతం అడవులు ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో మన దేశంలో మాత్రం అడవుల పరిరక్షణ అంతకంతకూ దిగజారుతోంది. పర్యావరణ నిపుణుల ప్రకారం... ఒక ప్రాంతంలోని మొత్తం భూభాగంలో 20 శాతం కొండ ప్రాంతాలు, అడవి కింద ఉండాలి. మైదాన ప్రాంతాల్లో 13 శాతం అడవి ఉండాలి. ఇలా మొత్తం 33 శాతం అడవులుండాలి. ఒక దేశానికి ఎంత భూమి ఉన్నది, అందులో ఎంత విస్తీర్ణంలో అడవి ఉన్నది అనే లెక్కలు చూడడం అవసరం. తలసరి అటవీ విస్తీర్ణం ఎంత ఉన్నదన్నది కూడా ముఖ్యమే. నిజానికి ఇది ఒక జీవన ప్రమాణ సూచి. మనం ఎంత ఆరోగ్యంగా బతుకుతున్నామో చెప్పగలిగే పారామీటర్. అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఒక మనిషికి కనీస తలసరి



అటవీ విస్తీర్ణం ఎకరం వరకు ఉండాలి. అదే మన దేశం విషయానికి వస్తే పావు ఎకరానికంటే ఇంకా తక్కువ మాత్రమే ఉందని నిపుణుల విశ్లేషణ.

అడవులు తగ్గడం వలన పర్యావరణ పరంగా, సామాజిక పరంగా కూడా మానవ సమాజం చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది. మానవ సమాజానికి అవసరమయ్యే ప్రతి వస్తువు, ముడి సరుకు అడవి నుంచి లేదా అడవి అనుబంధ జీవజాతుల నుంచే వస్తుంది. విచ్చలవిడిగా అడవుల నిర్మూలన వలన అడవులలో ఉండే విలువైన వృక్ష సంపద, ఔషధ మొక్కల సంపద కనుమరుగవుతోంది. అడవిలో ఉండే జీవజాతులు అంతరించిపోతున్నాయి. కొన్ని జంతువులు గ్రామాల్లోకి, నగరాల్లోకి కూడా వస్తున్నాయి. ముఖ్యంగా కోతులు ఊళ్లమీద పడి పంట పొలాలు నాశనం చేస్తున్న వార్తలు మనం వింటూనే ఉన్నాం.


సామాజిక పరంగా చూసినా అటవీ నిర్మూలన ఆందోళన కలిగించే విషయమే. అనాదిగా అడవినే నమ్ముకొని ఉన్న ఆదిమజాతులు గత 200 సంవత్సరాలలో ఎన్నో అంతరించిపోయాయి. ఉన్న ఆదిమ జాతులన్నా మనుగడ సాగించాలి. అది వారి హక్కు. అభివృద్ధి పేరుతో అడవుల్లో రహదారుల నిర్మాణం, ప్రాజెక్టుల నిర్మాణం, ఖనిజాల తవ్వకం వంటి వాటి వల్ల ఆదివాసీల మనుగడ ప్రశ్నార్థకం అవుతోంది. ఇందుకు సరైన ఉదాహరణ కొండరెడ్లకు పొంచి ఉన్న ప్రమాదం. తెలంగాణలో కొండరెడ్ల జాతి అతి త్వరలో అంతరించిపోతుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. మిగతా ఆదిమజాతులు అడవిని వదలి వలస బాట పడుతున్నాయి.

అడవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోకపోతే... భావితరాలకు అడవి, అడవిలోని జంతువులను బొమ్మల రూపంలోనే చూపించుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఆ పరిస్థితే వస్తే భూమిపై జీవించడమూ దుర్లభం అవుతుంది.

వ్యాసకర్త వ్యవస్థాపక అధ్యక్షులు, 'సెఫ్'
మొబైల్: 94919 24345

సికిల్ సెల్ వ్యాధిని ఎదుర్కోవాలంటే...

అభిప్రాయం




ప్రొ॥ టి.వి. కట్టిమణి

సికిల్ సెల్ వ్యాధి (ఎస్‌సీడీ), తలసేమియాలు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది వ్యక్తులను బాధించే వంశపారంపర్య రుగ్మతలు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఆరోగ్య సంరక్షణ అందుబాటులో లేని షెడ్యూల్డ్ తెగలలో ఎక్కువగా కనిపిస్తుంది. భారతదేశంలో ఎస్‌సీడీ ప్రబలంగా ఉంది. ప్రత్యేకించి మధ్య, పశ్చిమ ప్రాంతాలలో, 86 షెడ్యూల్డ్ తెగల్లో 1 శాతం మంది ప్రభావితమవుతున్నారు. ఇది శరీరమంతటా ఆక్సిజన్‌ను రవాణా చేసే ఎర్ర రక్త కణాలలోని హిమోగ్లోబిన్‌ను బలహీనపరుస్తుంది, దీని వల్ల అనారోగ్యం, మరణాలు సంభవిస్తాయి. ఐసీఎమ్ఆర్ చేసిన సర్వే ప్రకారం, సికిల్ సెల్ వ్యాధితో బాధపడుతున్న పిల్లలలో దాదాపు 20 శాతం మంది రెండేళ్ల వయస్సులోపు మరణిస్తున్నారు. గిరిజన సమూహంలో 30 శాతం మంది ఎస్‌సీడీ పిల్లలు చిన్నతనంలోనే మరణిస్తున్నారు.

మధ్య భారతదేశం, ఉత్తర కేరళ, తమిళనాడులోని 'సికిల్ సెల్ బెల్ట్'లో పరిస్థితి భయానకంగా ఉంది. స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లు, దేశవ్యాప్త రిపోర్టింగ్ సిస్టమ్ లేదా రిజిస్ట్రీలు లేకపోవడం వల్ల భారతదేశంలో సికిల్ సెల్ వ్యాధి కచ్చితమైన పరిమాణాన్ని నిర్ధారించడం అసాధ్యం. జమ్మూ కశ్మీర్‌లో 12 శాతం... హరియాణా, ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, బిహార్, కర్ణాటక మధ్య భాగం, ఆంధ్ర ప్రదేశ్, ఈశాన్య రాష్ట్రాలలో 1 శాతం ఫ్రీక్వెన్సీ ఉంది. షెడ్యూల్డ్ తెగలలో, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో గరిష్ఠ సంఖ్యలో బాధిత శిశువులు ఉంటారని అంచనా. విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో సికిల్ సెల్ లక్షణం, బీటా తలసేమియా లక్షణాల ప్రాబల్యం వరుసగా 0.7, 0.97 శాతాలుగా ఉన్నాయి. ప్రజారోగ్య వ్యూహాలను చక్కగా రచించడానికి ఎస్‌సీడీ ఎక్కడెక్కడ వ్యాప్తి చెందిందీ, అదెలా సంభవిస్తుందీ వంటి విషయాలకు సంబంధించిన పరిజ్ఞానం చాలా అవసరం.

సికిల్ సెల్, అనీమియాను నిర్మూలించాలనీ,



కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2023 బడ్జెట్ ప్రసంగంలో రక్తహీనత వ్యాధుల వల్ల జీడీపీపై తీవ్ర ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు. 2047 నాటికి వ్యాధిని నిర్మూలించేందుకు 'టెస్ట్–ట్రాక్–ఎడ్యుకేట్ –ట్రీట్–కౌన్సిల్' ప్రోగ్రామ్‌ను ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రతిపాదించడం ప్రశంసనీయం. ఇందువల్ల గిరిజన ప్రాంతాల్లోని 7 కోట్ల మంది ఆదివాసీలు ప్రయోజనం పొందనున్నారు. మెరుగైన రోగ నిర్ధారణ, చికిత్స, నిర్వహణ కోసం సంబంధిత ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు శిక్షణ ఇవ్వడం ద్వారా ప్రభుత్వం... ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం చాలా కీలకం.

గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ నిధులతో పనిచేసే సంస్థలలో పబ్లిక్ హెల్త్ ఫ్యాకల్టీలను ఏర్పాటు చేయడం వల్ల సికిల్ సెల్, తలసేమియా వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, విశ్లేషణ చేయడం, చికిత్స చేయడం వంటివి కచ్చితంగా పెరుగుతాయి. వైద్య అత్యవసర సమయాల్లో గిరిజన జనాభా సౌలభ్యం కోసం మారుమూల ప్రాంతాలలో టెలిమెడిసిన్ సౌకర్యాలను సృష్టించడం కూడా సాధ్యమే. గ్రామీణ కమ్యూనిటీలలో జీవన నాణ్యతను మెరుగుపరచడానికి... రక్తహీనత ఉన్న రోగులకు పోషకాహార సప్లిమెంట్లు, ఆర్గానిక్ సప్లిమెంట్లతో కూడిన వ్యవసాయ ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని అందించవచ్చు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎమ్ఆర్) ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో కొన్ని ప్రయోగశాలలను తెరవనుంది. ఇది అద్భుతమైన ప్రయత్నం. పై తీర్మానంతో పాటు, వివిధ వ్యాధుల నిర్ధారణ కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల వంటి ఉన్నత విద్యాసంస్థల్లో రిఫరెన్స్ లేబొరేటరీలను ఏర్పాటు చేయడానికి బడ్జెట్ కేటాయింపులను మరల్చగలిగితే ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ దిశలో తగిన ప్రయత్నాలు జరిగితే ఆదివాసీలకు ఎంతో మేలు కలుగుతుంది.

వ్యాసకర్త ఉప కులపతి, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

క్లుప్తంగా...

దళితుల అభివృద్ధికి ప్రభుత్వాలు పాటు పడాలి


అద్దంకి దయాకర్

సిరిసిల్ల టౌన్: దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా చూడకుండా వారి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాటు పడాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి సుధాకర్, జిల్లా అధ్యక్షుడు రొడ్డ రామచంద్రం, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మేడి అంజన్న, జిల్లా అధికార ప్రతినిధి మంగ కిరణ్, ఉపాధ్యక్షుడు మహేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నయ్యకు ప్రజల చేతిలో శిక్ష తప్పదు

- 'సాక్షి'కి లేఖరాసిన మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ వ్యవహారంలో మోసపోయిన రైతులకు మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డబ్బులు తిరిగి చెల్లించాలని లేకపోతే ప్రజల చేతిలో శిక్ష తప్పదని భారత కమ్యూనిస్టుపార్టీ (మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ హెచ్చరించారు. 'సాక్షి'కి పోస్టులో పంపించిన ఓ ప్రకటనలో ఎమ్మెల్యే చిన్నయ్య, అతని అనుచరులు సాగిస్తున్న అవినీతి, అక్రమాలు, దురాగతాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ శ్రేణులను ఎమ్మెల్యే రౌడీలుగా, కబ్జా కోరులుగా తీర్చిదిద్దుతున్నారని ఆరోపించారు. సమస్యలతో తనవద్దకు వచ్చే మహిళలను లొంగదీసుకోవాలని చూస్తున్నారని, లొంగని వారిని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఆరిజిన్ డెయిరీ విషయంలో గ్రామీణ ప్రాంతాల రైతులను మభ్య పెట్టి పాడిపరిశ్రమ, పాల ఉత్పత్తి కేంద్రం పేరుతో రూ.లక్షలు వసూలు చేశారని వివరించారు. రైతుల ఆందోళనలు, ఒత్తిడితో ఎమ్మెల్యే తన అధికార బలంతో ఆరిజిన్ డెయిరీ నిర్వాహకులపై కేసులు పెట్టించి తనకే సంబంధం లేదని నమ్మించే ప్రయత్నం చేశారన్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య అనుచరులైన గడ్డం భీమాగౌడ్, సాన శ్రావణ్, సన్నీబాబు, శ్యామ్, బత్తుల సుదర్శన్, కోలి వేణుమాధవ్, ప్రకాశ్ ఇతర బీఆర్ఎస్ గూండాలు తమ పద్ధతి మార్చుకుని ప్రజలను క్షమాపణ కోరాలని డిమాండ్ చేశారు.

గొర్రెల మందపై కుక్కల దాడి


మృతి చెందిన గొర్రెలు

ముస్తాబాద్(సిరిసిల్ల): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామ శివారులోని పల్లగుట్ట వద్ద శనివారం రాత్రి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో 33 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. నామాపూర్‌కు చెందిన చిట్టవేని నర్సయ్య పల్లగుట్ట శివారులో మందను ఉంచాడు. ఈ క్రమంలోనే శనివారం మందపై రాత్రివేళ కుక్కలు దాడి చేసి విచక్షణారహితంగా కొరికివేశాయి. ఆదివారం ఉదయం మంద వద్దకు వచ్చిన నర్సయ్య చనిపోయిన గొర్రెలను చూసి కన్నీరుమున్నీరుగా విలపించాడు. గొర్రెల పెంపకంతోనే ఆయన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. మంత్రి కేటీఆర్ తనను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

తండ్రి వెంటే తనయుడు


కమలయ్య


వెంకటయ్య

కోస్గి: తండ్రి మరణ వార్త విని తట్టుకోలేని ఓ కొడుకు గుండె ఆగిపోయింది. నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. కోస్గి శ్రీరామ కాలనీ పరిధి ఎస్సీ కాలనీలో బొడ్డు కమలయ్య, కిష్టమ్మలు.. తమ ఇద్దరు కొడుకులు వెంకటయ్య, రాజులతో కలిసి నివసిస్తున్నారు. పెద్ద కొడుకు వెంకటయ్య (35)కు వివాహం కాగా అతనికి భార్య తులసి, ఇద్దరు పిల్లలున్నారు. తండ్రి కమలయ్య (68) శనివారం రాత్రి మృతి చెందాడు. తండ్రి మరణాన్ని తట్టుకోలేని వెంకటయ్య తీవ్ర మనోవేదనకు గురై రోదిస్తూనే ఉన్నాడు. ఆదివారం ఉదయం కమలయ్య అంత్యక్రియల కోసం అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసేందుకు బంధువులు బజారుకు వెళ్లారు. రోదిస్తున్న కొడుకు వెంకటయ్య ఒక్కసారిగా ఉలుకుపలుకు లేకుండా కుప్పకూలి పడిపోయాడు. కుటుంబసభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా గుండెపోటుతో మరణించినట్లు నిర్ధారించారు. గంటల వ్యవధిలో ఒకే కుటుంబంలో తండ్రీకొడుకు మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. ఒకే వైకుంఠరథం వాహనంలో వారి మృతదేహాలను అంత్యక్రియలకు తరలించారు.

వైభవంగా భద్రాద్రి రామయ్య తెప్పోత్సవం


గోదావరి నదిలో శ్రీసీతారామచంద్ర స్వామి జలవిహారం. (ఇన్‌సెట్‌లో) తెప్పోత్సవంలో ఉత్సవమూర్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వసంత తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను మేళతాళాలు, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా గోదావరి నదికి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో స్వామివారిని కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఈవో రమాదేవి గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించిన తర్వాత స్వామివారి జలవిహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దొంగలదోపు ఉత్సవాన్ని కనులపండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఊంజల్ సేవ, మంగళవారం వసంతోత్సవం నిర్వహిస్తారు.

లీకేజీపై మా పోరాటం ఫలించింది

కాంగ్రెస్ ఒత్తిడితోనే ఈడీ కేసు నమోదైంది: రేవంత్‌రెడ్డి

- బీజేపీ నేతలు పేపర్ పులులు.. వారు కేంద్రానికి ఫిర్యాదు చేయలేదేం?
- కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలి.. టీఎస్‌పీఎస్సీని రద్దు చేసి కొత్త బోర్డు ప్రకటించాలి
- ఈనెల 10 నుంచి 25 వరకు మళ్లీ పాదయాత్ర
- గజ్వేల్‌లో నిరుద్యోగ నిరసన సభ నిర్వహిస్తాం
- రాహుల్‌గాంధీ విషయంలో కేంద్రానిది పైశాచిక ఆనందమని విమర్శ


గాంధీ భవన్ వద్ద రేవంత్‌తో గద్దర్

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ చేసిన పోరాటం ఫలించిందని, తమ ఒత్తిడి కారణంగానే ఈ విషయంలో ఈడీ కేసు నమోదైందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ అంశంలో పార్టీ అనుబంధ సంఘాలు ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ మంచి పోరాటం చేశాయని అభినందించారు. తమ పోరాటాన్ని కొనసాగిస్తామని, బాధితులకు న్యాయం జరగడంతోపాటు నిందితులపై చర్యలు తీసుకునేంతవరకు ఉద్యమం చేస్తామని తెలిపారు. ఆదివారం టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం అనంతరం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఇతర నేతలతో కలిసి రేవంత్ మీడియాతో మాట్లాడారు. తక్షణమే టీఎస్‌పీఎస్సీని రద్దుచేసి కొత్త బోర్డును ఏర్పాటు చేయాలని.. ఆ తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాల్సిందేనన్నారు. పేపర్ లీకేజీలో విచారణ ఎదుర్కొంటున్న టీఎస్‌పీఎస్సీ సభ్యుడు లింగారెడ్డి బావమరిది రాజశేఖర్‌రెడ్డి సీఎంవోలో పనిచేస్తున్నారని.. కేసీఆర్‌కు, రాజశేఖర్‌రెడ్డికి ఉన్న అనుబంధమేంటో తెలంగాణ ప్రజలకు తెలియాలని రేవంత్ పేర్కొన్నారు. తాము తీగలాగితే ప్రగతిభవన్ డొంక కదిలిందని చెప్పారు. లీకేజీ అంశంలో బీజేపీ నేతలు పేపర్ పులుల్లా వ్యవహరిస్తున్నారని.. కేవలం మీడియా ముందు మాత్రమే రంకెలు వేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ వ్యవహారంపై బీజేపీ నేతలు కేంద్రానికి ఎందుకు ఫిర్యాదు చేయలేదని, రాష్ట్ర గవర్నర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎందుకు లేఖ రాయలేదని నిలదీశారు. లీకేజీ వ్యవహారంలో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలతో కలిసి వెళ్లాల్సిన అవసరం లేదని టీపీసీసీ సభ్యులు అభిప్రాయపడ్డారని.. అయితే తాము చేపట్టే ఆందోళనల్లో టీఆర్ఎస్, బీజేపీ కాకుండా ఎవరు పాల్గొన్నా అభ్యంతరం లేదని చెప్పారు.

రాహుల్‌పై కక్ష గట్టారు

అదానీ కుంభకోణంపై గట్టిగా ప్రశ్నించినందుకే బీజేపీ రాహుల్‌గాంధీపై కక్ష గట్టిందని రేవంత్ ఆరోపించారు. రాహుల్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే ఆయనపై చర్యలు తీసుకున్నారని, ఇంటిని కూడా ఖాళీ చేయించి పైశాచికానందం పొందుతున్నారని మండిపడ్డారు. రాహుల్‌పై కేంద్రం వైఖరికి నిరసనగా సోమవారం నుంచి పోస్టుకార్డు ఉద్యమం చేపడతామని, ఈ నెల 8న మంచిర్యాలలో సత్యాగ్రహ దీక్ష చేస్తామని చెప్పారు. తన హాథ్‌సే హాథ్‌జోడో పాదయాత్రను తిరిగి ఈనెల 10 నుంచి 25వరకు నిర్వహిస్తామని.. జుక్కల్ నుంచి ఈసారి యాత్ర ప్రారంభమవుతుందని వెల్లడించారు. 25వ తేదీలోపు గజ్వేల్‌లో నిరుద్యోగ నిరసన సభ నిర్వహిస్తామని తెలిపారు.

అబద్ధాల్లో కేసీఆర్‌ను మించినోడు లేడు

పచ్చి అబద్ధాలను కూడా నిజం అని నమ్మించేలా చెప్పడంలో సీఎం కేసీఆర్‌ను మించిన వాళ్లు లేరని రేవంత్ విమర్శించారు. మహారాష్ట్ర రైతు సంఘం నేతలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా.. తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు లేవని చెప్పేందుకు గర్విస్తున్నానని సీఎం కేసీఆర్ చెప్పడాన్ని తప్పుపట్టారు. ''తెలంగాణలో రైతుల ఆత్మహత్యల గణాంకాలు ఎన్‌సీఆర్‌బీ (జాతీయక్రైమ్ రికార్డ్స్ బ్యూరో) గణాంకాల్లో భద్రంగా ఉన్నాయి. లెక్కకు రానివి అంతకు పదింతలు ఉన్నాయి. రైతు స్వరాజ్య వేదిక సమక్షంలో చర్చకు కూర్చుందాం. తెలంగాణలో ఆత్మహత్యలు లేవన్న వ్యాఖ్యల్లో నిజమెంతో నిగ్గు తేలుద్దాం. కేసీఆర్ సిద్ధమా?''అని ట్విట్టర్‌లో సవాల్ చేశారు.

గాంధీభవన్‌కు గద్దర్

ప్రజాగాయకుడు గద్దర్ ఆదివారం గాంధీభవన్‌కు వచ్చారు. రేవంత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నేతలను కలిశారు. దీనిపై రేవంత్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలవాలని గద్దర్‌ను కోరామని.. సత్యాగ్రహ దీక్షలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశామని వెల్లడించారు.

'పోస్టుకార్డు' ఉద్యమం

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఏఐసీసీ పిలుపునిచ్చిన జైభారత్ సత్యాగ్రహ దీక్షల కార్యాచరణను ఖరారు చేసేందుకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి. మహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాణిక్‌రావ్ ఠాక్రేతోపాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు బోసురాజు, నదీమ్‌జావెద్, చిన్నారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు పోదెం వీరయ్య, సీతక్క, పీసీసీ మాజీ అధ్యక్షులు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, పార్టీ ముఖ్య నేతలు పొన్నం ప్రభాకర్, నాగం జనార్దనరెడ్డి, కొండా సురేఖ, వేం నరేందర్‌రెడ్డి, మల్లు రవి, చామల కిరణ్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాలు నిర్వహించకుంటే చర్యలు: ఠాక్రే: సమావేశంలో భాగంగా మాణిక్‌రావ్ ఠాక్రే మాట్లాడుతూ ఏఐసీసీ పిలుపునిచ్చిన కార్యక్రమాలు నిర్వహించని నేతలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాలను నేతలంతా బాధ్యతాయుతంగా చేపట్టాలని, అందరినీ భాగస్వాములను చేయాలని ఠాక్రే పిలుపునిచ్చారు. రాష్ట్రంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలను పకడ్బందీగా నిర్వహించారని, రేవంత్‌రెడ్డి నిర్వహించిన 30 నియోజకవర్గాల్లో యాత్ర విజయవంతమైందని అభినందించారు. రాహుల్‌గాంధీ సందేశాన్ని ఇంటింటికీ అందించారని చెప్పారు. కాగా, రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు హాజరుకాని నాయకులను పదవుల నుంచి తొలగించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఇప్పటివరకు టీపీసీసీ కార్యవర్గ సమావేశాలు ఐదుసార్లు జరగ్గా ఈ సమావేశాలకు ఒక్కసారి కూడా రాని ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను 24 గంటల్లోగా పదవుల నుంచి తొలగించాలని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను రేవంత్ ఆదేశించారు.


తిరస్కరణకు కారణం చెప్పాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

ఆమోదించారో లేదో కూడా తెలియని దుస్థితి. రోజులు, నెలలు, సంవత్సరాల తరబడి వేచి చూశాక సదరు రైతు ఫోన్‌కు దరఖాస్తును కలెక్టర్ తిరస్కరించారనో లేదా ఆమోదించారనో మాత్రమే సందేశం వస్తోంది. ఆ సందేశం వచ్చే వరకు తమ దరఖాస్తు ఏమైందంటూ తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టరేట్‌ల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఉంటోంది. ఒకవేళ దరఖాస్తును తిరస్కరిస్తే అందుకుగల కారణమేంటో కూడా తెలియట్లేదు. కారణం కోసం ఏ స్థాయిలోని కార్యాలయానికి వెళ్లినా తమకు తెలియదంటే తమకు తెలియదంటూ దాటవేయడం పరిపాటిగా మారిపోయింది. దీంతో రైతులు తమ వినతులను ఉపసంహరించుకోవడమో లేక దళారులను ఆశ్రయించడమో జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులకు తమ దరఖాస్తులపై స్పష్టతనిచ్చే దిశగా సీసీఎల్ఏ కసరత్తు జరుగుతోంది.

సీటు కోసం అన్వేషణ షురూ!

- ఇంజనీరింగ్ సీట్ల వెతుకులాటలో తల్లిదండ్రులు
- ఇంటర్ పరీక్షలు ముగియకముందే వాకబు
- కాలేజీలు, డీమ్డ్ వర్సిటీల్లో మొదలైన హడావిడి



సాక్షి, హైదరాబాద్: ఇంటర్ పరీక్షలు వచ్చే నెల మొదటి వారంలో ముగుస్తాయి. ఆ తర్వాత విద్యార్థులు ఎంసెట్‌పై దృష్టి పెడతారు. ఎంసెట్ కూడా మే రెండో వారంతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు ఇంజనీరింగ్ కాలేజీల కోసం వెతుకులాట మొదలు పెడుతున్నారు. ఏ కాలేజీలో ఏ కోర్సులున్నాయి? ఎంసెట్ ర్యాంకు ఎంత వస్తే ఏ కాలేజీలో సీటు వస్తుంది? ఏయే కోర్సులకు డిమాండ్ ఉంది? నచ్చిన కోర్సు ఎక్కడ బాగుంటుంది? ఇలా అనేక అంశాలపై తల్లిదండ్రులు వాకబు చేస్తున్నారు. వీళ్ళంతా ప్రధానంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని కాలేజీలపైనే దృష్టి పెడుతున్నారు. వీటితో పాటు డీమ్డ్ యూనివర్సిటీల వివరాలూ సేకరిస్తున్నారు. ఎంసెట్ ర్యాంకుపై ఆశల్లేని వాళ్ళు ముందే సీటు ఖాయం చేసుకోవాలనే ఆతృతలో ఉన్నారు. మేనేజ్‌మెంట్ కోటా సీటు గురించి వాకబు చేస్తున్నారు. ఎంసెట్‌లో మంచి ర్యాంకు వస్తుందని ఆశించే విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం గత కొన్నేళ్ళ కౌన్సిలింగ్ వివరాలను బట్టి అంచనాల్లో మునిగి తేలుతున్నారు.

కాలేజీల్లోనూ హడావిడి..

సీట్ల వివరాల కోసం వస్తున్న వారికి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎలాంటి సంప్రదింపులూ జరపకపోయినా, వారి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఎంసెట్ పరీక్ష పూర్తయిన తర్వాత కాలేజీ నుంచి ఫోన్ కాల్ వస్తుందని, మేనేజ్‌మెంట్ సీటు విషయంలో అప్పుడు సంప్రదించవచ్చని కాలేజీ సిబ్బంది చెబుతున్నారు. కంప్యూటర్ సైన్స్ కోర్సులను కావాలనుకునే వాళ్ళు ముందే వాకబు చేస్తున్నారని, వీరంతా మేనేజ్‌మెంట్ కోటా సీట్లను ఆశిస్తున్నవారేనని నిజాంపేట ప్రాంతానికి చెందిన ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీ నిర్వాహకులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వచ్చిన సంజయ్ తన కూతురుకు 20 వేల లోపు ఎంసెట్ ర్యాంకు వస్తుందనే విశ్వాసం వెలిబుచ్చాడు. అయితే డేటా సైన్స్ ఆశిస్తున్నామని, టాప్ టెన్ కాలేజీల్లో సీటు వచ్చే పరిస్థితి లేదని తెలిపాడు. అందుకే మేనేజ్‌మెంట్ కోటా సీటును ముందే మాట్లాడుకుంటే కొంతైనా తగ్గుతుందని ప్రయత్నిస్తున్నట్టు తెలిపాడు. ఈ పరిస్థితిని గమనించిన కాలేజీలు ఎంసెట్ పూర్తవ్వగానే సంప్రదింపుల పేరుతో బేరసారాలు చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నాయి.

డీమ్డ్ వర్సిటీల్లో మొదలైన ప్రవేశాల ప్రక్రియ

ప్రైవేటు డీమ్డ్ వర్సిటీలు ఇప్పటికే ప్రవేశాల ప్రక్రియను మొదలు పెట్టాయి. వేర్వేరుగా సెట్స్ నిర్వహణ తేదీలను ప్రకటించాయి. మంచి ర్యాంకు వస్తే ఫీజు రాయితీ ఇస్తామని విద్యార్థులకు వల వేస్తున్నాయి. భారీ ఫీజులుండే ఈ వర్సిటీల్లో సీట్లు నింపుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. ప్రత్యేకంగా పీఆర్‌వోలను, ఏజెంట్లను కూడా నియమించాయి. ఇంటర్ కాలేజీలకు వెళ్ళి తమ ప్రవేశ పరీక్ష, కోర్సుల వివరాలు, వాళ్ళిచ్చే సదుపాయాలతో విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నంలో ఉన్నాయి. ముందస్తు ప్రవేశాలు అనుమతించబోమని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా, తల్లిదండ్రుల ఆతృతను గుర్తించి, తెరచాటు బేరసారాలు చేసే విషయంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలు ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా పలు మార్గాలను అన్వేషిస్తున్నాయి.

శ్రేయోభిలాషులతో మాట్లాడాకే పార్టీ మార్పు


పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వాజేడు: శ్రేయోభిలాషులతో మాట్లాడిన తర్వాతే పార్టీ మార్పు లేదా కొత్త పార్టీ ఏర్పాటు ఉంటుందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తేనీటి విందు కోసం ఆదివారం ములుగు జిల్లా వాజేడుకు వచ్చిన ఆయనను పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఎన్నో చేస్తోందని చెప్పినప్పటికీ అభివృద్ధి మాత్రం కానరావడం లేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రాజెక్టులను మంజూరు చేస్తే వాటిని రీడిజైన్ పేరుతో తరలించారని విమర్శించారు. ఏజెన్సీలో ఇంకా పక్కా గృహాలు లేవని, మిగులు రాష్ట్రం అప్పుల తెలంగాణగా మారుతోందని విమర్శించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రైతులకు పంటనష్టం కింద ఎకరానికి రూ.75 వేలు ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. గోదావరి పరీవాహకం వెంట ముంపు భారీ ఎత్తున ఉంటుందని, ముంపు ప్రాంతాల్లో కరకట్టలు నిర్మిస్తామని 8 నెలల క్రితం ముఖ్యమంత్రి ప్రకటించినా..నేటికీ ఆ ఊసే లేదనీ.. మరో మూడు నెలలు గడిస్తే గోదావరి వరదలతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,510 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది.

తెలంగాణ పథకాలు భేష్

- మహారాష్ట్ర రైతు ప్రతినిధుల ప్రశంస
- సిద్దిపేట జిల్లాలో పర్యటన


మహారాష్ట్ర రైతులతో మాట్లాడుతున్న వంటేరు

గజ్వేల్/తొగుట (దుబ్బాక)/సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో అడవుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ, పంట పొలాలకు గోదావరి జలాల మళ్లింపు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, రైతు వేదికల నిర్వహణ బాగుందని మహారాష్ట్ర రైతుల బృందం ప్రశంసించింది. సీఎం కేసీఆర్ గొప్ప పాలనాదక్షుడని మహారాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొనియాడారు. తెలంగాణలో ప్రాజెక్టులను నిర్మించి సాగు, తాగునీరు అందించారని, కరువును పారదోలారని వారు అన్నారు. మహారాష్ట్ర బీఆర్ఎస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు మాణిక్ కదమ్, రైతు సమితి యువజన అధ్యక్షుడు సుధీర్ బిందు, రైతు ప్రతినిధి సువర్ణ ఆధ్వర్యంలో సుమారు 80 మందికిపైగా రైతులు ఆదివారం గజ్వేల్‌తో పాటు సిద్దిపేట నియోజకవర్గంలో పర్యటించారు. ఈ బృందానికి ఎమ్మెల్సీలు దండె విఠల్, డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్లు మాదాసు శ్రీనివాస్, జహంగీర్ ఘనంగా స్వాగతం పలికారు. ములుగు రైతు వేదిక వద్ద మహారాష్ట్ర రైతు బృందానికి ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి రైతు వేదిక నిర్వహణ, వర్గల్ మండలం సింగాయపల్లి అటవీ సహజ పునరుద్ధరణ పథకం తీరును వివరించారు. గజ్వేల్ నియోజకవర్గంలోనే 33 వేల ఎకరాల్లో అడవులు పునరుద్ధరించినట్లు చెప్పారు. గజ్వేల్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌పై మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ వివరించారు. గజ్వేల్ మండలం కోమటిబండ గుట్టపై మిషన్ భగీరథ పథకం నిర్వహణను ఎస్ఈ శ్రీనివాసాచారి వివరించారు. అనంతరం గజ్వేల్ మండలం అహ్మదీపూర్ కూడవెల్లి వాగులో నీటిని మహారాష్ట్ర రైతులు పరిశీలించారు. అలాగే తుక్కాపూర్ శివారులోని పంప్‌హౌజ్, రిజర్వాయర్‌ను సందర్శించారు. మల్లన్నసాగర్ ద్వారా కూడవెల్లి వాగును నింపుతున్న తీరును నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ హరేరామ్, ఎస్ఈ వేణు వివరించారు.

ఆత్మీయ సమావేశాలకు సమాచారం లేదు

సీఎం ఆదేశాలను స్థానిక నాయకత్వం ఖాతరు చేయడంలేదు: కడియం



స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో జరుగుతున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలకు ఆహ్వానం గానీ, అందుకు సంబంధించిన సమాచారం గానీ తనకు అందలేదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. ఎన్నికల సమయంలో, పార్టీ బహిరంగ సభల సమయంలో నా సహాయం కోసం వస్తున్నారే తప్ప ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, ఆత్మీయ సమావేశాలకు సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించుకోవాలని అధిష్టానం సూచించిందని...అయితే స్థానిక నాయకత్వం సీఎం కేసీఆర్ ఆదేశాలను ఖాతరుచేయకుండా తనకు సమాచారం ఇవ్వడం లేదని చెప్పారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పార్టీ అభ్యర్థి రాజయ్య గెలుపు కోసం సొంత ఖర్చులతో కష్టపడి పనిచేశామని, ఆయన ఎన్నికల్లో సహకరించాలని కోరగా సీఎం ఆదేశాలకు కట్టుబడి నిజాయితీగా పనిచేశానని గుర్తు చేశారు. అదేవిధంగా 2015, 2021 ఎమ్మెల్సీ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం పనిచేశామని తెలిపారు.

కడియంను ఆహ్వానిస్తా: ఎమ్మెల్యే రాజయ్య



చిల్పూరు: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే 14 ఆత్మీయ సమావేశాల్లో భాగంగా సోమవారం శివునిపల్లిలో జరిగే సమావేశానికి కడియం శ్రీహరిని ఆహ్వానిస్తున్నట్లు ఎమ్మెల్యే రాజయ్య వెల్లడించారు. పలువురు కడియం శ్రీహరిని ఆహ్వానించలేదని అనుకుంటున్నారని అందులో వాస్తవం లేదన్నారు. జనగామ జిల్లా చిల్పూరు మండల పరిధి వెంకటాద్రిపేటలో దుర్గామాత, మహిళా కమ్యూనిటీ భవన నిర్మాణ పనుల శంకుస్థాపనకు హాజరైన రాజయ్య మాట్లాడుతూ...కేసీఆర్, కేటీఆర్ ఆదేశాల మేరకు ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తున్నామని, ఒక్కో నియోజకవర్గానికి ఎమ్మెల్సీలను ఇన్‌చార్జులుగా నియమించారని తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి కోటిరెడ్డిని, కడియంను నల్లగొండకు నియమించారని, మొదట ధర్మసాగర్‌లో జరిగిన సమావేశానికి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యే వరకూ ఉద్యమం

- స్తంభంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం ముట్టడి
- పాశిగామకు చెందిన 200 మంది బీఆర్ఎస్ శ్రేణుల రాజీనామా


పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించిన స్తంభంపల్లి గ్రామస్తులు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా చేపట్టిన ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమను రద్దు చేసేంతవరకూ తమ ఉద్యమం ఆగబోదని గ్రామస్తులు శపథం చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామ శివారులో ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మూడురోజులుగా స్తంభంపల్లితోపాటు సమీప పాశిగామ గ్రామస్తులు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ఈక్రమంలో ఆదివారం స్తంభంపల్లి గ్రామస్తులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. పాశిగామ గ్రామశాఖతోపాటు 200మంది అనుబంధ సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. అంతకుముందు స్తంభంపల్లి గ్రామస్తులు ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ధర్నా చేశారు. ప్రజల ప్రాణాలు హరించే పరిశ్రమను తమ ప్రాంతంలో చేపట్టకూడదని పంచాయతీ తీర్మానించాలని, లేకుంటే సర్పంచ్, ఉప సర్పంచ్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా తీర్మానించినందుకు రూ.కోటి వరకు సర్పంచ్‌కు ముడుపులు ముట్టాయని ఆరోపించడంతో ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. సర్పంచ్ అనుకూల, వ్యతిరేక వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ధర్మపురి సీఐ కోటేశ్వర్ వెంటనే స్తంభంపల్లి గ్రామానికి చేరుకున్నారు. ప్రాజెక్టు నిర్మాణం ఇష్టం లేకుంటే చట్టబద్ధంగా అధికారులకు వినతిపత్రాలు సమర్పించాలని వారికి సూచించారు. ఇదే సమయంలో పాశిగామకు చెందిన మహిళలు రోడ్డుపైకి రావడంతో ఎస్ఐ నరేశ్‌కుమార్ వారిని అడ్డుకొని ఇళ్లకు పంపించారు. సోమవారం రెండు గ్రామాల ప్రజలు కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇవ్వాలని తీర్మానించారు.

కూతురు నీటిలో మునిగిపోతోందని..

- కాపాడేందుకు బావిలోకి దిగిన తండ్రి
- ఇద్దరూ నీటిలో మునిగి మృత్యువాత
- గద్వాల జిల్లా వితలాపురంలో ఘటన


వెన్నెల


రాముడు

మల్దకల్: బావిలో మునిగి తండ్రి, కుమార్తె మృతి చెందిన విషాద ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని వితలాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అయిజకు చెందిన రాముడు (31) వితలాపురం గ్రామానికి చెందిన శ్రీరాంరెడ్డి అనే రైతు మామిడి తోటను లీజుకు తీసుకున్నాడు. తోట కాపునకు రావడంతో రాముడు కుటుంబంతో అక్కడే ఉంటున్నాడు. కొద్ది రోజులుగా కుమార్తె వెన్నెల (6), కుమారుడు సంతోష్‌లకు తోట సమీపంలోని బావిలో ఈత నేర్పిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే కుమారుడు, కుమార్తెతో కలసి ఈతకోసం బావి వద్దకు వెళ్లారు. కుమారుడికి ప్లాస్టిక్ డబ్బాను కట్టి బావిలోకి దింపాడు. అయితే కుమార్తె ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా బావిలోకి దిగింది. కాసేపటికే వెన్నెల నీటిలో మునిగిపోవడాన్ని గుర్తించిన తెలుగు రాముడు ఆమెను రక్షించేందుకు బావిలోకి దూకాడు. ఈ క్రమంలో కుమార్తె భయంతో తండ్రి గొంతును గట్టిగా పట్టుకోవడంతో ఇద్దరూ నీట మునిగి మృతి చెందారు. కుమారుడు మాత్రం ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకొని విషయాన్ని చుట్టుపక్కల రైతులకు తెలియజేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బావిలోని నీటిని మోటార్ల సాయంతో తోడి వేసి మృతదేహాలను బయటకు తీశారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

సరదాగా..

గూగుల్‌లో సౌకర్యాలు కట్..!

న్యూఢిల్లీ: గూగుల్‌లో ఉద్యోగమంటే ఎవరైనా ఎగిరి గెంతేస్తారు. అక్కడిచ్చే జీతం కంటే ఇతర సౌకర్యాల కోసం ఉద్యోగులు ఎగబడతారు. ఒక్కసారి ఆఫీసులోకి అడుగుపెడితే అన్నీ ఫ్రీయే. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్‌తో పాటు స్నాక్స్, లాండ్రీ సర్వీసు, మసాజ్ పార్లర్‌లే కాదు, తరచుగా కంపెనీ లంచ్‌లు కూడా ఉంటాయి. ఇప్పుడు ఆ సౌకర్యాలకి గూగుల్ కోత విధించింది. ఇక నుంచి స్నాక్స్, లంచ్‌లు, లాండ్రీ, మసాజ్ సర్వీసులు ఆఫీసులో ఉండవని ప్రకటించింది. ఇలా ఆదా చేసిన డబ్బుల్ని మరిన్ని కీలకమైన పరిశోధనలకు ఖర్చు పెడతామని గూగుల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రూత్ పోరట్ చెప్పారు. ఇప్పటికే ఈ ఏడాది 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామన్న గూగుల్ ఇప్పుడు ఇలా సౌకర్యాలు కూడా కట్ చేస్తూ ఉండడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొంది.

చైనా కాలేజీల్లో 'లవ్ బ్రేక్'




బీజింగ్: వేసవి సెలవులు, పండగ సెలవులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే కాలేజీలకు సెలవులు ఇవ్వడం సర్వసాధారణం. కానీ చైనాలో కాలేజీలు విద్యార్థులు ప్రేమలో మునిగి తేలడానికి సెలవులు ఇచ్చారు. అవును.. నిజమే.. చైనాలో యువ జనాభా తగ్గిపోతున్న విషయం తెలిసిందే కదా. దశాబ్దాల తరబడి అయితే ఒక్కరు లేదంటే వద్దు అన్న ఆంక్షల చట్రంలో గడిపిన చైనీయులు ఇప్పుడు ప్రేమ, పెళ్లి, పిల్లలు అన్న పదాల పట్ల విముఖంగా ఉన్నారు. అందుకే నేటి తరంలో కాస్తయినా ప్రేమ భావనలు మొలకెత్తడానికి కొన్ని కళాశాలలు ఈ కొత్త ఆలోచన చేశాయి. ఏప్రిల్ అంటే వసంత కాలం. ఈ కాలంలో చెట్లన్నీ విరబూసి వాతావరణం అత్యంత ఆహ్లాదంగా ఉంటుంది. స్ప్రింగ్ సీజన్‌ని ఎంజాయ్ చేయడంతో పాటు లవ్‌లో కూడా పడండి అంటూ ఒక వారం రోజులు సెలవులు ప్రకటించాయి చైనా కాలేజీలు. ''ప్రకృతిని ప్రేమించండి. . ప్రేమిస్తే ఎంత కొత్తగా వింతగా ఉంటుందో అనుభూతి చెందండి.లైఫ్ ఎలా ఎంజాయ్ చేయాలో తెలుసుకోండి'' అని యువతకి ప్రేమించుకోవడానికి కొన్ని కాలేజీలు హాలీడేస్ ప్రకటించాయి. అలా ప్రేమలో పడ్డ జంటలైనా ఒక్కటై పిల్లల్ని కంటారని ప్రభుత్వం ఆశగా ఎదురు చూస్తోంది.

పుష్పవిలాపం...

మొక్కలు ఏడుస్తాయట! ● బాధ కలిగితే మాట్లాడకుంటాయట

నేనొక పూల మొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి గోరానెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్లు విప్పి మా ప్రాణము తీతువాయనుచు బావురుమన్నవి...



అని కరుణశ్రీ జంధ్యాల పాపయశాస్త్రి పుష్పవిలాపాన్ని ఆవేదనాభరితంగా పలికిన ఘంటసాల స్వరం హృదయాన్ని మెలిపెడుతుంది. సుందర సుకుమారమైన పూలను తాకడానికి కూడా మనసు రాదు. ఇప్పుడీ కొత్త అధ్యయన ఫలితాలు తెలుసుకుంటే చివాలున కొమ్మ కూడా వంచాలనిపించదు. ఎందుకంటే ఏదైనా బాధ కలిగితే మొక్కలు కూడా ఏడుస్తాయట. అంటే, బాధతో మూలుగుతాయి. తోటి మొక్కలతో ఆ బాధను పంచుకుంటాయి. మొక్కలకి ప్రాణం ఉంటుందని మనకిప్పటికే తెలుసు. మొక్కలకు ప్రాణం ఉంటుందని, వేడికి, చలికి, కాంతికి, శబ్దానికి, గాయానికి స్పందిస్తాయని ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ ప్రపంచానికి తొలిసారిగా వెల్లడించారు. అయితే మొక్కలు ఏడుస్తాయని, తమకే తెలిసిన భాషలో ఇతర మొక్కలతో మాట్లాడతాయని, బాధని పంచుకుంటాయని ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మొక్కలు చేసే ఈ శబ్దాలను కూడా శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారిగా రికార్డు చేశారు. ఆ శబ్దం 'క్లిక్' మాదిరిగా ఉంటుంది. ఇంచుమించుగా పాప్‌కార్న్ వేయించేటప్పుడు చిటాపటా పేలుతూ ఉంటే వచ్చే శబ్దాల మాదిరిగా ఉంటాయి. అయితే ఈ శబ్దాలు చాలా హై ఫ్రీక్వెన్సీలో ఉండటం వల్ల వాటిని మనం నేరుగా వినలేం. అధ్యయన ఫలితాలను సైన్స్ జర్నల్ సెల్‌లో ప్రచురించారు. ''టొమాటో, పొగాకు వంటి మొక్కల నుంచి వచ్చే హై ఫ్రీక్వెన్సీ అల్ట్రాసోనిక్ శబ్దాలను రికార్డు చేశాం. గ్రీన్‌హౌస్ మొక్కల పెంపకంలో వాటి సైకలాజికల్ పారామీటర్లపై అధ్యయనం చేస్తూ ఈ శబ్దాలను కూడా రికార్డు చేశాం'' అని టెల్ అవీవ్‌లో మొక్కలపై అధ్యయనం చేసే ప్రొఫెసర్ లిలాచ్ హడానీ తాజా నివేదికలో వెల్లడించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నివేదిక ఏమి చెప్పిందంటే...

- టొమాటో, పొగాకు, గోధుమ, మొక్కజొన్న, కాక్టస్ వంటి మొక్కల నుంచి వచ్చే శబ్దాలను రికార్డు చేశారు.
- మొక్కలకి ఏదో ఒక బాధ కలిగిన సమయంలో ఎక్కువగా శబ్దాలు చేశాయి. కొన్ని మొక్కలకు ఐదు రోజులుగా నీళ్లు పొయ్యకపోతే, మరికొన్ని మొక్కల కాండం కత్తిరించినప్పుడు... ఇలా వాటికేదైనా బాధ కలిగినప్పుడే శబ్దాలు చేశాయి.
- బయట నుంచి ఎలాంటి శబ్దాలూ వినిపించని ఒక బాక్స్‌లో మొక్కల్ని ఉంచారు. వాటి నుంచి వెలువడే శబ్దాలను రికార్డు చేయడానికి అల్ట్రాసోనిక్ మైక్రోఫోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అల్గరిథమ్ టెక్నాలజీ వాడారు.
- మొక్కల నుంచి శబ్దాలు 20–250 కిలోహెడ్జ్ ఫ్రీక్వెన్సీలో రికార్డయ్యాయి. కొన్నింటినుంచి శబ్దాలు 40–80 ఫ్రీక్వెన్సీలో కూడా వస్తున్నాయి. మనం 16 కిలోహెట్జ్ ఫ్రీక్వెన్సీ శబ్దాలే వినగలం.
- మొక్కల శబ్దాలను గబ్బిలాలు, కీటకాలు వినగలవు.
- ఏ బాధా లేని మొక్కల నుంచి సగటున గంటకో శబ్దం వెలువడుతోంది. నీళ్లు లేక ఎండిపోతున్న, గాయపడ్డ మొక్కల నుంచి, కొమ్మలు విరిచేసి కాండాన్ని ముక్కలు చేసినప్పుడు గంటకు డజన్ల కొద్దీ శబ్దాలు వచ్చాయి.




ప్రయోగ రాకెట్ ల్యాండ్ అయిన దృశ్యం

ఆర్‌ఎల్‌వీ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట/సాక్షి బెంగళూరు: గగన్‌యాన్ ప్రాజెక్టు పరిశోధనా పరీక్షల్లో భాగంగా రీయూజబుల్ లాంచ్ వెహికల్ అటనామస్ ల్యాండింగ్ మిషన్(ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్) రాకెట్ ప్రయోగ పరీక్షలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆదివారం విజయవంతంగా నిర్వహించింది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా కుందాపురం సమీపంలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్)లో ఈ పరీక్ష చేపట్టారు. భారత వైమానిక దళానికి సంబంధించిన చినోక్ అనే హెలికాప్టర్ సహాయంతో ఆర్‌ఎల్‌వీ రాకెట్‌ను ఉదయం 7.10 గంటలకు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ కమాండ్ ఆధారంగా రాకెట్ తిరిగి 7.40 గంటలకు భూమిపై నిర్దేశిత ప్రాంతంలో క్షేమంగా ల్యాండయ్యింది. ముందస్తుగా సిద్ధం చేసి రూపొందించిన నేవిగేషన్, గైడెన్స్, నియంత్రణ వ్యవస్థల సహాయంతో ఈ మానవ రహిత లాంచింగ్ వాహనం ఎలాంటి ఆటంకం లేకుండా భూమిపైకి చేరింది. ఈ ప్రయోగంలో ఇస్రోతోపాటు డీఆర్‌డీవో, భారత వైమానిక దళం కూడా భాగస్వామిగా మారింది. ప్రపంచంలోనే మొదటిసారిగా హెలికాప్టర్ సహాయంతో ఆర్‌ఎల్‌వీ లాంటి రాకెట్‌ను ఆకాశంలో వదిలి, తిరిగి విజయవంతంగా భూమి మీదకు చేర్చిన ఘనత ఇస్రో శాస్త్రవేత్తలకే దక్కిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. ఆర్‌ఎల్‌వీ ప్రాజెక్టు నిర్వహణ బృందాన్ని ఆయన అభినందించారు. 2016 మే 23న ఆర్‌ఎల్‌వీ–టీడీ పేరుతో నిర్వహించిన ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2024 ఆఖరుకు గగన్‌యాన్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించిన ఇస్రోకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు.

కొత్తగా 3,824 కరోనా కేసులు



న్యూఢిల్లీ: దేశంలో కరోనా ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఆదివారం ఒక్కరోజే కొత్తగా 3,824 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత ఆరు నెలల్లో ఇవే ఒకరోజు అత్యధిక కేసులు కావడం గమనార్హం. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య ప్రస్తుతం 18,389కు చేరుకుంది. దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 4,47,22,605 కరోనా పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. 5,30,881 మంది ఈ మహమ్మారి కాటుకు బలయ్యారు. మరోవైపు రికవరీ రేటు 98.77 శాతంగా ఉంది. 4,41,73,335 మంది కరోనా బారిన పడి, చికిత్సతో పూర్తిగా కోలుకున్నారు. కరోనా సంబంధిత మరణాల రేటు 1.19 శాతంగా రికార్డయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 220.66 కోట్ల కోవిడ్–19 వ్యాక్సిన్ డోసులను ప్రజలకు పంపిణీ చేసింది.



పారిస్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్‌బాట్ చాట్ జీపీటీపై తాత్కాలిక నిషేధం విధిస్తూ ఇటలీ సంచలన నిర్ణయం తీసుకుంది. కఠినమైన యూరోపియన్ యూనియన్ డేటా పరిరక్షణ నియమాలను ఉల్లంఘించినందుకు ఈ చర్య తీసుకున్నట్టు సమాచారం. చాట్‌జీపీటీపై ఇలాంటి చర్య తీసుకున్న తొలి దేశం ఇటలీయే.

డేటా లీకేజీ ఉదంతం...
చాట్‌జీపీటీపై ఇటలీ నిషేధం

ఎందుకు?

యూజర్ల సంభాషణలు, చందాదారుల చెల్లింపులకు సంబంధించిన డేటా చాట్‌జీపీటీ ద్వారా లీకైందని ఇటలీ డేటా ప్రొటెక్షన్ అథారిటీ పేర్కొంది. అందుకే దాన్ని బ్లాక్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. డేటా గోప్యతను చాట్‌జీపీటీ పూర్తిస్థాయిలో గౌరవించేదాకా నిషేధం కొనసాగుతుందని తెలిపింది. దాని మాతృసంస్థ ఓపెన్‌ఏఐ ఎలాంటి చట్టపరమైన ఆధారమూ లేకుండానే భారీ పరిమాణంలో వ్యక్తిగత డేటాను సేకరించి ప్రాసెస్ చేస్తోందంటూ విస్మయం వ్యక్తం చేసింది. ''పైగా డేటా సేకరిస్తున్న యూజర్లకు ఈ విషయాన్ని నోటిఫై చేయడం లేదు. పైగా చాట్‌జీపీటీ కొన్నిసార్లు వ్యక్తులను గురించిన తప్పుడు సమాచారాన్ని పుట్టించి స్టోర్ చేస్తోంది. అంతేకాదు, యూజర్ల వయసును నిర్ధారించుకునే వ్యవస్థేదీ చాట్‌జీపీటీలో లేదు. కనుక అభ్యంతరకర కంటెంట్ పిల్లల కంటపడే రిస్కుంది. పైగా 13 ఏళ్ల కంటే తక్కువ వయసు చిన్నారుల కోసం ఫిల్టర్లేవీ లేకపోవడం తీవ్ర అభ్యంతరకరం'' అంటూ ఆక్షేపించింది. చాట్‌జీపీటీలో సాంకేతిక సమస్యలు కొత్తేమీ కాదు ఇతర యూజర్ల సబ్జెక్ట్ లైన్లు, చాట్ హిస్టరీ తదితరాలను కొందరు యూజర్లు చూసేందుకు వీలు కలుగుతుండటంతో సమస్యను సరిచేసేందుకు చాట్‌జీపీటీని కొంత కాలం ఆఫ్‌లైన్ చేస్తున్నట్టు మార్చి 20న ఓపెన్‌ఏఐ ప్రకటించడం తెలిసిందే. 1.2 శాతం మంది యూజర్లకు ఈ యాక్సెస్ లభించినట్టు విచారణలో తేలిందని సంస్థ పేర్కొంది.

20 రోజుల్లో నివేదించాలి

నిషేధం నేపథ్యంలో యూజర్ల డేటా గోప్యత పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నదీ ఓపెన్‌ఏఐ నివేదించాల్సి ఉంటుంది. లేదంటే 2.2 కోట్ల డాలర్లు/మొత్తం వార్షికాదాయంలో 4 శాతం జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల్లో అలసత్వానికి కారణమవుతుందంటూ ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు ఇప్పటికే చాట్‌జీపీటీని నిషేధించాయి.

పిట్ట కొంచెం రాత ఘనం

పుస్తకాన్ని రాసి ప్రచురించిన నాలుగేళ్ల బాలుడు ● గిన్నిస్ రికార్డులకెక్కిన సయీద్ రషీద్



అబుదాబి: పిట్ట కొంచెం కూత ఘనం అని సామెత. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన ఈ నాలుగేళ్ల బాలుడిని చూస్తే పిట్ట కొంచెం రాత ఘనం అని సామెత మార్చుకోవాలి. అబుధాబిలో ఉండే సయీద్ రషీద్ అనే నాలుగేళ్ల వయసున్న బాలుడు ఒక పుస్తకాన్ని రాయడంతో పాటు దానిని ప్రచురించి గిన్నీస్ వరల్డ్ రికార్డులకెక్కాడు. ఒక ఏనుగుకి, ఎలుగుబంటికి మధ్య ఏర్పడిన స్నేహానుబంధాన్ని కథగా మలిచాడు. ఆ పుస్తకం వెయ్యి కాపీల వరకు అమ్ముడైంది. గిన్నీస్ వరల్డ్ రికార్డు అధికారులు ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా సయీద్ రికార్డులకెక్కినట్టుగా ప్రకటించారు. సయీద్ ఈ పుస్తకం రాయడానికి ఎనిమిదేళ్ల వయసున్న అతని అక్క అయిధాబీ స్ఫూర్తిగా నిలిచిందని ఖలీజా టైమ్స్ వెల్లడించింది. ఇప్పటికే అయిధాబీ ఒక ప్రచురణ సంస్థను కూడా నడుపుతూ రికార్డులు సాధించింది. మొత్తమ్మీద ఫ్యామిలీలో అందరికీ పుస్తకాలంటే ఎంతో ఇష్టం కావడంతో ఈ అరుదైన ఘనత సాధించగలిగాడు.

సముద్ర జీవజాలానికి భూతాపం ముప్పు

- అంటార్కిటికాలో శరవేగంగా కరుగుతున్న మంచు
- సముద్రాల్లో అంతర్భాగాల్లో జల ప్రవాహాలకు ఆటంకం
- ఆక్సిజన్, పోషకాలు అంతరించిపోయే అవకాశం



ఆధునిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న శిలాజ ఇంధనాల వినియోగం.. తద్వారా నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, భూతాపం. వీటివల్ల భూగోళంపై మానవాళి మనుగడకు ముప్పు ముంచుకొస్తోందని పరిశోధకులు హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. కేవలం భూమిపై ఉన్న జీవజాలమే కాదు, సముద్రాల్లోని జీవులు సైతం అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆస్ట్రేలియా సైంటిస్టులు నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ఈ వివరాలను 'నేచర్' పత్రికలో ప్రచురించారు.

- ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలు, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం అనేది యథాతథంగా కొనసాగితే అంటార్కిటికాలో మంచు మరింత కరిగి, ఆ మంచినీరంతా సముద్రాల్లోకి చేరుతుంది.
- కొత్త నీటి రాకతో సముద్రాల ఉపరితల జలంలో లవణీయత, సాంద్రత తగ్గిపోతుంది. ఈ పరిణామం సముద్ర ఉపరితలం నుంచి అంతర్భాగంలోకి జల ప్రవాహాన్ని నిరోధిస్తుందని పరిశోధకులు తేల్చారు. సాధారణంగా సముద్రాల్లో పైభాగం నుంచి లోపలి భాగంలోకి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అంతర్భాగంలో కూడా ఒకచోటు నుంచి మరోచోటుకి జల ప్రవాహాలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయి.
- మంచు కరిగి, కొత్త నీరు వస్తే సముద్రాల పైభాగం నుంచి 4,000 మీటర్ల(4 కిలోమీటర్ల) దిగువన నీటి ప్రవాహాలు తొలుత నెమ్మదిస్తాయి. ఆ తర్వాత పూర్తిగా స్తంభించిపోతాయి. ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుంది.
- నీటి ప్రవాహం స్తంభిస్తే సముద్రాల్లో లోతున ఉండే ప్రాణవాయువు(ఆక్సిజన్), ఇతర పోషకాలు సైతం అంతమైపోతాయని సైంటిస్టు ప్రొఫెసర్ మాథ్యూ ఇంగ్లాండ్ చెప్పారు. దీంతో సముద్రాల్లోని జీవుల మనుగడకు అవసరమైన వనరుల కొరత ఏర్పడుతుందని తెలిపారు. వాటి మనుగడ ప్రమాదంలో పడుతుందని వివరించారు. ఇదంతా మొత్తం సముద్ర జీవావరణ వ్యవస్థను దెబ్బతీస్తుందని వారు వెల్లడించారు.
- సముద్రాల్లో జలమట్టం పెరిగితే ఉపరితలంపై కొత్త నీటి పొరలు ఏర్పడుతాయి. దానివల్ల సముద్రాలు కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకోలేవు. అంతే కాకుండా తమలోని కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. సముద్రాల నుంచి కర్బన ఉద్గారాలు ఉధృతమవుతాయి. ఫలితంగా భూగోళం మరింత వేడెక్కుతుంది.
- అంటార్కిటికాలో ప్రతిఏటా 250 ట్రిలియన్ టన్నుల చల్లని, ఉప్పు, ఆక్సిజన్‌తో కూడిన నీరు చేరుతుంది. ఇది ఉత్తర దిశగా విస్తరిస్తుంది. హిందూ, పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాల్లోకి ఆక్సిజన్‌ను చేరుస్తుంది. రానున్న రోజుల్లో అంటార్కిటికా నుంచి విస్తరించే ఆక్సిజన్ పరిమాణం తగ్గనుందని అంచనా వేస్తున్నారు.

+ ప్రపంచ కర్బన ఉద్గారాలను సమర్థంగా నియంత్రించకపోతే రాబోయే 40 సంవత్సరాల్లో అంటార్కిటికాలోని సముద్రాల కింది భాగంలో జల ప్రవాహం ఆగిపోతుందని, సముద్ర జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని సైంటిస్టులు నిర్ధారించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఈ గాలి.. ఈ నేల...


బాల్య స్మృతుల్లో కమలా హ్యారిస్



లుసాకా: అమెరికా ఉపాధ్యక్షురాలు కమల హ్యారిస్ జాంబియా వెళ్లి తన బాల్య స్మృతుల్లో మునిగిపోయారు. తన తాత, భారత్‌కు చెందిన పి.వి.గోపాలన్ ఇంట్లో చిన్నప్పుడు వారితో గడిపిన రోజుల్ని గుర్తు చేస్తుకున్నారు. 1960 దశకంలో కమల హ్యారిస్ తాత చెన్నై నుంచి జాంబియా రాజధాని లుసాకా వెళ్లి అక్కడ ఇండియన్ ఫారెన్ సర్వీసు అధికారిగా సేవలందించారు. అప్పట్లో తాము నివసించిన ఇల్లు ఇప్పుడు లేకపోయినా ఆ ప్రాంతానికి వెళ్లిన కమల అక్కడ మట్టి పరిమళాన్ని ఆస్వాదించారు. ''నా చిన్నతనంలో మా తాతయ్యతో గడిపిన రోజులు నాకెంతో విలువైనవి. ఈ ప్రాంతంలో నా బాల్యం గడిచింది. ఇప్పుడు మళ్లీ అక్కడే ఉన్నానన్న ఊహ ఎంతో మధురంగా ఉంది.బాల్య జ్ఞాపకాలు ఎప్పుడూ ఒక ఉద్వేగాన్ని ఇస్తాయి. ఇక్కడ్నుంచి మా కుటుంబం తరఫున ప్రతీ ఒక్కరికీ హాయ్ చెబుతున్నాను'' అని అంటూ కమలా హ్యారిస్ ఉద్విగ్నతకు లోనయ్యారు.

ఆన్సర్‌షీట్‌లో బాలీవుడ్ పాటలు ..!

చండీగఢ్: పరీక్షలు రాయడానికి కూర్చున్న ఆ స్టూడెంట్‌కు క్వశ్చన్ పేపర్ చూడగానే పగలే చుక్కలన్నీ కట్టకట్టుకుని కన్పించాయి. ఒక్కదానికీ ఆన్సర్ తెలియదు! ఏం చేయడమా అని తల పట్టుకున్నాడు. బాగా ఆలోచించి... బాలీవుడ్ పాటలన్నీ తీరుబడిగా ఒకదాని తర్వాత ఒకటి రాస్తూ పోయాడు. అలా ఆన్సర్ షీటు నిండా జవాబులకు బదులుగా పాటలే రాసేసి ఇచ్చాడు. చండీగఢ్‌లో ఒక స్కూలులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన ఆన్సర్ షీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు విద్యార్థి ఆమిర్ ఖాన్ నటించిన సూపర్ హిట్ బాలీవుడ్ సినిమాలు త్రీ ఇడియట్స్‌లోని 'గివ్ మి సమ్ సన్‌షైన్...', పీకేలోని 'భగవాన్ హే కహా రే తూ...' అంటూ తన అవస్థకు అద్దం పట్టే పాటలే రాశాడు! దాంతో పేపర్‌ను దిద్దిన టీచర్ సున్నా మార్కులిచ్చింది. అయితే, 'మరిన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సింది' అంటూ చివరి పేజీలో సరదా కామెంట్ రాయడంతో నెటిజన్లు హాయిగా నవ్వుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీనిని విస్తృతంగా షేర్ చేస్తున్నారు.



కర్ణాటకలో దక్షిణ ప్రయాగగా పేరొందిన నంజనగూడు పట్టణంలో శ్రీకంఠేశ్వర ఆలయంలో ఆదివారం వార్షిక రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

రెండేళ్ల జైలు శిక్షపై నేడు రాహుల్ అపీల్

సూరత్: పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్షను కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సవాలు చేయనున్నారు. సూరత్ మెట్రోపాలిటన్ కోర్టు తీర్పుపై స్థానిక సెషన్స్ కోర్టులో సోమవారం అపీలు దాఖలు చేయనున్నారు. 'మోదీ ఇంటిపేరు' వ్యాఖ్యలపై రాహుల్‌ను దోషిగా ఖరారు చేస్తూ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్‌హెచ్ వర్మ మార్చి 23న తీర్పు వెలువరించడం తెలిసిందే. వెంటనే బెయిల్ మంజూరు చేయడంతో పాటు తీర్పుపై అపీలుకు 30 రోజుల గడువు కూడా ఇచ్చారు. ఈ తీర్పు నేపథ్యంలో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కూడా రద్దవడం తెలిసిందే.

అల్లర్లకు పాల్పడ్డవారిని తలకిందులుగా ఉరి తీస్తాం

నితీశ్‌ది 'బ్యాడ్' సర్కారు ● బిహార్‌లో గెలిచేది మేమే: అమిత్ షా



హిసువా (బిహార్): బిహార్లో నితీశ్ కుమార్ సారథ్యంలోని మహా ఘట్‌బంధన్ సంకీర్ణాన్ని 'బ్యాడ్' (భ్రష్టాచార్–అవినీతి, అరాచకం, దమన్–అణచివేతలకు పాల్పడుతున్న) సర్కారుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అనైతిక సంకీర్ణాన్ని బీజేపీ ఓడించి తీరుతుందని ధీమా వెలిబుచ్చారు. ఆదివారం బిహార్‌లోని నవడా జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బిహార్‌లో మత హింసకు నితీశే కారకుడంటూ దుయ్యబట్టారు. రాష్ట్రంలో అరాచకం ప్రబలుతుంటే చూస్తూ ఊరుకోబోనన్నారు. ''పరిస్థితిపై నేను గవర్నర్‌తో మాట్లాడటాన్ని జేడీ(యూ) చీఫ్ లాలన్‌సింగ్ తప్పుబడుతున్నారు. నేను కేంద్ర హోం మంత్రినని ఆయన మర్చిపోవద్దు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో, తర్వాత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గాక ఈ అల్లర్లకు పాల్పడ్డవారిని తలకిందులుగా ఉరి తీస్తాం'' అని హెచ్చరించారు.

77 మంది అదుపులో

బిహార్లో పలుచోట్ల మత ఘర్షణలు కొనసాగుతున్నట్టు సమాచారం. రామనవమి ఉత్సవాల సందర్భంగా నలంద జిల్లాలోని బిహార్ షరీఫ్‌లో జరిగిన హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా 77 మందిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. శనివారం రాత్రి మరోసారి ఘర్షణలు తలెత్తిన నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లోనే ఉన్నట్టు చెప్పారు. ససారాంలో శనివారం 45 మందిని అరెస్టు చేశారు.

మోదీ డిగ్రీలపై మరిన్ని అనుమానాలు: ఆప్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ విద్యార్హతలపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రశ్నల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆయన డిగ్రీ సర్టిఫికెట్లు నిజమైనవో కాదో చెప్పాలని పార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ ఆదివారం మరోసారి డిమాండ్ చేశారు. ''మోదీ విద్యార్హతలపై విచారణ జరిగి, అవి నకిలీవని తేలితే లోక్‌సభ సభ్యత్వం కోల్పోతారు. ఈసీకి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఎన్నికల్లో పోటీకి అనర్హుడవుతారు'' అని గుర్తు చేశారు. ''ఈ అంశాన్ని ఆప్ తెరపైకి తెచ్చినప్పటి నుంచీ బీజేపీకి ఊపిరాడటం లేదు. మోదీ డిగ్రీలు నకిలీవి కావని నిరూపించేందుకు పడరాని పాట్లు పడుతోంది'' అంటూ ఎద్దేవా చేశారు. ''గుజరాత్ యూనివర్సిటీ నుంచి మోదీ ఎమ్మే పూర్తి చేశారంటూ సదరు డిగ్రీని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పట్లో మీడియాకు చూపించారు. కానీ అందులో యూనివర్సిటీ స్పెలింగ్ యూనిబర్సిటీ అని తప్పుగా ఉంది. పైగా దానిపై మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ అని రాసిన ఫాంట్‌ను 1992లో ప్రవేశపెట్టారు. 1983లో ఎమ్మే పూర్తి చేసిన మోదీ సర్టిఫికెట్లపై అదెలా వచ్చినట్టు?'' అని ప్రశ్నించారు. స్కూలు చదువుతోనే ఆపేశానని గుజరాత్ సీఎంగా ఉండగా మోదీ చెప్పిన వీడియోను సింగ్ ప్రదర్శించారు.

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జన

నలుగురి మృతి.. ఆరుగురికి గాయాలు

ఒక్లహామా: అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఆరుగురు గాయాల పాలయ్యారు. శనివారం రాత్రి సౌత్‌వెస్ట్ ఒక్లహామా సిటీలో ఓ దుండగుని కాల్పుల్లో ముగ్గురు మరణించారు. లాస్ ఏంజెలెస్‌లో ఓ షాపింగ్ సెంటర్ బయట జరిగిన కాల్పుల్లో ఒకరు మృతిచెందారు.

సాక్షి
కరీంనగర్
సోమవారం ၊ 3 ၊ ఏప్రిల్ ၊ 2023



రాజన్నకు కోడె మొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. కోడె, తలనీలాల మొక్కులు చెల్లించుకున్నారు.



తగ్గిన గోదావరి నీటిమట్టం

ధర్మపురి: మొన్నటిదాకా పుష్కరఘాట్లను తాకుతూ పారిన గోదావరి నీటి ప్రవాహం ఆదివారం బాగా తగ్గింది. ఎండలు మండుతుండడంతో నీటిమట్టం తగ్గిందని భావిస్తున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
37.0/23.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతుంది.

జీవితం చాలా కష్టమైన పరీక్ష. దానిలో చాలామంది విఫలం చెందటానికి కారణం. ప్రతీ ఒక్కరి ప్రశ్నాపత్రం వేరని గ్రహించకపోవటమే.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
సోమ 6:32	మంగళ 4:43

రంజాన్ వేళలు

విజయోస్తు..

- నేటి నుంచి 13 వరకు పదో తరగతి పరీక్షలు
- జిల్లాలో 76 కేంద్రాలు.. 12,144 మంది విద్యార్థులు
- గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి
- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాశాఖ
- 960 మంది సిబ్బందితో నిర్వహణ

జిల్లాలో..	
మొత్తం పాఠశాలలు	338
మొత్తం విద్యార్థులు	12,144
బాలురు	6,359
బాలికలు	5,785
ప్రైవేట్	51



పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కరీంనగర్: పదో తరగతి పరీక్షలకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. జిల్లావ్యాప్తంగా నేటి నుంచి 13 వరకు నిర్వహించనున్న పరీక్షలకు విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో అన్ని యాజమాన్యాల ఉన్నత పాఠశాలలు 338 ఉండగా వాటిలో రెగ్యులర్ 12,144, ప్రైవేట్ (కంపార్ట్‌మెంట్) 51 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. మొత్తం 76 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష సమయం. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలి.

కేంద్రాల్లో అన్ని వసతులు

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష హాలులో వెలుతురు, తాగునీటి వసతి, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్ నుంచి పరీక్ష సమయాని కంటే ముందుగా తీసుకువచ్చేలా చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), డిపార్ట్‌మెంట్ అధికారుల(డీవో)కు ఆదేశాలు జారీ చేశారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలుతో పాటు సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని అధికారులకు సూచించారు.

ఈసారిసైతం ఆరు పేపర్లే..

గతేడాది వలె ఈ సారి కూడా పదో తరగతి వార్షిక పరీక్షలు ఆరు పేపర్లతోనే నిర్వహించనున్నారు. గతంలో ప్రతీ సబ్జెక్టు పేపర్–1, పేపర్–2గా రెండు రోజులు పరీక్ష నిర్వహించగా, ప్రస్తుతం ప్రతీ సబ్జెక్టు ఒకటే పేపర్‌లో నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రశ్నపత్రాలను సిద్ధం చేసింది.

960 మందితో నిర్వహణ

జిల్లాలో పదో తరగతి పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. 76 కేంద్రాల్లో 960 మంది సిబ్బందితో పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తారు. అందులో డిపార్ట్‌మెంట్ అధికారులు 76, చీఫ్ సూపరింటెండెంట్లు 76, అదనపు రూటు అధికారులు 2, ఇన్విజిలేటర్లు 636, సిట్టింగ్ స్క్వాడ్ 76, కస్టోడియన్లు 18, క్లర్కులు 76 మందితో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ 5 బృందాలతో పరీక్షల తీరును పర్యవేక్షిస్తారు.

సీసీ కెమెరాల నిఘాలో..

జిల్లా వ్యాప్తంగా కేటాయించిన సెంటర్లలో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వ హించేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే సుమారు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల సీల్ ఓపెన్ చేసినప్పటి నుంచి పరీక్ష పూర్తయి వాటిని సీల్ చేసే వరకు సీసీ కెమెరాల్లో రికార్డు కానున్నాయి.

సందేహాలా.. ఈ నంబర్లలో సంప్రదించండి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు అత్యవసరంగా ఫిర్యాదులు, సందేహాలకు డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు డీవో తెలిపారు. 93812 48835, 70133 53090 నంబర్లలో సంప్రదించాలని, ఇవి 24 గంటలు పనిచేస్తాయని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో డీఈవోతో పాటు ఎంఈవోల ఫోన్ నంబర్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

హాల్‌టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో కండక్టర్లకు హాల్‌టికెట్ చూపిస్తే ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పిస్తున్నాం. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. సరైన సమయంలో పరీక్షలకు హాజరు కావాలి. – ఖుస్రోషాఖాన్, ఆర్టీసీ ఆర్‌ఎం

ఏర్పాట్లు చేశాం



పది పరీక్షల నిర్వహణ సెంటర్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున తాగునీరు, వైద్య, పోలీసు సిబ్బంది పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకునేలా తల్లిదండ్రులు అప్రమత్తం చేయాలి. పరీక్ష హాలులోకి ఎలాంటి కాగితాలు, పర్సులు వెంట తీసుకు రావొద్దు. పరీక్ష కిట్లను మాత్రమే వెంట తీసుకురావాలి. పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్లు తీసుకువచ్చేందుకు అనుమతి లేదు.
– సీహెచ్ జనార్దన్‌రావు, డీఈవో

మంత్రి గంగులను కలిసిన డీఎంహెచ్‌వో



మంత్రి కమలాకర్‌కు పూలమొక్క అందిస్తున్న డీఎంహెచ్‌వో సాజిదా

కరీంనగర్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌వో)గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ సాజిదా అతహరి ఆదివారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి మీ సేవా కార్యాలయంలో కలిసి పూల మొక్క అందజేశారు.

నిషేధాజ్ఞలు కొనసాగింపు

కరీంనగర్‌క్రైం: సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై, డీజే సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బరాయుడు ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించడం జరిగిందన్నారు. నిషేధాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపీసీ 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలీ నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలి



సర్పంచ్‌ను అభినందిస్తున్న వినోద్‌కుమార్

తిమ్మాపూర్(మానకొండూర్): దీన్ దయాల్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాల్లో భాగంగా పచ్చదనం– పరిశుభ్రత విభాగంలో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీగా పర్లపల్లి ఎంపిక కాగా, సర్పంచ్ మాదాడి భారతిని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అభినందించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి, తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి పర్లపల్లి గ్రామంలో హరిత విప్లవం తీసుకునివచ్చిన సర్పంచ్ భారతి రాష్ట్రంలోని ఇతర గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. భవిష్యత్తులో పర్లపల్లికి మరిన్ని అవార్డులు, రివార్డులు సాధించాలని ఆకాంక్షించారు. రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత గ్రీనరీగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎల్పీ కార్యదర్శి మాదాడి రమేశ్‌రెడ్డి ఉన్నారు.

కరీంనగర్ యాక్టర్ క్లబ్ ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ యాక్టర్ క్లబ్ ఆదివారం ప్రారంభమైంది. ఉమ్మడి కరీంనగర్‌లో నటనపై ఆసక్తి ఉన్నవారికి మెలకువలు నేర్పించి అవకాశాలు కల్పించేందుకు మాస్క్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్లబ్‌ను ఆదివారం స్వర్ణకారుల సంఘ భవనంలో కరీంనగర్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిట్టుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం క్లబ్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ అనసూరి భూనాథచారి, మాడిశెట్టి గోపాల్, కలర్ సత్తెన్న, కడార్ల శివప్రసాద్, శ్రీకాంత్, రవీంద్రచారి, జగన్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెండో విడత ఇంటర్ మూల్యాంకనం

కరీంనగర్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకన రెండో విడత ప్రక్రియను మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు డీఐఈవో టి.రాజ్యలక్ష్మి ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గల (ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ, మహాత్మా జ్యోతిబాపూలే, ఆదర్శ, కేజీబీవీ, మైనార్టీ) జూనియర్ కళాశాలల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు హాజరు కావాలని పేర్కొన్నారు. భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం సబ్జెక్టులను ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికల)లో మూల్యాంకనం చేయనున్నట్లు పేర్కొన్నారు. అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఎగ్జామినర్ నియామక ఉత్తర్వులు tsbie.cgg.gov.in మీ కళాశాల లాగిన్‌లో అందుబాటులో కలవని తెలిపారు. ఆయా మూల్యాంకన కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

పన్ను సకాలంలో చెల్లించాలి

కరీంనగర్‌సిటీ: కరీంనగర్ నగరపాలక సంస్థలో 2023–2024 ఆర్థిక సంవత్సరం ఆదాయ పన్నుపై ప్రభుత్వం 5 శాతం రిబేట్ అవకాశాన్ని కల్పించిందని ఆర్వో ఆంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కేవలం 2022–2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించినవారికే వర్తిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నూతన ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ప్రజలు నగరపాలక సంస్థకు సకాలంలో చెల్లించాలన్నారు. మొండి బకాయిదారులు ఇప్పటికైనా పన్ను చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో నగరపాలక సంస్థ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటుందని. అవసరమైతే పన్ను చెల్లించనివారి ఆస్తులు కూడా జప్తు చేస్తుందన్నారు.

రంజాన్ కానుకలు వచ్చేశాయ్

- జిల్లాకు 7,500 కేటాయింపు
- రూ.15లక్షలతో ఇఫ్తార్ విందులు

కరీంనగర్‌రూరల్: రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు అందించే కానుకలు జిల్లాకు చేరాయి. పేద కుటుంబాలు పండుగను సంబరంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఏటా రంజాన్ పండుగకు ముస్లింలకు దుస్తులు, బతుకమ్మ పండుగకు హిందూ మహిళలకు చీరలు, క్రిస్మస్ పండుగకు క్రిస్టియన్లకు దుస్తులను పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని జిల్లాకు మొత్తం 7,500 కానుకల ప్యాకెట్లు రెండురోజుల క్రితం వచ్చాయి. దీనిలో కరీంనగర్ నియోజకవర్గానికి 4వేలు, హుజురాబాద్‌కు 1500, మానకొండూరుకు 1000, చొప్పదండికి 1000 ప్యాకెట్లు కేటాయించారు. బొమ్మకల్ బైపాస్‌రోడ్డులోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కానుకల ప్యాకెట్లను నిల్వ చేశారు. అక్కడి నుంచి మైనార్టీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కరీంనగర్, హుజూరాబాద్, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గ మండల తహసీల్దార్లకు ప్రత్యేక వాహనాల్లో కానుకల ప్యాకెట్లను తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే ముస్లింలకు ఇఫ్తార్ విందుల కోసం జిల్లాకు ప్రభుత్వం రూ.15లక్షలు మంజూరు చేసింది. కరీంనగర్ నియోజకవర్గానికి రూ. 8 లక్షలు, హుజురాబాద్‌కు రూ.3 లక్షలు, మానకొండూరు, చొప్పదండి నియోజకవర్గాలకు రూ.2లక్షల చొప్పున కేటాయించారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముస్లిం పెద్దలతో సంప్రదించి ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేస్తారు.



బొమ్మకల్ బైపాస్‌లోని గోదాంలో రంజాన్ కానుకలు నిల్వ చేస్తున్న దృశ్యం

పంపిణీకి ఏర్పాట్లు

జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసిన రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. అర్హులైన నిరుపేదలను గుర్తించి కానుకలను అందజేసేందుకు చర్యలు చేపట్టాం. ఆయా నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు, మంత్రితో చర్చించి గిఫ్ట్‌ప్యాకెట్ల పంపిణీకి తేదీలను నిర్ణయించి అందిస్తాం.
– మధుసూదన్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి

జేసీఐ జాబ్‌మేళాకు స్పందన



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కరీంనగర్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్(జేసీఐ) కరీంనగర్ ఎక్సలెక్స్ ఆధ్వర్యంలో లయోల జూనియర్ కళాశాలలో ఆదివారం మెగా జాబ్‌మేళా నిర్వహించగా స్పందన లభించింది. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ ముఖ్య అతిథిగా హాజరై, జాబ్‌మేళాను ప్రారంభించారు. జేసీఐ కరీంనగర్ సంస్థ మంచి కార్యక్రమాలు చేస్తోందని, జాబ్‌మేళా కండక్ట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. యువతకు ఇది చక్కటి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు 28 ఐటీ, నాన్ ఐటీ కంపెనీలు హాజరయ్యాయి. అభ్యర్థులకు రెండు రౌండ్ల ఇంటర్వ్యూ నిర్వహించారు. కార్యక్రమంలో లయోల కళాశాల ఫాదర్ ఎం.ఏ.అలెక్స్, రూబిన, జేసీఐ ఫౌండర్ ఫయాజ్, ప్రెసిడెంట్ రాధికారాణి, సెక్రటరీ రియాజుద్దీన్, పద్మజ, శ్రీనివాస్, నరేష్, కుమార్, రాకేశ్, కీర్తన, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు సర్వాయి పాపన్న



పాపన్న చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, తదితరులు

కరీంనగర్: 17వ శతాబ్దంలోనే బహుజన రాజ్యాన్ని స్థాపించిన తొలి బహుజన పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న అని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వాయి పాపన్న 313వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మన అస్తిత్వం కోసం పోరాడిన మహనీయుల జీవన ప్రమాణాల గురించి భావితరాలకు కచ్చితంగా తెలియజేయాలన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మహనీయులు, పోరాటయోధులను స్మరించుకునేందుకు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ నవీన్ నికోలస్, బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్, సర్దార్ సర్వాయి పాపన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరస్వామిగౌడ్, జిల్లా అధ్యక్షుడు గణపతిరాజు, బుర్ర నర్సయ్య, ఉపాధ్యక్షుడు గండి వీరస్వామి, గుర్రం భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేయాలి

కరీంనగర్: టీఎస్‌పీఎస్సీని వెంటనే ప్రక్షాళన చేసి, నియామకాలు పారదర్శకంగా చేపట్టాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు కోరా ను కోరారు. ఈ మేరకు ఆయన సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖ వివరాలను ఆదివారం వెల్లడించారు. రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో పెండింగ్‌లో ఉన్న 11 వేల ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. సన్న, చిన్న కారు రైతుల వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకంతో అనుసంధానం చేయాలని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

‘ఉపాధి’ లేదు.. సమస్యలు తీరవు..!

- విలీన గ్రామాల్లో పనుల్లేక కూలీల తిప్పలు
- ఎండలు మండుతున్నా కానరాని సౌకర్యాలు
- ఈసారి వేసవి భత్యంపై నీలినీడలు..

జిల్లాలో..	
గ్రామాలు	313
కూలీ కుటుంబాలు	1,55,738
కూలీలు	3,28,917
మహిళా కూలీలు	1,66,943
మగ కూలీలు	1,61,974
శ్రమశక్తి బృందాలు	9,936
దివ్యాంగులు	5,651



ఉపాధి పనిలో కూలీలు

కరీంనగర్ అర్బన్: కూలీలకు చక్కని ఉపాధి వేదిక ఉపాధి హామీ పథకం. ఏ కాలంలోనైనా పనులు కల్పించడం దీని ప్రత్యేకత. కాగా కొద్ది రోజులుగా ఉపాధి పనుల లేమి, అందని వేసవి భత్యం, పని ప్రదేశాల్లో అసౌకర్యాలు వంటి సమస్యలు నీడలా వెంటాడుతున్నాయి. విలీన గ్రామాల్లో ఉపాధి పథకం అమలు కాక పనులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. మునిసిపాలిటీల్లో కలిసి తమ గ్రామం హోదా పెరిగిందని సంతోషించాలో.. పనుల్లేక పస్తులుండటంపై రోదించాలో తెలియని అయోమయ పరిస్థితి విలీన గ్రామాల కూలీలది.

విలీన గ్రామాల్లో పనులేవీ..?

జిల్లాల పునర్విభజన, మునిసిపాలిటీల అప్‌గ్రేడేషన్‌తో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. జిల్లాలో చాలా గ్రామాలు మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లో చేరాయి. కరీంనగర్ కార్పొరేషన్‌లో 18గ్రామాలకు పైగా విలీనం చేశారు. అలాగే హుజూరాబాద్, జమ్మికుంట, కొత్తపల్లి, చొప్పదండి మునిసిపాలిటీల్లో 20కిపైగా గ్రామాలను కలిపారు. ప్రస్తుతం సదరు గ్రామాలు ఉపాధి పథకానికి దూరమైనాయి. ఆయా గ్రామాల్లో సుమారు 7వేల మందికి పైగా ఉపాధి కూలీలుండగా పనులు లేక ఇతర ప్రాంతాల్లో ఉపాధి వెతుక్కుంటున్నారు. విలీన గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని ప్రజాప్రతినిధులు వినతులు సమర్పిస్తున్నా ఆచరణలో అమలుకావడం లేదు.

వేసవి భత్యం ఉన్నట్టా.. లేనట్టా..?

ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఈజీఎస్ పనులు జోరుగా సాగుతుంటాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో వేసవి భత్యం అమలు చేసేవారు. ఫిబ్రవరిలో 20శాతం, మార్చి, ఏప్రిల్‌లో 25, మేలో 30, జూన్‌లో 25 అందించేవారు. అయితే ఈసారి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొత్తగా తీసుకొచ్చిన ఎస్ఐపీ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఎలాంటి ఆప్షన్ లేదు. దీంతో ఈ సారి అమలవుతుందా ..? లేదా..?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఉపాధి కూలీ రోజువారీ వేతనం ఒక్కో కూలీకి రూ.257 చెల్లిస్తుండగా అదీ నిబంధనల మేరకు పనులు జరిగితేనే అందనుంది. అలాగే పని ప్రదేశాల్లో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. కూలీలకు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నీడ ఉండేలా టెంట్లు, వైద్య సేవలు వంటివి ఎక్కడా కానరావడం లేదు.

నిరుద్యోగ భృతి అమలయ్యేనా..?

పని కోసం దరఖాస్తు చేసుకున్న కూలీలకు 15 రోజుల్లో ఉపాధి కల్పించకుంటే నిరుద్యోగ భృతి చెల్లించాలనేది నిబంధన. మస్టర్ పూర్తయిన వెంటనే 5 రోజుల్లో చెల్లింపులు చేయాల్సి ఉండగా సదరు విధానం అమలవడం లేదని కూలీలు చెబుతున్నారు. ఒకవేళ నమోదు చేయకుంటే ఆలస్య రుసుమును విధించాలి. మరీ ఈ వేసవిలోనైనా నిరుద్యోగ భృతి లభిస్తుందా..? కాగా ఉపాధి హామీ చట్టం ప్రకారం పట్టణ ప్రాంతాలకు వర్తించదని, దానిపై ఇప్పటి వరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏదైనా ప్రత్యేక నిధులు కేటాయిస్తే పనులు చేపట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉపాధి పనులు జరిగే చోట సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

కేరళ ఆదర్శం

కేరళలో 2010 నుంచి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని చేపట్టి పేదలకు ఏటా 100 రోజుల పని కల్పిస్తున్నారు. ఈ విధంగా అందుబాటులోకి వచ్చే ఉపాధి అవకాశాల్లో 50 శాతం మహిళలకు కేటాయించారు. తోట పనులతో పర్యావరణ సంరక్షణకు ఈ పథకం తోడ్పడుతోంది. రోడ్ల పక్కన గడ్డి, కలుపు మొక్కలు తొలగించడం, వరదనీటి కాల్వలను శుభ్రం చేయడం, ప్లాస్టిక్ చెత్త ఏరివేయడం వంటి పనులను చేపడుతున్నారు.

గిట్లయితే ఎట్లా..?



ప్రతీ సంవత్సరం ఉపాధి కూలీ పనిచే వారికి అదనపు భత్యం ఇచ్చేవారు. ఈ సారి ఆ ఊసే లేదు. ఇదెక్కడి అన్యాయమని అధికారులను అడిగితే పైనుంచి ఆదేశాలు రాలేదంటుండ్రు. గిట్లయితే ఎట్లా బతికేది.
– రాజయ్య, ఉపాధి కూలీ, రామడుగు

వసతులు కల్పించాలి



ఉపాధి పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు పర్యవేక్షణకు వచ్చినపుడు వారికి చెప్పినా చర్యలు లేవు. వెంటనే వసతులు కల్పించాలి. లేకుంటే వడదెబ్బను తట్టుకోలేం.
– మాధవి, ఉపాధి కూలీ, ఇల్లందకుంట

క్లుప్తంగా

యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు


యువతిని కాపాడిన పోలీసులు

మల్యాల (చొప్పదండి): ఆత్మహత్యా యత్నానికి యత్నించిన ఓ యువతి ప్రాణాలను మల్యాల పోలీసులు కాపాడారు. ఎస్సై మంద చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సిరిగిరి కవిత ఫరీన్ (22) బోళ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. ఆదివారం బోళ్లు అమ్మేందుకు మల్యాలకు వచ్చింది. తనకు వివాహం కావడం లేదని, జీవితంపై విరక్తిచెంది నూకపల్లి శివారులోని రైల్వేట్రాక్ వద్దకు వెళ్లి రైలుకింద పడి చనిపోతునాన్నంటూ తన అన్నకు ఫోన్ చేసింది. దీంతో కవిత అన్న వెంటనే డయల్ 100కు ఫోన్ చేశారు. స్పందించిన మల్యాల బ్లూకోల్ట్ సిబ్బంది సీడీఆర్ కానిస్టేబుళ్ల దృష్టికి తీసుకెళ్లగా ఆమె లోకేషన్‌ను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. తల్లిదండ్రుల సమక్షంలో ఎస్సై చిరంజీవి కౌన్సెలింగ్ నిర్వహించారు. సకాలంలో స్పందించి, యువతి ప్రాణం కాపాడిన కానిస్టేబుళ్లను ఎస్సై, సీఐ రమణమూర్తిని, డీఎస్పీ ప్రకాశ్ అభినందించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న నాగయ్య

జ్యోతినగర్: పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వి.నాగయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్‌లోని ప్రభుత్వ స్థలాలను పేదలకు కేటాయించాలని జరుగుతున్న భూ పోరాట కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్లస్థలాల కోసం పోరాటం కొనసాగిస్తున్నామన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పేదలు గుడిసెలు వేసుకుంటే రెవెన్యూ, పోలీసులు వచ్చి తొలగిస్తున్నారని, ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలన్నారు. కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రామాచారి, కుమారస్వామి, మహేశ్వరి, లావణ్య, గీట్ల లక్ష్మారెడ్డి, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

నూతన పీఆర్సీ కమిటీని నియమించాలి


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

కరీంనగర్ : పీఆర్సీ కాలపరిమితి ముగుస్తున్నందున బకాయిలు వెంటనే విడుదల చేసి నూతన పీఆర్సీ కమిటీని నియమించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా రవీంద్ర చారి, పిన్నింటి తిరుపతిరావు కోరారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో సంఘం జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కోట్లాది రూపాయలకు సంబంధించి పెండింగ్ బిల్లులు ఈకుబేర్‌లో పేరుకుపోయాయని, సంబంధిత ఖాతాలకు జమచేయాలన్నారు. వేసవి సెలవుల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పండిత్ పీఈటీల అప్‌గ్రేడేషన్ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు బాలాజీ, పీఆర్ శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, సంతోష్‌కుమార్, పవన్‌కుమార్, వెంకటస్వామి, సుభాష్, సంజీవచారి, నరేశ్, రాజు, శ్రీనివాస్, సతీశ్, సమ్మయ్య, శ్యామ్ కుమార్, రామక్రిష్ణ, రమేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'కార్యదర్శుల' గోడుపట్టేనా..?

- నాలుగేళ్లవుతున్న క్రమబద్ధీకరణకు నోచని జూనియర్లు

ఉమ్మడి జిల్లాలో ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల(ఓపీఎస్) వివరాలు

కరీంనగర్	15
జగిత్యాల	28
పెద్దపల్లి	28
రాజన్నసిరిసిల్ల	29
మొత్తం	100


పోచంపల్లి గ్రామపంచాయతీ

కరీంనగర్:రెగ్యులరైజ్ అవుతుందన్న ఆశతో ప్రభుత్వం చెబుతున్న పనులన్నీ చేస్తున్నాం. గ్రామాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించి అవార్డులు, రివార్డులు తెస్తున్నాం. కానీ.. మా జీవితాలకు మాత్రం భద్రత లేకుండా పోయింది. ఈనెల 10నాటికి ఉద్యోగంలో చేరి నాలుగేళ్లవుతుంది. అయినా రెగ్యులరైజ్ కావడం లేదు.. ఇది జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ఆవేదన.

పల్లెల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శుల గోడును ప్రభుత్వం పట్టడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక పంచాయతీ కార్యదర్శుల పోస్టుల్లో చేరిన తమపై నిర్లక్ష్యాన్ని వీడాలని కోరుతున్నారు. ఏ శాఖలో లేని విధంగా పంచాయతీ సెక్రటరీలను మూడు ముక్కలుగా విభజించి కొందరిని సీనియర్ కార్యదర్శులు(గ్రేడ్-1)అని , మరికొందరిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులని, మరికొందరిని ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులని నామకరణం చేసిన ప్రభుత్వం ఒకే గొడుగు కింద పనిచేస్తున్న కార్యదర్శులను మూడు రకాలుగా విభజించి చూడటం ప్రభుత్వానికే చెల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓపీఎస్ కార్యదర్శుల ఆగచాట్లు..

ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు నాలుగు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటివరకు అప్పు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చామని, బండెడు చాకిరీ చేయించుకుని, రెగ్యులర్ కార్యదర్శులతో సమానంగా పనిచేయిస్తారని, ప్రతినెలా వేతనాలు మాత్రం చెల్లించడం లేదని పేర్కొంటున్నారు. ఓపీఎస్ పంచాయతీ కార్యదర్శులు ఉమ్మడి జిల్లాలో 100 మంది పనిచేస్తున్నారు. వీరికి చెల్లించేది రూ.15వేల వేతనం. ఇది వారి ప్రయణాలకు, ఇతరత్రా ఖర్చులకు సరిపోవడం లేదు. డిసెంబరు నెల నుంచి నాలుగు నెలలుగా ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులకు, రెండు నెలల వేతనాలు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు చెల్లించాల్సి ఉందని చెబుతున్నారు. ఏడాదిగా ఇదే తంతు కొనసాగుతోందని, ఆలస్యమే తప్ప నెలనెలా వేతనాలు అందిన దాఖలాల్లేవని వాపోతున్నారు. పంచాయతీ కార్యదర్శుల వేతనాలు ఎప్పుడు విడుదలవుతాయో.. తెలియని పరిస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా స్పందించి ఓపీఎస్, జీపీఎస్‌ల వేతనాలను సకాలంలో విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

కనీస వేతనం అమలేదీ?

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రూ.28,719 వేతనం ఇస్తూ... ఔట్‌సోర్సింగ్‌కార్యదర్శులకు నెలకు రూ.15వేలు ఏజెన్సీల ద్వారా అందజేస్తున్నారని, అవి కూడా ఎప్పుడు వస్తాయో తెలియదని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న ఫలితం లేదంటున్నారు. ఒకే రిక్రూట్‌మెంట్ విధానం ద్వారా ఎంపికైన తమను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పరిగణించాలని ఓపీఎస్ కార్యదర్శులు డిమాండ్ చేస్తున్నారు.

రాజీనామా బాటలో కార్యదర్శులు

2018లో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ పీఆర్‌ఐ కింద జీపీఎస్ పోస్టులకు రిక్రూట్‌మెంట్ నిర్వహించి జిల్లాస్థాయిలో మెరిట్ పొందిన వారిని జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా 2019 ఏప్రిల్‌లో నియామకాలు చేపట్టింది. చాలా ఏళ్లుగా ఉద్యోగాల భర్తీ లేకపోవడంతో డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఎంటెక్, ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన వారూ ఈ ఉద్యోగాల్లో చేరారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో 100 మంది జీపీఎస్‌లు ఉద్యోగాలకు రాజీనామా చేశారు. కరీంనగర్‌లో 15, జగిత్యాలలో 28, పెద్దపల్లిలో 28, రాజన్నసిరిసిల్లలో 29 స్థానాల్లో మెరిట్ అభ్యర్థులను పంచాయతీ కార్యదర్శులుగా నియమించారు. వీరికి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వేతనాలు చెల్లించడంతో మూడు, నాలుగు నెలలకోసారి వేతనాలు విడుదలవుతున్నాయి. దీంతో వేతనాలు లేక జీపీఎస్, ఓపీఎస్ కార్యదర్శుల్లో తీవ్ర అసంతృప్తి ఆవేదన వ్యక్తమవుతోంది.

కొరవడిన భద్రత..

పంచాయతీ కార్యదర్శులు ప్రమాదాల బారినపడి మరణిస్తే ప్రభుత్వం అందించే ప్రయోజనాలు అందకుండా పోతున్నాయి. ఉద్యోగంలో చేరినప్పుడు ప్రొబేషన్ పీరియడ్ మూడేళ్లని చెప్పిన ప్రభుత్వం ఆ తరువాత మరో ఏడాది పొడగించింది. దీంతో ఈనెల 10వ తేదీతో సర్వీసు పూర్తయిన కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాల్సి ఉంది. కొందరు ప్రమాదాల బారిన పడి, మరికొందరు పని ఒత్తిడి తట్టుకోలేక, ఇతరత్రా కారణాలతో మరణిస్తే ఎలాంటి ప్రయోజనం అందక పోవడంతో ఆ కుటుంబాలు దిక్కులేని వారిగా మిగిలిపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఔట్‌సోరిసింగ్ విధానాన్ని ఎత్తివేసి తమను కూడా జూనియర్ కార్యదర్శులుగా పరిగణించి ప్రభుత్వం కల్పించే ప్రయోజనాలను అందించి ఉద్యోగభద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సర్వాయి పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి

- జీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్


సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, తదితరులు

కరీంనగర్ : తెలంగాణ వీరత్వానికి ప్రతీక సర్వాయి పాపన్న అని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. ఆదివారం సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాపన్న గౌడ్ పోరాట పటిమను ఆదర్శంగా తీసుకొని రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకుసాగాలన్నారు. ప్రభుత్వం పాపన్న జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా మానేరు వంతెనపై భారీ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం సర్వాయి పాపన్న కాంస్య విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. నగర మేయర్ వై.సునీల్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ కనమల్ల విజయ, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ గౌడ్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ ఎమ్మెల్యే కోడూరు సత్యనారాయణ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం నాయకులు గణగాని సత్యనారాయణ గౌడ్ (కలర్ సతన్న), సింగం సత్తయ్య గౌడ్, కట్ట సత్తయ్య గౌడ్, గౌడ శంఖారావం పత్రిక ఎడిటర్ శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్లు కోటగిరి భూమగౌడ్, గుగ్గిళ్ల జయశ్రీ -శ్రీనివాస్, ఐలందర్ యాదవ్, ముత్యం శంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్(మానకొండూర్): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ తిమ్మాపూర్‌లో 2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ డి.సంపత్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా (పెద్దపల్లి, సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్)లోని ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వీరు అర్హులు

ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకొనుటకు గ్రామీణ ప్రాంత యువతీ యువకులు అర్హులు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 ఏళ్లలోపు ఉండాలి. 10వ తరగతి ఆపై విద్యార్హత, ఎన్నుకున్న రంగంలో కనీస పరిజ్ఞానం ఉండాలి.

దరఖాస్తుకు ఇవి జతచేయాలి..

దరఖాస్తుకు తెల్ల రేషన్ కార్డు/ఆహార భద్రతా కార్డు, టెన్త్ మెమో జిరాక్స్, ఆధార్‌కార్డ్, ఐదు పాస్ పోర్టు సైజు ఫొటోలు జతచేయాలి. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన చిరునామా ఎస్బీఐ ఆర్ ఎస్ఈటీఐ, తిమ్మాపూర్.

కోర్సుల వివరాలు..

కోర్సు	శిక్షణ కాలం	ప్రారంభించే తేదీ
ఉమెన్స్ టైలరింగ్(స్త్రీలు)	30 రోజులు	ఏప్రిల్ 10
బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్(స్త్రీలు)	30 రోజులు	ఏప్రిల్ 17
జ్యూట్ ప్రొడక్ట్స్(స్త్రీలు)	13 రోజులు	ఏప్రిల్ 15
ఎంబ్రాయిడరీ వర్క్స్ (స్త్రీలు)	30 రోజులు	ఏప్రిల్ 15
టూవీలర్ మెకానిక్(పురుషులు)	30 రోజులు	ఏప్రిల్ 19
ఫొటోగ్రఫీ- వీడియోగ్రఫీ(పురుషులు)	30 రోజులు	ఏప్రిల్ 19

ముగిసిన ఆర్ఎస్ఎస్‌డీఐ 8వ రాష్ట్ర స్థాయి సదస్సు



రాష్ట్రస్థాయి ముగింపు సమావేశంలో వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని వీ కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన 8వ రాష్ట్ర స్థాయి చాప్టర్ ఆఫ్ రీసెర్చ్ సొసైటీ ఫర్ స్టడీ ఆఫ్ డయాబెట్స్ ఇన్ ఇండియా (ఆర్ఎస్ఎస్‌డీఐ) కాన్ఫరెన్స్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా వైద్యులు పలు అంశాలపై చర్చించారు. డయాబెటిస్ (షుగర్ వ్యాధి) అనేది వ్యాధి కాదు కాని వ్యాధులకు తల్లిలాంటిదని చెప్పారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులు, స్వచ్ఛంద సంస్థలకు ఉందన్నారు. డయాబెటిస్ అవగాహన కార్యక్రమాలకు ఐఎంఏ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్‌డీఐ చైర్మన్ శంకర్, ఎలెక్ట్ చైర్మన్ లిల్లి రోస్ట్రక్స్, కాన్ఫరెన్స్ ప్రతినిధులు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ డీసీ తిరుపతిరావు, కో ఆర్గనైజింగ్ చైర్మన్ రఘురామన్, సెక్రటరీ విజయమోహన్‌రెడ్డి, ట్రెజరర్ చైతన్యరెడ్డి, శేషశైలజ, సురేష్, వెంకట్‌రెడ్డి, లక్ష్మణ్ వడ్డెబోయిన, శ్రీధర్ చాట్ల, నవీనా, పద్మ, సంగీత, ఐఎంఏ కరీంనగర్ అధ్యక్షుడు రాంకిరణ్ పొలాస తదితరులు పాల్గొన్నారు.

కాపర్ వైర్ చోరీ


పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

కోరుట్ల రూరల్ : మండలంలోని అయిలాపూర్ గ్రామశివారులో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. ఈ మేరకు ఆదివారం విద్యుత్ రూరల్ ఏఈ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ 18 లైన్ కాలనీ సంతోష్‌నగర్‌కు చెందిన కనపర్తి అశ్విత్ (9వ తరగతి) ఆదివారం అగ్ని ప్రమాదానికి గురయ్యాడు. సెలవుదినం కావడంతో ఇంటి ఆవరణలో రంగులు కలిపి స్నానాల గది వైపు తీసుకెళ్తుండగా అగ్ని ప్రమాదం సంభవించి అశ్విత్‌కు గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తరలించినట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి..


కరీంనగర్- వరంగల్ రహదారిపై ఢీకొన్న కార్లు

శంకరపట్నం (మానకొండూర్): శంకరపట్నం మండలం తాడికల్ వద్ద ఆదివారం రాత్రి మూడు కార్లు ఒకదానికొకటి ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొలంగూర్‌లో ఇఫ్తార్ విందులో పాల్గొన్న రహమాన్‌తో పాటు కొందరు ముస్లింలు కారులో కరీంనగర్‌కు బయలుదేరారు. కరీంనగర్ నుంచి జమ్మికుంటకు కారులో వెళ్తున్న దిడ్డి చరణ్ రహమన్, మేడారం నుంచి కరీంనగర్ వస్తున్న ఏఎస్సై పోచయ్య కార్లను ఢీకొట్టాడు. ఈ ఘటనలో రహమన్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలుకాగా కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను రోడ్డుపై నుంచి యంత్రాలతో తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తక్కళ్లపెల్లిలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎండీ సాజిద్ మూడురోజుల క్రితం కుటుంబసభ్యులతో కలిసి నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు వెళ్లారు. శనివారం రాత్రి దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరోలకు సంబంధించిన సుమారు 50 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో సాజిద్ ఫిర్యాదు చేయగా దొంగతనం జరిగిన తీరును ఎస్సై శ్వేత పరిశీలించి వివరాలు సేకరించారు.

కానిస్టేబుల్‌పై దాడి

సుల్తానాబాద్ రూరల్: సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌లో (సర్కిల్ కార్యాలయంలో) విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ స్థానికంగా ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మహిళ కుటుంబీకులు శనివారం అర్ధరాత్రి కానిస్టేబుల్‌పై దాడిచేశారు. గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఉపేందర్ రావు తెలిపారు.

ఆర్జీ-1 ఏరియాను సందర్శించిన డైరెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్-1 ఏరియాలో డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే శ్రీనివాస్ ఆదివారం పర్యటించారు. జీడీకే-5 ఓసీపీని సందర్శించి ఓబీ తరలింపుకు సంబంధించిన మ్యాప్‌లను పరిశీలించారు. రక్షణ చర్యలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తి చేయాలని సూచించారు. గోదావరినది తీరంలో గల ఇన్‌టెక్‌వెల్‌ను సందర్శించి అక్కడ నుంచి జీడీకే-5 ఓసీపీ వరకు నీటిసరఫరా కోసం వేస్తున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. వేసవి దృష్ట్యా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డైరెక్టర్ వెంట ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, క్వాలిటీ జీఎం హబీబ్ హుస్సేన్, క్వాలిటీ జీఎం కేవీరావు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, వెంకటేశ్వర్ రావు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

- బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు శాంతాల బట్


సమావేశంలో మాట్లాడుతున్న శాంతాల బట్

కరీంనగర్ టౌన్: మహిళల అభ్యున్నతి కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు శాంతాల బట్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్నిజిల్లాల్లో కేంద్ర ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన మహిళల వివరాలు, ప్రభుత్వం చేస్తున్న పనులను వివరించేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల కోసం రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం ఇన్నేళ్లలో చేసిందేమీ లేదని, కేవలం ఓటు బ్యాంకుగానే బీఆర్ఎస్ భావిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకున్న పటిష్ట విధానాలు, పథకాలు వివరించేందుకు మహిళా మోర్చా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వరాల జ్యోతి, జిల్లా మహిళా మోర్చా వైస్ ప్రెసిడెంట్ మామిడాల చైతన్య, జిల్లా మహిళా మోర్చా సెక్రెటరీ ప్రేమ లత, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ తమ్మిడి మాలతి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంజేపీ కన్వీనర్ మధుసూదన్


కన్వీనర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాళ్లు

తిమ్మాపూర్: ఇంటర్ తర్వాత ఉన్నత చదువులకు కళాశాలలోనే సమ్మర్ ఫ్రీ కోచింగ్ క్యాంపు నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కన్వీనర్ మధుసూదన్ తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో విద్యార్థులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా మహాత్మా జ్యోతిబాపూలే కళాశాలల్లో చదివిన విద్యార్థినులకు ఎంసెట్, నీట్ పరీక్షల్లో విజయం సాధించేందుకు సమ్మర్ ఫ్రీ క్యాంపును నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఎంసెట్ నీట్ పరీక్షలకు హాజరయ్యేందుకు ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారని, గురుకులాల సెక్రటరీ మల్లు బట్టయ్య ఆదేశానుసారం తొలిసారి సమ్మర్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. శిక్షణ పొందే విద్యార్థులకు హాస్టల్ వసతితోపాటు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు కన్వీనర్‌ను సన్మానించారు. ప్రిన్సిపాల్ రాజేశం, రాఘవరెడ్డి, ఆర్ట్ టీచర్ సంగీత అధ్యాపకులు వనజ, పద్మజ, ప్రత్యూష, చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి చదరంగ పోటీలు


బహుమతులతో క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్ : తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్, భగవతి పాఠశాల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో జరిగిన జిల్లాస్థాయి అండర్ 17 చదరంగ పోటీలు ముగిశాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా పలుప్రాంతాల నుంచి సుమారు 42 మంది క్రీడాకారులు హాజరయ్యారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపికచేశారు. అంతకుముందు ఈ పోటీలను మేయర్ సునీల్ రావు క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. మనోవికాసానికి చెస్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను చంద్రప్రకాశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భగవతి పాఠశాలల అధినేత బి.రమణ రావు, తెలంగాణ చదరంగ సమాఖ్య ప్రతినిధి, చీఫ్ ఆర్బిటర్ చెరుకు ప్రద్యుమ్న కుమార్, ఆర్బిటర్ కే. శ్రేయ, శివయ్య, అంతగిరి రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగ దందాలో ఇరువర్గాల దాడి

గోదావరిఖని:ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగ బాగోతంలో ఇరువర్గాలు దాడి చేసుకున్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్‌లో నలుగురికి ఉద్యోగం పెట్టిస్తామని వసూలు చేసిన మొత్తాన్ని వెంటనే చెల్లించాలని స్థానిక కార్పొరేటర్‌కు సంబంధించిన వ్యక్తులు కాంట్రాక్టర్‌కు మొరపెట్టుకున్నారు. కొన్నిడబ్బులు ఇచ్చినా మిగితా డబ్బుల విషయంలో జాప్యం జరుగడంతో కార్పొరేటర్ రంగంలోకి దిగాడు. సదరు కాంట్రాక్టర్‌ను నిలదీయగా మాటామాటా పెరిగి దాడివరకూ వెళ్లినట్లు తెలుస్తోంది. సంఘటనపై పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. కేసు నమోదు కాలేదని వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు తెలిపారు.

బార్‌లో మందుబాబుల హల్‌చల్

- ఒకరికి గాయాలు

జ్యోతినగర్: పారిశ్రామిక ప్రాంతంలోని ఓ బార్‌లో మద్యం సేవించిన మందుబాబులు హల్‌చల్ చేశారు. ఈ దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి రోడ్‌లోని ఓ బార్‌లో కొంతమంది మద్యం సేవించారు. బయటకు వచ్చే క్రమంలో జరిగిన చిన్న ఘర్షణలో అన్నపూర్ణకాలనీకి చెందిన రాజు అనే వ్యక్తి తలకు బీరు సీసా తగిలి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ ఏఎస్సై చక్రపాణి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భజరంగ్ దళ్ కార్యకర్తలు, హనుమాన్ భక్తులు

సిరిసిల్ల కల్చరల్: రామ భక్త హనుమాన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వీర హనుమాన్ విజయయాత్ర పేరిట భారీ శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సంస్కృతీ, సంప్రదాయాల పరిరక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. భజరంగ దళ్ కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, హనుమాన్ దీక్షాపరులు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పరిషత్ అధ్యక్షుడు చేపూరి అశోక్, బీజేపీ సీనియర్ నేత లగిశెట్టి శ్రీనివాస్, భజరంగ దళ్ కార్యకర్తలు లింగమూర్తి, బండారి సంతోష్, రాయిని హరికృష్ణ నెల్లుట్ల రాహుల్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్షలు బాగా రాయండి



విద్యార్థులతో మేయర్ సునీల్‌రావు

సప్తగిరికాలనీ: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి జరగనున్న నేపథ్యంలో విద్యార్థులకు మేయర్ యాదగిరి సునీల్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని భగవతి పాఠశాల పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలు బాగా రాసి, 10 జీపీఏ గ్రేడ్ మార్కులతో రాష్ట్రంలోనే కరీంనగర్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, తల్లిదండ్రులు, చదివిని పాఠశాలకు పేరు తీసుకు రావాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 10 జీపీఏ సాధిస్తే వారిని నగరపాలక సంస్థ ద్వారా సత్కరించి, పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలి



కరాటే బెల్టు ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్ స్పోర్ట్స్: ఆత్మరక్షణకు, ఆత్మస్థైర్యానికి కరాటే క్రీడ దోహదపడుతుందని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని సిద్ధార్థ పాఠశాలలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలకు సంబంధించి బెల్టుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల కరాటే ప్రదర్శనలను తిలకించి, అభినందించారు. ప్రతిభ ఆధారంగా బెల్టులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఎగ్జామినర్ కె.వసంత్‌కుమార్, సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, ఇన్‌స్ట్రక్టర్ పుల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



ఖర్జూర మట్టలతో ర్యాలీగా వెళ్తున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్: ఏసుక్రీస్తు యెరూషలేము ప్రవేశానికి ముందు జయోత్సవంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మట్టల ఆదివారాన్ని నగరంలోని సీఎస్ఐ కెథడ్రల్ చర్చిలో ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, మహిళలు గీతాలు ఆలపిస్తూ ఖర్జూర మట్టలతో ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా పాస్టర్ శ్రీనివాసనాయక్ సందేశమిస్తూ.. సాత్విక మనసున్న ప్రతీ వ్యక్తి దైవాన్ని దర్శిస్తాడన్నారు. మంచి మనసుతో పరోపకార బుద్ధి కలిగి సత్యం, శాంతిమయమైన జీవనం సాగించాలన్నాని, ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనించాలని సూచించారు. కార్యక్రమంలో జెకబ్, దేవదాస్, విల్సన్, మధుమోహన్, పాస్టరేట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్న బీఆర్ఎస్'

కరీంనగర్: తొమ్మిదేళ్లుగా బీఆర్ఎస్ నాయకులు బీజేపీని బూచిగా చూపి, ముస్లింలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని సామాజిక కార్యకర్త మహమ్మద్ అమీర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఇమామ్, మౌజంలకు ఇచ్చే గౌరవ వేతనం నామమాత్రంగా రెండు నెలలు ఇచ్చి, చేతులు దులుపుకున్నారని అన్నారు. నాలుగు నెలలుగా వేతనం ఇవ్వకపోవడం చూస్తుంటే వారికి ముస్లింల మీద ఎలాంటి గౌరవం ఉందో తెలుస్తోందని ఎద్దేవా చేశారు. ముస్లింలకు ప్రకటించిన 12 శాతం రిజర్వేషన్ ఏమైందని, షాదీఖానా ఇంకా ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు భూములు అన్యాక్రాంతం అవుతుంటే ఒక్క గజాన్ని కూడా కాపాడలేదన్నారు. ఇప్పటివరకు మైనారిటీలకు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం ఎంత.. ఎన్ని సబ్సిడీ రుణాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.

కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇల్లందకుంట(హుజూరాబాద్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లిసంపత్‌రావు అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పార్టీ శక్తి కేంద్రం ఇన్‌చార్జీ సమావేశం మండల అధ్యక్షుడు సింగిరెడ్డితిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సంపత్‌రావు హాజరై మాట్లాడారు. పార్టీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను ప్రజల వద్దకు తీసుకెళ్లాలన్నారు. ఇల్లందకుంట మండల సంస్థాగత ఇన్‌చార్జి బింగి కర్ణాకర్, మండల ప్రధాన కార్యదర్శులు బైరెడ్డి రమణారెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల రవీందర్‌రెడ్డి, మడ్డి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు తడిగొప్పుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పార్థివ వాహనాన్ని తీస్తలేరు



ఆసుపత్రిలోని పార్థివ వాహనం



ప్రైవేటు అంబులెన్స్‌లో మృతదేహం తరలింపు

- జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సిబ్బంది కమీషన్ల కక్కుర్తి
- ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులతో కుమ్మక్కు
- మృతదేహాల తరలింపునకు రూ.వేలల్లో వసూలు

> 'కరీంనగర్ నగరానికి చెందిన 45 ఏళ్ల ఓ వ్యక్తి అనారోగ్యంతో జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గత గురువారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని ఉచితంగా ఇంటికి పంపేందుకు ఏర్పాట్లు చేయాల్సిన సిబ్బంది కమీషన్లకు కక్కుర్తి పడి, పార్థివ వాహనం రిపేరులో ఉందని మృతుడి కుటుంబసభ్యులకు చెప్పారు. రూ.5,500కు ప్రైవేటు అంబులెన్స్‌లో పంపించారు. ఇలా ప్రైవేటు అంబులెన్స్‌ల యాజమాన్యాలతో కుమ్మక్కై, నిరుపేదలను నిత్యం దోపిడీ చేస్తూనే ఉన్నారు.'

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది తీరు మారడం లేదు. దవాఖానాకు వైద్యం కోసం వచ్చే నిరుపేదలను ఏదో రకంగా దోపిడీ చేస్తూనే ఉన్నారు. ఈ విషయపై స్వయంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, జిల్లా మంత్రి గంగుల కమలాకర్‌లు ఎన్నిసార్లు మందలించినా వారిలో మార్పు లేదు. ఆసుపత్రిలో ఎవరైనా చనిపోతే మృతదేహాలను తరలించేందుకు అందుబాటులో పార్థివ వాహనం ఉన్నప్పటికీ లేదని మృతుల బంధువులకు చెబుతున్నారు. ఉంటే డ్రైవర్ లేడంటూ కమీషన్ల కోసం ప్రైవేటు అంబులెన్స్‌లలో మృతదేహాలను తరలిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు అంబులెన్స్‌ల యాజమాన్యాలు నిరుపేదలను నిలువు దోపిడీ చేస్తూ ఆసుపత్రి సిబ్బందికి కమీషన్లు ముట్టజెబుతున్నాయి.

పొద్దంతా దవాఖానాలోనే అడ్డా..

ఆసుపత్రి చుట్టూ అంబులెన్స్‌లను పార్కింగ్ చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు పొద్దంతా దవాఖానాలోనే అడ్డా వేస్తున్నారు. సీరియస్‌గా ఉన్న పేషెంట్లు, మృతదేహాలే వీరి టార్గెట్. అత్యవసర పరిస్థితుల్లో ఇక్కడ వైద్యం అందదని, వైద్యులు లేరని భయభ్రాంతులకు గురిచేస్తూ బాధితులను ప్రైవేటు ఆసుపత్రులకు తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలా ప్రైవేటు దవాఖానాల నుంచి 30 నుంచి 50 శాతం వరకు కమీషన్ పొందుతున్నారు.

మృతుల కుటుంబసభ్యులతో గొడవలు

ఎవరైనా చనిపోతే చాలు మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ప్రభుత్వ పార్థివ వాహనం ఉన్నప్పటికీ అది పాడైందని, డ్రైవర్ లేడని సిబ్బందితో చెప్పించి, మృతుల కుటుంబసభ్యుల వద్ద అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వారు అడ్డు చెబితే గొడవలకు కూడా దిగుతున్నారు. బలవంతంగా ప్రైవేటు అంబులెన్స్‌లలో తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక విధంగా చెప్పాలంటే రౌడీల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని అక్కడ ఉండే ఇతర సిబ్బందే చెబుతున్నారు. వీరి ధనదాహంతో నిరుపేదలు ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులను ఆసుపత్రిలోకి రాకుండా చూడాలని రోగుల బంధువులు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రత్నమాలను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

'పది'లో విజయం సాధిస్తాం

- స్టడీ అవర్స్‌లో ఎక్కువ చదివామంటున్న విద్యార్థులు
- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

విద్యానగర్: కరోనా అన్ని రంగాలతోపాటు విద్యావ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపింది. గత రెండు విద్యాసంవత్సరాల్లో ప్రభుత్వం వార్షిక పరీక్షలు నిర్వహించలేదు. విద్యలో ప్రతిభ ఉన్న విద్యార్థులు సైతం కరోనా బ్యాచ్‌గా మిగిలిపోయారు. కాగా ఈ విద్యాసంవత్సరం పూర్తిస్థాయిలో పాఠ్యాంశాల బోధనకు చర్యలు తీసుకున్న సర్కారు సిలబస్ తగ్గించింది. గతంలో ఒక్కో సబ్జెక్టులో రెండు పరీక్షలు నిర్వహించగా ఈ ఏడాది నుంచి ప్రతీ సబ్జెక్టులో ఒక పరీక్షనే నిర్వహిస్తోంది. సోమవారం నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా పరీక్షల్లో విజయం సాధిస్తామంటున్న పలువురు విద్యార్థులు తమ మనోభావాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

స్టడీ అవర్స్‌తో పట్టు



స్కూల్‌లో ప్రతీరోజు నిర్వహించిన స్టడీ అవర్స్‌లో ఎక్కువ చదువుకోగలిగాం. పాఠశాల సమయం తర్వాత రెండు గంటలపాటు ఒక సబ్జెక్టులోని పాఠాల్ని టీచర్లు తిరిగి చెప్పారు. దీంతో సిలబస్‌పై పట్టు సాధ్యమైంది. పరీక్షల్లో మంచి జీపీఏ సాధిస్తా.

– నేదునూరి అక్షయ, గురుకుల పాఠశాల, గుండ్లపల్లి

టీచర్లు శ్రద్ధ చూపారు..



స్కూల్‌లో టీచర్లు మాపై చాలా శ్రద్ధ చూపారు. నిత్యం ప్రత్యేక క్లాసులు తీసుకున్నారు. చాప్టర్ పూర్తికాగానే దానిపై పరీక్షలు నిర్వహించారు. వీక్‌గా ఉన్నవారికి మళ్లీ మళ్లీ క్లాసులు తీసుకున్నారు. దీంతో బాగా చదువుకున్నాం. నేను 10 జీపీఏ సాధిస్తా.

– గుంటుక చందన, మోడల్ స్కూల్, ఎలగందుల

మంచి జీపీఏ సాధిస్తా..



ప్రతీరోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించడం వల్ల ఎక్కువగా చదువుకోగలిగాం. వీక్లీ టెస్ట్‌లు పెట్టారు. ఎక్కువ సమయం చదువుకు కేటాయించేలా టీచర్లు చూశారు. ఫైనల్ పరీక్షల్లో మంచి జీపీఏ సాధిస్తానన్న నమ్మకం ఉంది.

– ఆర్.వినయ్, గురుకుల పాఠశాల, కొత్తపల్లి

బాగా ప్రిపేర్ అయ్యాను..



రెండు నెలలు ప్రతీరోజు స్టడీ అవర్స్ జరిగాయి. ఉపాధ్యాయులు క్లాసెస్ మళ్లీ మళ్లీ చెప్పారు. ప్రభుత్వం సిలబస్ కూడా తగ్గించింది. టీచర్ల సూచనలతో పరీక్షలకు బాగా ప్రిపేర్ అయ్యాను. ఫైనల్ ఎగ్జామ్స్‌లో నేను తప్పకుండా 10 జీపీఏ సాధిస్తాను.

– వి.విష్ణువర్ధన్, అల్ఫోర్స్ స్కూల్, కరీంనగర్

పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



సర్దార్ పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కరీంనగర్: పోరాటయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. 17వ శతాబ్దంలో బడుగు బలహీన వర్గాల ప్రజల అణిచివేతకు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు సర్వాయి పాపన్న అని బీసీ సంక్షేమ సంఘం నాయకులు కొనియాడారు. ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని, ప్రస్తుత కాలంలో జరుగుతున్న దోపిడీ, అవినీతిపై రాజ్యాంగబద్ధంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు రాచమల్ల రాజు, దొగ్గలి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

పూలే బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతిని ఆదివారం పూలే బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కడారి అయిలన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అల్గునూర్ బ్రిడ్జిపై ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహమనీ సుల్తాన్‌ల దౌర్జన్యాలను ఎదిరించి, ఏడు నెలలు వీరోచిత పోరాటం చేసి బహుజన తెలంగాణ ప్రాంత ఆత్మగౌరవాన్ని కాపాడిన వీరుడు సర్దార్ పాపన్న గౌడ్ అన్నారు. నాయకులు బండి మల్లన్న, ఈ.విజయ్‌కుమార్, ఆరెల్లి గోవర్ధన్‌గిరి, కొమురయ్య, మల్లేశ్, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దుష్ప్రచారం

- బండి సంజయ్, రేవంత్‌రెడ్డి, షర్మిల ఏకమయ్యారు..
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- నగునూరులో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

కరీంనగర్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బండి సంజయ్, రేవంత్‌రెడ్డి, షర్మిల ఏకమై, సీఎం కేసీఆర్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఆదివారం కరీంనగర్ మండలంలోని నగునూరులో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ మండల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. సమైక్య పాలనలో 75 ఏళ్లలో జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారన్నారు. పచ్చని తెలంగాణను చూసి కాంగ్రెస్, బీజేపీలు అధికారం కోసం మాయమాటలతో మోసం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సీఎం కేసీఆర్ బలగమని, ఐక్యంగా ఉండి, పార్టీని మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు.

కార్యకర్తల బాధలపై చర్చ లేదని పలువురి ఆవేదన

జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, సుడా చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పొన్నం అనిల్ కుమార్‌తో సహా పలువురు నాయకులు మంత్రి గంగులను పొగడడానికి ప్రాధాన్యమిచ్చారే తప్ప పార్టీ అభివృద్ధి కోసం సలహాలు, సూచనలు ఇవ్వలేదని, కార్యకర్తల బాధలపై చర్చించలేదని పలువురు సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కార్యకర్తలకు మంత్రి స్వయంగా అన్నం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ కాశెట్టి శ్రీనివాస్, సర్పంచులు శ్రీధర్, నర్సయ్య, నివాస్, భూమయ్య, రమణారెడ్డి, నందయ్య, ఉపసర్పంచులు సంపత్ రావు, శ్రీకాంత్, శంకర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు బుర్ర తిరుపతి, వినయ్‌సాగర్, శ్రీనివాస్, సర్వర్, దుర్శేడ్ సింగిల్‌విండో చైర్మన్ గోనె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'పటేల్ తీర్పు' పోస్టర్ ఆవిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: పసుల క్రియేషన్స్ నిర్మించిన పటేల్ తీర్పు లఘు చిత్రం పోస్టర్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ఆదివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ లఘు చిత్రాన్ని దివంగత గంగుల మల్లయ్యకు అంకితం ఇస్తున్నట్లు పసుల క్రియేషన్స్ అధినేత పసుల రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, లఘుచిత్రం నటీనటులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో మురుగునీటి ఇబ్బందులు



అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం ఇస్తున్న శేఖర్

కరీంనగర్: కొత్తపల్లి మున్సిపాలిటీ పరిధిలో మురుగునీటితో రైతులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ.. మురుగునీటి సమస్యపై నెల రోజుల క్రితం కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలోని 4వ, 5వ వార్డు అంబేడ్కర్ కాలనీ నుంచి వెళ్తున్న మురుగునీరు పొలాల్లోకి చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి అవకాశం ఉన్నా మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. పన్నులు వసూలు చేస్తున్నప్పుడు సమస్యను ఎలా వదిలేస్తారని ప్రశ్నిస్తున్నారు. వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'దళితులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం'



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

కరీంనగర్‌టౌన్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం దళితులను మోసం చేస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ ఆరోపించారు. ఆదివారం రేకుర్తిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ మోర్చా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సోమిడి వేణు ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎస్సీల ఓట్లతో అధికారం చేపట్టి, దళితులకు ఇచ్చిన హామీలు మూడెకరాలు భూమి, దళిత బంధు, డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు తదితరాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. మాయమాటలు చెబుతూ మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈసారి దళితులందరూ ఏకమై కేసీఆర్‌కు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ దళితులను గౌరవిస్తున్నారని, బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ఎస్సీ మోర్చా కీలకంగా ఉండాలని కోరారు. ఈ నెల 13 నుంచి మే 5 వరకు అంబేడ్కర్ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్ రెడ్డి రాజకీయ తీర్మానం ప్రవేశపెట్టారు. సమావేశంలో నాయకులు పుల్లమల్ల ప్రసాద్, జెల్ల మల్లేశ్, ఎలుక రాజేశ్, ఎర్రోళ్ల ప్రశాంత్, వినయ్‌సాగర్, వేణుగోపాల్, బామండ్ల రాజు, బోరగల సారయ్య, జక్కుల నిఖిల్, బండారు శ్రావణ్, రంజిత్ ప్రణయ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరెకుల సంఘం నాయకుల నిరసన

హుజూరాబాద్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద ఆదివారం ఆరెకుల సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆరెకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీపై బీఆర్ఎస్ నాయకుడు లింగంపల్లి కిషన్‌రావు తనయుడు నానాజీ, కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడ్డారని అన్నారు. కిషన్‌రావు దిష్టిబొమ్మ దహనం చేశారు. నానాజీని బీఆర్ఎస్ నుంచి వెంటనే తొలగించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంగరక సంపత్ రావు, రాష్ట్ర కమిటీ నాయకులు అదర్‌సండే నాగేశ్వరరావు, భావనపల్లి శివన్న, శంకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు రామారావు, ఉపాధ్యక్షుడు మోహన్ రావు, వెంకన్న, శివాజి తదితరులు పాల్గొన్నారు.

37 ఏళ్లకు మురిసిన స్నేహం



కరీంనగర్: వాణినికేతన్ బాలవిహార్ ఎస్సెస్సీ 1985–86 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వాణినికేతన్ బాలవిహార్ కిడ్స్‌కేర్ వేదికైంది. కలిసి చదువుకొని, విడిపోయి, వివిధ రంగాల్లో స్థిరపడినవారు 37 ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను చూసి, భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని, కుటుంబ క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం అందరూ కలిసి భోజనం చేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన లక్ష్మీదీపిక ప్రస్తుతం వాణినికేతన్ విద్యాసంస్థల చైర్మన్‌గా కొనసాగుతున్నారు. విదేశాల్లో స్థిరపడి ఇటీవలే ఇక్కడికి వచ్చిన గోనె జయసుమన ఆకాంక్ష మేరకు ప్రవీణ్‌కుమార్, సుధీర్, కంకణాల శ్రీనివాస్ రెడ్డి, హరిత, సరిత కన్వీనర్లుగా వ్యవహరించి, ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేశారు.

కళాసిల్క్ ఎగ్జిబిషన్‌లో సందడి



చేనేత వస్త్రాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కరీంనగర్: జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తాలో గల శ్రీ రాజరాజేశ్వర కల్యాణ మండపంలో కళాసిల్క్ హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్ ఆదివారం వినియోగదారులతో సందడిగా మారింది. ఎగ్జిబిషన్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రఖ్యాత కళాకారులచే తయారు చేయబడిన వస్తువులు, గృహోపకరణాలు, చేనేత కళాకారులతో నేయబడిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచామని నిర్వాహకుడు సంజయ్ తెలిపారు. పలు ఆఫర్లు కూడా ఇస్తున్నామని, వివిధ రకాల చేనేత బెడ్‌షీట్లు, కవర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్ వారం రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, జిల్లా ప్రజలు కళాసిల్క్ ఎగ్జిబిషన్‌ను సందర్శించి చేనేత వస్తువులను ఆదరించాలని కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల నుంచి చెర్లభూత్కూర్ రహదారిలో మామిడితోట వద్ద ఇటీవల అధికారులు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అది ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే ఉండటంతో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– కరీంనగర్‌రూరల్


ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

'కాళేశ్వరం' పెట్టుబడి ఎప్పుడో వచ్చేసింది

- గోదావరి నీటితో పుష్కలంగా దిగుబడులు
- కేసీఆర్ అనే అద్భుత దీపంతో బంగారు పంటలు: హరీశ్‌రావు

సిద్దిపేట జోన్: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గోదావరి నీటితో పుష్కలంగా పంటలు పండుతున్నాయని, 2014లో రూ. 30.28 కోట్ల విలువైన ధాన్యం దిగుబడి రాగా గతేడాది రూ. 344.16 కోట్ల విలువైన ధాన్యం పండిందని, ఈ లెక్కన కాళేశ్వరం కోసం పెట్టిన పెట్టుబడి ఎప్పుడో వచ్చిందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం బంజరుపల్లి శివారులో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ రాష్ట్రానికి కేసీఆర్ అనే అద్భుత దీపం ఉందని.. దానివల్లే బంగారు పంటలు పండుతున్నాయన్నారు.

ధాన్యం కొనేందుకు కేంద్రానికి మనసు రాలేదు

మహారాష్ట్ర నుంచి 150 మంది రైతులు కాళేశ్వరం ప్రాజెక్టును చూసేందుకు రావడం రాష్ట్రానికి గొప్ప విషయమని హరీశ్‌రావు పేర్కొన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న మహారాష్ట్రలోని షోలాపూర్‌లో నాలుగు రోజులకోసారి తాగునీరు వస్తుందని విమర్శించారు. రూ. 12 వేల కోట్ల అప్పును అదానీకి మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వానికి... రూ. 4 వేల కోట్లతో రైతులు పండించిన ధాన్యం కొనడానికి మనసు రాలేదని మంత్రి ఎద్దేవా చేశారు.

విపక్షాల ప్రచారం ప్రజలు నమ్మొద్దు..

బీజేపీ, కాంగ్రెస్‌ల గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని, తెలంగాణ ఉద్యమ నినాదాలైన నీళ్లు, నిధులు, నియామకాలు సాధించేలా బీఆర్‌ఎస్ పనిచేస్తోందని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఒకప్పుడు రాష్ట్రంలో కరువు ఉండేదని... గంజి, అంబలి కేంద్రాలు, రైతుల ఆత్మహత్యలు ఉండేవని... ఇప్పుడు గోదావరి నీటితో తెలంగాణ పల్లెలు సస్యశ్యామలం అయ్యాయని పేర్కొన్నారు. పేపర్ లీకేజీపై నిరుద్యోగులు ఆందోళన పడొద్దని, 6 నెలల్లో 80 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతాపతి

వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు


సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతిని చూసి తన్మయులై నమస్కరిస్తున్న భక్తులు


సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతి

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం ఏకశిలానగరిలోని శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన ఆదివారం వటపత్రశాయి అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగాన నాథుడి గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 8 గంటల నుంచి 9.30 గంటల వరకు సింహ వాహనంపై సీతాపతి విహరించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అభయమిచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు.

నేడు నవనీత కృష్ణాలంకారం :

శ్రీకోదండ రామాలయంలో సోమవారం ఉదయం 8.00 గంటలకు నవనీత కృష్ణాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రికి హనుమంత వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పుర వీధుల్లో ఊరేగనున్నారు.

అడుగున్నర అందాల పెయ్యదూడ




డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం గ్రామానికి చెందిన గొలకోటి మాధవరావు ఇంట అడుగున్నర అందాల పెయ్యదూడ శనివారం రాత్రి జన్మించింది. ఫంక్షన్ సెట్టింగ్స్ ఆర్టిస్టు అయిన మాధవరావు వివిధ జాతుల ఆవులను పెంచుతుంటారు. 2019 అక్టోబర్ 28న ఓ కపిల ఆవుకు అరుదుగా ఉండే స్వర్ణ కపిల పెయ్య దూడ జన్మించి వార్తల్లోకి ఎక్కింది. ఆ స్వర్ణ కపిల ఆవు ఇప్పుడు 18 అంగుళాల పుంగనూరు పెయ్యదూడకు జన్మనిచ్చింది. ఈ అడుగున్నర అందాల పెయ్యదూడ అందర్నీ ఆకట్టుకుంటోంది.

టీడీపీలో నైరాశ్యం.. బాబు మౌన రాగం

175 స్థానాల్లో పోటీపై నోరు మెదపని వైనం

- సీఎంను ఓడించడానికి అందరూ ఏకం కావాలంటూ గగ్గోలు
- 50 నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేని దుస్థితి
- పలు స్థానాల్లో రెండో స్థానం కూడా సందేహమే
- చెప్పుకోవడానికి ఏమీ లేకే ఈ కొత్త రాగం



సాక్షి, అమరావతి: ఏపీలోని 175 శాసనసభ స్థానాల్లో అభ్యర్థులనే ఎంపిక చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్న చంద్రబాబు.. 'అసలు సినిమా ముందుంది'అంటూ డాంబీకాలు పలకడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును చూసి.. ఇది ట్రైలర్ మాత్రమేనని చెబుతున్న చంద్రబాబు, సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా.. అన్న వైఎస్సార్‌సీపీ సవాల్‌పై మాత్రం ఇప్పటిదాకా స్పందించనే లేదు. చెప్పుకోవడానికి ఏమీ లేక.. ఏం చేస్తారో కూడా చెప్పలేక సతమతమవుతున్న 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే వృద్ధ జంబూకం.. పార్టీ శ్రేణులు పూర్తిగా కకావికలం కాకూడదని సరికొత్త డ్రామాకు తెర తీసింది. అందరం కలిసి సీఎం జగన్‌ను ఓడిద్దాం.. రండంటూ పొత్తులపై ప్రాణాలు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. నిజంగా అసలు సినిమా ముందున్నది చంద్రబాబుకే. ఎందుకంటే.. ఒక్కో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 34 నుంచి 38 శాసనసభ స్థానాలు ఉంటాయి. వాటి పరిధిలో సుమారు 80 లక్షల మంది ఓటర్లు ఉంటారు. ఇందులో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా 87 శాతం కుటుంబాలకు చెందిన ఓటర్లకు ప్రయోజనం చేకూరింది. సంవత్సర ఆదాయం పట్టణాల్లో రూ.12 వేలు.. గ్రామాల్లో రూ.10 వేలలోపు ఉంటే ఆ కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నట్లుగా గుర్తిస్తారు. ఆ కుటుంబాలకే సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓటర్లు సుమారు 2.50 లక్షల నుంచి మూడు లక్షల వరకు ఉంటారు. ఇందులో 80% ఓటర్లు సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం లేదు. అలాంటి ఓటర్ల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో.. అదీ వామపక్షాలు, పీడీఎఫ్, యూనియన్లతో ఒప్పందం చేసుకుని గట్టెక్కడం అన్నది బలం కానే కాదని, వాపు అని అందరికంటే చంద్రబాబుకే బాగా తెలుసు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు కాని మహిళలు, మిగతా వారంతా రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తమకు మేలు చేస్తున్న ప్రభుత్వం కోసం ఏకమైతే టీడీపీ స్థానం ఎక్కడుంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిజంగా 50కి పైగా నియోజకవర్గాల్లో ఇప్పటికీ అభ్యర్థులే లేరు. మొత్తం 175 స్థానాల్లో టీడీపీకి రెండో స్థానం కూడా సందేహమేనని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. ఈ విషయంపై ప్రజల్లో ఎక్కువ చర్చ జరిగితే టీడీపీ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పక్కదోవ పట్టిస్తూ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపారు. ఇందుకు ఎల్లో మీడియా వంత పాడుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రయోగాత్మకంగా పోటీ

■ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణంగా వామపక్షాలు, పీడీఎఫ్, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పోటీ చేసేవి. వాటికి ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచే వామపక్షాలు, పీడీఎఫ్, బీజేపీ, యూనియన్‌లు క్రియాశీలకంగా పని చేస్తాయి. కొన్ని దశాబ్దాలుగా తమ ప్రభావం ఉన్న వర్గాలనే ఎంచుకుని ఓటర్లుగా చేర్పిస్తున్నాయి.

■ అయితే ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ పోటీ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయపతాక ఎగురవేసింది. మూడు పట్టభద్రుల స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. ప్రథమ ప్రాధాన్యత ఓట్లతో ఎక్కడా గెలవలేదు. కేవలం పీడీఎఫ్, సీపీఐ తదితర పక్షాలతో ఓట్ల బదిలీ ఒప్పందం కుదిరిన మేరకు.. ఆ వర్గాలు వేసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కింది.

■ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను అన్ని వర్గాల ప్రజల అభిప్రాయంగా భావించడానికి ఏమాత్రం వీల్లేదని, ఒకవేళ అలా భావిస్తే తనను తాను మోసం చేసుకోవడమేనన్నది చంద్రబాబుకు కూడా తెలుసని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపడానికే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ట్రైలర్ మాత్రమేనంటూ చంద్రబాబు బీరాలు పలుకుతున్నారని విశ్లేషిస్తున్నారు.

అన్ని స్థానాల్లో సైకిల్ గుర్తు ఉంటుందా?

- వైఎస్సార్‌సీపీని ఎలా ఓడిస్తావ్ బాబూ?
- నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పేర్ని నాని



సాక్షి, అమరావతి: ఏపీలో 175 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని ఓడిస్తానంటూ ఏప్రిల్ 1న (ఫూల్స్ డే) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీరాలు పలుకుతూ సీఎం వైఎస్ జగన్‌ను దూషిస్తూ అలౌకిక ఆనందాన్ని పొందాడని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. అసలు 175 నియోజకవర్గాల్లో సైకిల్ గుర్తుపై అభ్యర్థులను పోటీకి పెడతావా? అంటూ నిలదీశారు. మూణ్నెళ్ల క్రితం టీడీపీ నేతలతో సమావేశమై.. 38 నియోజకవర్గాలలో పార్టీకి ఇన్‌ఛార్జ్‌లే లేరంటూ వాపోయిన దిక్కుమాలిన స్థితి చంద్రబాబుదేనన్నారు. 'ముందు ఆ 38 నియోజకవర్గాలకు అభ్యర్థులను వెతుక్కో... కంగారెందుకు? ఎన్నికలకు మరో ఏడాది ఉంది కదా'అంటూ చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 175 నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్‌కు ఎన్ని ఇస్తున్నావ్? బీజేపీలో ఉంటూ టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి, సుజనా చౌదరి వంటి వారికి ఎన్ని సీట్లు ఇస్తున్నావ్?
- పేరుకేమో ఎర్ర జెండా. దాన్ని పసుపు రంగులో ముంచి భుజాన వేసుకుని తిరుగుతూ.. టీడీపీకి సీపీఐని తాకట్టు పెట్టిన నారాయణ, రామకృష్ణలకే సీట్లు ఇస్తావా? ఇంకెవరికైనా ఇస్తావా? ఇంకా రాహుల్ గాంధీకి ఎన్ని సీట్లు ఇస్తావ్? వీటిపై నీకు స్పష్టత ఉందా?
- ఇంత మందిని పోగేసుకుంటే కానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీకి వచ్చే ధైర్యం చంద్రబాబుకు లేదు. అయినా 75 ఏళ్ల వయసులో ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలు, మసిపూసి మారేడుకాయ చేయడం, ఏమార్చటాలు.. ఈ వయసులోనూ బాబు వీడ లేదు.
- 175 చోట్లా పోటీ చేసే దమ్ము లేదు. స్థోమతా లేదు. పది మందిని కలుపుకుంటేగానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీ చేసే సాహసం చేయలేని దుస్థితి. కొడుకు కలిసి రాడు. జనం మెచ్చుకోరు. అందుకే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, బావమరిది బాలకృష్ణతో తిరిగి.. సినిమా డైలాగ్‌లు రాయించుకుని పంచ్ డైలాగులు వదులుతున్నాడు.
- చంద్రబాబు ఎన్ని పార్టీలను పోగేసుకొని వచ్చినా, ప్రజల హృదయాల నుంచి సీఎం వైఎస్ జగన్‌ను ఇసుమంత కూడా తొలగించలేరు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం.

కుప్పంలో కార్యకర్త చేతిలో ఓడటం ఎందుకు?

- 'వైనాట్ పులివెందుల?' అంటున్నారు కదా.. అలా అనే వారందరినీ నేను ఆహ్వానిస్తున్నాను. పులివెందులలో జగన్ గారు ఓడిపోతారని కలలు కనే వారంతా వచ్చి పోటీ చేయండి. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ఎవరైనా సరే పులివెందులలో పోటీ చేయొచ్చు. కుప్పంలో వైఎస్సార్సీపీ కార్యకర్తల చేతిలో ఓడిపోవడం ఎందుకు? పులివెందులలోనే పోటీ చేయండి. అక్కడే ఇద్దరూ పోటీ చేసినా ఫరవా లేదు. మీరో.. మేమో తేలిపోతుంది.
- మొత్తం 21 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే చంద్రబాబు గెలిచింది కేవలం నాలుగు. గ్రాడ్యుయేట్స్‌లో మూడు, ఎమ్మెల్యే కోటాలో ఒకటి.. దానికే చంకలు గుద్దుకోవడం ఏమిటో? ప్రపంచాన్ని జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు.

ఓమన్‌లో ఉగాది వేడుకలు



ఉగాది సంబరాల్లో పాల్గొన్న తెలంగాణ వాసులు



వేడుకల్లో నృత్యం చేస్తున్న యువతీ యువకులు

ఖానాపూర్: గల్ఫ్ దేశమైన ఓమన్‌లో శనివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. దర్శయిట్ ప్రాంతంలోని ఇండియన్ సోషల్ క్లబ్ మల్టీపర్పస్ హాల్‌లో తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ ఓమన్ తెలంగాణ సమితి కన్వీనర్ గుండెటి గణేశ్ పాటు కో-కన్వీనర్ నూనె లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు.

లక్ష్యాల సాధనకు ప్రణాళికతో ముందుకెళ్లాలి

- సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్


సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని : 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించాల్సిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల కోసం ప్రణాళికబద్ధంగా ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్‌వీకే శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్జీ–1 జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆర్జీ–1,2,3, ఏపీఏ, భూపాల్‌పల్లి ఏరియాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా ఓసీపీల్లో ఓబీ వెలికితీత, బొగ్గు రవాణా వేగవంతం చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తితో పాటు సరైన రక్షణ చర్యలు పాటించాలన్నారు. సమావేశంలో ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ–2 జీఎం మనోహర్, ఆర్జీ–3 జీఎం టీవీ రావు, కార్పొరేట్ సేఫ్టీ జీఎం హబీబ్ హుస్సేన్, క్వాలిటీ జీఎం కేవీరావు, తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా కలిసుండాలి

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్


మాట్లాడుతున్న దయాకర్

కోనరావుపేట (వేములవాడ): గ్రామాలు దేశానికి పట్టుగొమ్మలని, కులమతాలకతీతంగా కలిసి ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమవుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో మాల కమ్యూనిటీ భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ప్రజల్లోసామాజిక చైతన్యం రావాలన్నారు. మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు అమలుచేయాలని, 50 శాతం ఉన్న బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మంతెన సంతోష్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు ఎనగందుల వెంకన్న, తిక్కల సాగర్, నాలుక సత్యం, రాములు, నాగమణి, మాజీ జెడ్పీటీసీలు గొట్టె రుక్మిణీ, పల్లం అన్నపూర్ణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, దళిత సంఘాల నాయకులు రాగుల రాములు, సిరిగిరి రమేశ్, మాలమహానాడు నాయకులు మేడి అంజయ్య, రొడ్డ రామచంద్రం, మంగ కిరణ్ పాల్గొన్నారు.

అద్దె కట్టలేదని హాస్టల్‌కు తాళం

- నిర్మల్ జిల్లా భైంసాలో ఘటన

భైంసాటౌన్(ముధోల్): నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన హాస్టల్ భవనం అద్దె కట్టలేదని సదరు యజమాని ఆదివారం రాత్రి గేట్‌కు తాళం వేశారు. ఈ హాస్టల్‌లో 70 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. ఇందులో పదో తరగతి విద్యార్థులు 36 మంది ఉండగా సోమవారం నుంచి వార్షిక పరీక్షలు జరగనున్నాయి. దీంతో ఆందోళన చెందిన విద్యార్థులకు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న ఎంఈవో సుభాష్ హాస్టల్‌కు చేరుకుని విద్యార్థులతో మాట్లాడారు. ఆందోళన చెందవద్దని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ వచ్చి అద్దె చెల్లిస్తానని చెప్పడంతో యజమాని వచ్చి గేటుకు తాళం తీయడంతో వివాదం సద్దుమణిగింది.

అన్నదమ్ములను కలిపిన 'బలగం'


సర్పంచ్ సమక్షంలో కలిసిన అన్నదమ్ములు

లక్ష్మణచాంద(నిర్మల్): కొంతకాలంగా మాట్లాడుకోకుండా దూరంగా ఉంటున్న ఇద్దరు అన్నదమ్ములను బలగం సినిమా ఒక్కటి చేసింది. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన గుర్రం పోసులు, గుర్రం రవి ఇద్దరు అన్నదమ్ములు. ఇంటి స్థలం విషయంలో జరిగిన గొడవతో కొంతకాలంగా మాట్లాడుకోవడం మానేశారు. శనివారం సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి చొరవతో మండల కేంద్రంలోని డీఎస్‌ఆర్ ఫంక్షనల్ హాల్‌లో బలగం సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. అందులో కుటుంబాలు కలిసి ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలు, విడిపోయిన కుటుంబాలు ఎలాంటి ఇబ్బందులు పడుతాయో కళ్లకు కట్టినట్లు చూపించారు. సినిమాను చూసిన పోసులు, రవి మనసు మార్చుకున్నారు. తమ మనస్పర్థలు పక్కనపెట్టామని, ఇకనుంచీ కలిసే ఉంటామని ఆదివారం ఉదయం సర్పంచ్ ముత్యంరెడ్డి సమక్షంలో ఒక్కటయ్యారు. తమను కలిసేలా చేసిన సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రసాదం తయారీ కేంద్రం తనిఖీ


ప్రసాదం తయారీ పరిశీలిస్తున్న ఈవో

భైంసా(ముధోల్): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ప్రసాద తయారీ కేంద్రాన్ని ఆలయ ఈవో విజయరామారావు ఆదివారం తనిఖీ చేశారు. భక్తులకు నాణ్యమైన, స్వచ్ఛమైన ప్రసాదం తయారీ చేయాలని సూచించారు. కేంద్రాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం భక్తులను అడిగి ప్రసాదం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.



వెల్లివిరిసిన మతసామరస్యం

బోథ్: హనుమాన్ దీక్షాపరులకు ముస్లిం యువకులు అన్నదానం చేసి మత సామరస్యం చాటారు. మండల కేంద్రానికి చెందిన పర్వేజ్ ఖాన్, షేక్ సైఫ్, సుమేర్, రుమేజ్‌లు స్థానిక హనుమాన్ దీక్షాపరులకు ఆదివారం భిక్ష ఏర్పాటు చేశారు. స్వయంగా వారే వడ్డించారు. అందరూ అన్ని మతాలను గౌరవించుకుంటూ, భిన్నత్వంలోఏకత్వం చాటుతామని పేర్కొన్నారు.

'గవాయి' కి సినారె సాహితీ పురస్కారం


పురస్కారం ప్రదానం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్ కల్చరల్ : తెలంగాణ భాషకు ఆత్మగౌరవం తీసుకొచ్చి, సినారె కవితా పురస్కారం అందుకున్న అన్నవరం దేవేందర్ జిల్లాకు చెందినవారు కావడం గర్వకారణమని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. ఆదివారం సాహితీ గౌతమి ఆధ్వర్యంలో ఐఎంఏ హాల్‌లో అన్నవరం దేవేందర్ రచించిన 'గవాయి'కి సినారె సాహితీ పురస్కారం ప్రదానోత్సవం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పురస్కార కమిటీ అధ్యక్షుడు, ప్రముఖ పిల్లల వైద్యుడు ఎడవెల్లి విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పురస్కారం జిల్లా కవి అన్నవరంకు రావడం ఆనందంగా ఉందన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షుడు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కవులు జనసేషన్ వీరరాఘవన్, నంది శ్రీనివాస్, గాజుల రవీందర్, దాస్యం సేనాధిపతి, గంప ఉమాపతి, కూకట్ల తిరుపతి, రవీందర్, పొన్నం రవిచంద్ర, నడిమెట్ల రామయ్య, మహమ్మద్ ఖాలీద్, తదితరులు పాల్గొన్నారు.

కక్షసాధింపు కోసమే కేసులు


తిరుపతిరెడ్డి కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

నిజామాబాద్ ఎంపీ అర్వింద్

జగిత్యాలరూరల్: బీఆర్‌ఎస్ నాయకులు అహంకార పూరితంతో బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయించారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన పన్నాల తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను ఆదివారం ఆయన పరామర్శించారు. టీఎస్ పీఎస్సీ ప్రశ్నపత్రం లీకేజీకి నిరసనగా ఇటీవల చేపట్టిన ధర్నాలో పన్నాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారని, దీనిని సహించని ప్రభుత్వం.. పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంటూ కేసు నమోదు చేయించి, జైలుకు తరలించిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతు నాయకులు అనేక ఉద్యమాలు చేశారని, దేశం ఆశ్చర్యపోయేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో రైతు నాయకులు నామినేషన్లు వేసి 90వేల ఓట్లు సాధించారని గుర్తుచేశారు. దీనిని సహించలేక మాజీ ఎంపీ, జగిత్యాల ఎమ్మెల్యే అహంకారంతో పోలీసులపై ఒత్తిడి తెచ్చి తిరుపతిరెడ్డిపై అక్రమ కేసులు నమోదు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వానికి దడ పెరిగిందని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో జగిత్యాల అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నాయకులు భోగ శ్రావణి, పడాల తిరుపతి, గోపాల్‌రెడ్డి, మదన్‌మోహన్, మోహన్‌రెడ్డి, వామన్‌రెడ్డి, నలువాల తిరుపతి పాల్గొన్నారు. కాగా, పొలాసకు చెందిన బీజేపీ ఐటీ సెల్ జిల్లా జాయింట్ కన్వీనర్ నత్తి నాగరాజు వివాహం ఇటీవల జరిగింది. ఆయన ఇంటికి వెళ్లిన అర్వింద్.. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గురువాణి


ఓ చెంచాడు అయినా లేకపోతే...

కష్టం వచ్చినప్పుడు భగవంతుడు మన పక్షాన లేడు.. అనుకుంటాం. దేముడు చల్లగా చూసాడు–అని సుఖం కలిగినప్పుడు అనుకుంటుంటాం. కానీ భగవంతుడికి ఏ పక్షపాతమూ లేదు, ఆయన ఎవరిపక్షాన ఉండడు.

''దృషద్విచిత్రతల్పయో ర్భుజంగమౌక్తికస్రజో/
ర్గరిష్ఠరత్న లోష్ఠయోః సుహృద్విపక్ష పక్షయోః/
తృణారవింద చక్షుషోః ప్రజామహీ మహేంద్రయోః /
సమప్రవర్తికః కదా సదాశివం భజామ్యహమ్.''

కటిక నేలనుంచీ, హంసతూలికా తల్పం వరకూ, మహారాజు నుండి సామాన్యుడి వరకు, మిత్రపక్షం అనీ, శత్రుపక్షం అనీ తేడా లేకుండా అన్నిటినీ సమాన దృష్టితో చూసే ఆ సదాశివుడికి నమస్కారం.. అంటాం.

వివేకానందుడు చెప్పినట్టు – ఈ ప్రపంచమంతా నీ పూజా మందిరంగా చూసే శక్తి రావాలి. భగవంతుడిని ఏమార్చి ఆయనను మన పక్షానికి తీసుకురావడం ఎప్పటికీ సాధ్యమయ్యేది కాదు. ఆయన ప్రీతి పొందేది మన నడవడికను బట్టే. మన నడవడి ధర్మాన్ని ఆశ్రయించి ఉండాలి. మనం సముద్రమంత ప్రయత్నం చేయవచ్చుగాక, కానీ ఓ చెంచాడంత భగవదనుగ్రహం ఉండకపోతే కార్యాలు సఫలీకృతం కావు. 'ఆచార్య ప్రభవో ధర్మః. ధర్మం అనేది కేవలం పుస్తకాలలో చదువుకుంటేనో, అన్నీ నాకు తెలుసనుకుంటేనో అన్వయం కాదు. నీవు ఎంత అనుష్ఠించావో అదే ధర్మం. ధర్మాత్ముడు.. అనిపించుకోవాలంటే నీ నడవడిక మొత్తం ధర్మబద్ధంగా ఉండాలి. ఆచరించినది ధర్మం. ఆచరించనిది ఎప్పటికీ ధర్మం కాదు. అమెరికాకు అధ్యక్షులుగా చేసినవారిలో చిరస్మరణీయుడైన అబ్రహాం లింకన్ ఒక మాటన్నారు...''దేముడు నీ పక్షాన ఉన్నాడా అని ఆలోచించడం కాదు, దేముడి మార్గంలో నీవు ఉన్నావా !'' అని చూసుకొమ్మన్నారు. ఆయన బాల్యంనుంచీ అలానే బతికారు. నిరుపేద. చిన్నతనంలో ఒక దుకాణంలో పనిచేస్తుండేవాడు.. ఒక వినియోగదారుడి దగ్గర తీసుకోవాల్సిన దానికంటే ఎక్కువ సొమ్ము తీసుకున్నారు. ఆ తరువాత లెక్కలు చూసుకుంటుంటే తెలిసింది. దుకాణం మూసేసి అర్ధరాత్రి వినియోగదారుడి ఇల్లు వెతుక్కుంటూ పోయి తాను ఎక్కువగా తీసుకొన్న మొత్తాన్ని ఇచ్చేసి మరీ వచ్చాడు. అదీ అనుష్ఠానం లో ధర్మం అంటే... ఈ పరిణతి ఆయన ఎంతసేపు పూజ చేసాడు, ఎంత సేపు ప్రార్థన చేసాడు.. అన్న దానినిబట్టి రాలేదు... చిన్నతనం నుంచి అదే నిబద్ధతతో బతకబట్టి వచ్చింది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మీకు ధర్మంపట్ల అనురక్తి ఉండి ఆచరించినదేదో అదే ధర్మం. అదే సదాచారం. ధర్మంపట్ల అనురక్తి లేకుండా స్వప్రయోజనం చూసుకుంటే అది దురాచారం. ఎక్కడ సదాచారం ఉన్నదో అక్కడ భగవదనుగ్రహం ఉండి తీరుతుంది. ఎక్కడ సదాచారం లేదో అక్కడ దేముని కృప ఎలా సాధ్యం! నీకు ఆకలేస్తే నువ్వే తినాలి. నీకు నిద్రవస్తే నీవే నిద్రపోవాలి. అలాగే నీ నడవడికలో దోషాలను నీవే దిద్దుకోవాలి. సదాచారం పెరుగుతూ ఉండాలి, దురాచారం తగ్గుతూ పోవాలి. ధర్మం చెప్పేది కూడా... నీవు నన్ను కాపాడు.. నేను నీ పక్షాన ఉండి నిన్ను కాపాడతా...అనే.

మంచి మాట

అనేవాళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి అంటూనే ఉంటారు. లోపాలు అని, పనితీరు అని పనిగట్టుకునో, అదేపనిగానో అక్కర్లేనివాటిని అంటూనే ఉంటారు. మాటల్ని విసిరేస్తూ ఉండేవాళ్లు చాలమందే ఉన్నారు, ఉంటారు. వాళ్లను మనం పరిహరించుకోవాలి. పనికి వచ్చే పనులు చెయ్యలేనివాళ్లు, పనికిమాలిన మాటలు తెగ అంటూ ఉంటారు. అలాంటివాళ్లను తక్షణమే దారిలోంచి పక్కకు నెట్టేస్తూ మనం ముందుకు సాగిపోతూ ఉండాలి.



మూడు 'అ'లు
అభ్యాసం... అధ్యయనం... అవగాహన



ఎవరి మానసికస్థాయిలో వాళ్లు ఇతరుల్ని అర్థం చేసుకుంటూ తొందరపాటుతనంతో ఒక నిర్ణయానికి వచ్చేస్తారు. మనకు తారసపడే వ్యక్తులు వాళ్ల తాహతుకు తగ్గట్టు మనల్ని తూస్తూ ఉంటారు. ఎవరికివాళ్లు మనల్ని వాళ్ల పరిధిల్లోకి కుదించి విశ్లేషిస్తూనో, విమర్శిస్తూనో ఉంటారు. ఈ తీరు ఒక మానసికజాడ్యం. ఇతరుల విశ్లేషణలకూ, విమర్శలకూ, ఆలోచనాసరళికి మనం బలికాకూడదు.

'నీ విలువ నీ సత్వంలో ఉంటుంది; ఏం జరిగినా అది తొలగిపోదు' అని చైనా తాత్త్వికుడు చువాంగ్‌చొ మనకు అవసరమైన సత్యాన్ని తెలియజెప్పారు. ఈ సత్యాన్ని అవగతం చేసుకుంటే మనకు అవసరమైన మేలు ఆగిపోకుండా జరుగుతూ ఉంటుంది. ఈ చువాంగ్‌చొ మాట ఒక విలువైన మార్గదర్శకం. ఇతరులు మన గురించి అనేవి, అనుకునేవి మనకు ఎంత మాత్రమూ ముఖ్యం కాదు. మనం తెలుసుకునే సరైనవి, విలువైనవి, మనం చెయ్యగలిగే సరైనవి, విలువైనవి మనకు, సాటి మనిషికి, సమాజానికి అవసరం అయి నిలబడతాయి.

మన గురించి ఇతరులు అనడానికి, అనుకోవడానికి అతీతంగా, మనపై ఇతరులు చేసే విమర్శలకు, విశ్లేషణలకు లోబడకుండా మనం భవిష్యత్తును వర్తమానానికి తెచ్చుకోవడం నేర్చుకోవాలి; వర్తమానాన్ని గతితప్పకుండా భవిష్యత్తులోకి నడిపించుకోవడం తెలుసుకోవాలి.

'లక్షణానికి లక్ష్యం ఉండాలి; లక్ష్యానికి లక్షణం ఉండాలి'. మనం మెదులుతూ, కదులుతూ ఉండాలి. మనల్ని తోసిపడేసే అవకాశం ఇతరులకు ఇవ్వకూడదు. మనం అడుగు వెయ్యడం పడిపోవడానికి కాదు. ఏ కారణం వల్లా మన నడత పగిలిపోకూడదు. బతకడం చితికిపోవడానికి కాదు; జననం నలిగి పోకూడదు. కదలిక కళ కావాలి; కళలా మనం కదులుతూ ఉండాలి. తలలు పనిచెయ్యాలి; మన తలపులు పండాలి. నీళ్లు చచ్చిపోవు; మనుషులు మనుషులుగానే ప్రవహించాలి. కాంతి కాలిపోదు; మనుగడ మనుగడగానే ప్రసరించాలి.

'నీ గురించి ఇతరులకు తెలియజెప్పుకోవడం మానుకో. అలా చెయ్యడంవల్ల నువ్వు చచ్చిపోవు, నువ్వు జీవితంలోకి వస్తావు. అంతేకాదు, ఇతరులు నీ గురించి అంటున్నదాన్ని పట్టించుకోకు. ఇతరులు నీ గురించి అంటున్నప్పుడు వాళ్లు సంకుచితులు అయిపోతున్నారు. అది వాళ్ల సమస్య. నువ్వు ఇతరులతో కలిసి పనిచేస్తున్నప్పుడు అక్కడ నువ్వు ఒక పనిగానో, ఒక పాత్రగానో ఉండకు; చైతన్యపు ఉనికికి క్షేత్రంగా ఉండు. నీ దగ్గర ఉన్నదాన్నేదో నువ్వు పోగొట్టుకోవచ్చు కానీ నువ్వైనదాన్ని దేన్నీ నువ్వు పోగొట్టుకోవు' అని జర్మన్ తాత్త్వికుడు ఎక్‌హార్ట్ టోల్ సరైన సూచన చేస్తున్నారు. ఇతరులు ఏదో అంటున్నారనీ, అనుకుంటున్నారనీ మనం మన మనుగడను బాధించుకుంటూ ఉండిపోకూడదు.

మూడు 'అ' లు మనకు అత్యవసరం. అవి అభ్యాసం, అధ్యయనం, అవగాహన. ఈ మూడిటి తోడు తీసుకుని మనం కొనసాగాలి, మునుసాగాలి. ఇతరులు మనపై చేసే విశ్లేషణలు, విమర్శలు మనల్ని ఆపెయ్యకూడదు. అవి అడ్డొచ్చినప్పుడల్లా వాటిని ఛేదిస్తూ, భేదిస్తూ మన గమనం మనం చేస్తూ వర్ధిల్లేందుకు మనం వర్తమానమవనున్న భవిష్యత్తులోకి ప్రవేశిద్దాం; భవిష్యత్తు వర్తమానమైనాక మనం అందులో వర్ధిల్లుదాం.

– శ్రీకాంత్ జయంతి

బౌద్ధవాణి

ప్రత్యక్ష జ్ఞానం... శ్రేష్ఠ జ్ఞానం

బుద్ధుడు ఒక సమయంలో జేతవనంలో ఉంటున్నాడు. ఆ సమయంలో వైశాలీ నగరానికి చెందిన జానుశ్రోణి అనే పండితుడు తెల్లని గుర్రాలు పూన్చిన రథం మీద బయలుదేరాడు. నగరం వెలుపలికి రాగానే పిలోత వాత్సాయనుడు అనే మరో పండితుడు ఎదురయ్యాడు. జానుశ్రోణుడు రథం ఆపి –''పిలోతికా ప్రణామం. తమరు ఎక్కడి నుండి వస్తున్నారు?'' అని అడిగాడు

''భగవాన్ బుద్ధుని దగ్గర నుండి'' అన్నాడు.

''బుద్ధుడు మహాప్రజ్ఞానే అంటారా?'' అని అడిగాడు జాను శ్రోణుడు.

''మహాశయా! వారి ప్రజ్ఞను తెలుసుకోడానికి నేనెంతటి వాణ్ణి'' అన్నాడు వినమ్రంగా.

''వాత్సాయనా! మీరు మరీనూ! తెలియదు అంటూనే ''బుద్ధుడు మహా ప్రజ్ఞాని'' అని నర్మగర్భితంగా చెప్పేస్తున్నారు. మీరు ఆయనలో ఏం చూసి ఆ నిర్ణయానికొచ్చారు?'' అని అడిగాడు.

''ఒకడు అడవిలోకి ఏనుగుల కోసం వెళ్తాడు. అక్కడే ఒక పెద్ద ఏనుగు పాదం గుర్తు కనిపిస్తుంది. ఆ పాద చిహ్నాన్ని చూసి ''ఆహా! ఇది చాలా పెద్ద ఏనుగు'' అని అనుకుంటాడు కదా! అన్నం అంతా అవసరం లేదు. ఒక్క మెతుకు పట్టి చూస్తే చాలు కదా'' అన్నాడు పిలోత వాత్సాయనుడు.



''మంచిది'' అని ముందుకు కదిలాడు జాను శ్రోణుడు.

నేరుగా బుద్ధుని దగ్గరకు వెళ్ళి నమస్కరించి, ఒక పక్కన నిలబడ్డాడు. తనకూ పిలోతునికీ జరిగిన సంవాదం గురించి చెప్పాడు.

అప్పుడు బుద్ధుడు–

''పండితా! పిలోతుడు చెప్పిన ఏనుగు ఉపమానం అక్కడితో ఆగిపోదు. పాద చిహ్నాల్ని చూసి ఏనుగుని ఇలా ఉంటుందని నిర్ణయించలేం''

'శ్రోణా! ఒకడు ఏనుగు కోసం అడవికి వెళ్ళాడు. అతనికి పెద్ద పెద్ద ఏనుగు పాదాలు కనిపించాయి. వాటి వెనుకే వెళ్ళి చూశాడు. తీరా వెళ్ళి చూస్తే అది 'వామనికం' అనే చిన్న ఏనుగు. అతను మరోసారి అడవికి వెళ్ళాడు. ఈ సారి కూడా పెద్ద పాదాల గుర్తులు చూశాడు. అది కూడా 'కళారికం' అనే మరుగుజ్జు ఏనుగువే. మరోసారి కూడా అలాగే చూసి వెళ్ళాడు. ఈసారి 'కరేణుకం' అనే చిన్న ఆడ ఏనుగు కనిపించింది. అలా మూడుమార్లూ పాద చిహ్నాలు సరైనవి కాలేదు.

మరోసారి కూడా పెద్ద పెద్ద పాద చిహ్నాలు కనిపించాయి. వాటిని వెంబడించాడు. దారిలో ఎత్తైన చెట్ల కొమ్మలు విరిగి కన్పించాయి. ఆ కొమ్మలకు బురద అంటి ఉంది. ఏనుగు చర్మం రాచుకుపోయిన ఆనవాళ్ళు ఉన్నాయి. ఈసారి ఈ దారిలో పోయింది పెద్ద ఏనుగే అని నిర్ణయించుకున్నాడు. వెళ్ళాడు. చూశాడు. పెద్ద వృక్షం దగ్గర నిలబడి విశ్రాంతి తీసుకుంటూ కనిపించింది పెద్ద ఏనుగు. ఆ పాద చిహ్నాలు దానివే'' అని చెప్పి – ప్రత్యక్ష జ్ఞానాన్ని అయినా సాక్షాత్కరించుకొన్న వానికే ఏది సత్యమో ఏది అసత్యమో తెలుస్తుంది. అలాంటి వాడు మాత్రమే ప్రాజ్ఞుడు– అంటాడు బుద్ధుడు.


బుద్ధుని సమాధానం విని సంతృప్తి చెందాడు జానుశ్రోణుడు. వినయంతో వంగి నమస్కరించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

అమృత బిందువులు

- మంచివారితో మంచిగా ఉండండి. కానీ... చెడ్డవారితో చెడ్డగా ఉండకండి. ఎందుకంటే, వజ్రాన్ని వజ్రంతో కోయవచ్చు, కానీ... బురదని బురదతో కడగలేము కదా.
- సమసిపోయే మార్గం అన్వేషించు చిక్కుముడి వీడే దిశగా శోధించు ప్రయత్న లోపం లేకుండా ప్రయత్నించు విజయం నీదే మరి
- కొత్త బంధాలను, కొత్త స్నేహాలను కలుపుకోవడం కన్న ఉన్న బంధాలను నిలుపుకోవడం చాలా చాలా ఇష్టం.
- మనస్సులో సంతోషం లేనపుడు మనం ఏడంతస్థుల మేడలో ఉన్నా ఏమీ లేని గుడిసెలో ఉన్నా ఒకటే.

సినిమా


మహేశ్‌బాబు

వెకేషన్ టైమ్

ప్రతి ఏడాది వేసవిలో కుటుంబంతో కలిసి వెకేషన్ కోసం విదేశాలకు వెళ్తుంటారు హీరో మహేశ్ బాబు. ఈ ఏడాది కూడా వెళ్లనున్నారాయన. ఈ నెల మొదటి వారంలోనే మహేశ్ బాబు వెకేషన్ మోడ్ ఆన్ కానుంది. ఇప్పటికే ఆయన సతీమణి నమ్రత, పిల్లలు విదేశాల్లోనే ఉన్నారని, అతి త్వరలో మహేశ్ కూడా ఫ్యామిలీతో జాయిన్ అవుతారని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు మహేశ్ బాబు. మరో మూడు, నాలుగు రోజులు ఈ షూట్‌లో పాల్గొన్న తర్వాత ఫారిన్ ఫ్లైట్ ఎక్కనున్నారాయన. ఈ నెలాఖరున హైదరాబాద్‌కు తిరిగొచ్చి మళ్లీ షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ మూవీలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా 2024, జనవరి 13న విడుదల కానుంది.

హైదరాబాద్ టు గోవా


ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. హీరో కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఫారిన్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బెట్స్ డిజైన్ చేసిన ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ పాల్గొంటున్నారట. షిప్‌లో సాగే ఈ ఫైట్ కోసం ప్రస్తుతం చిత్రయూనిట్ నైట్ షూట్ జరుపుతోంది. కాగా ఈ సినిమా తర్వాతి షెడ్యూల్‌ను గోవాలో ప్లాన్ చేశారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

టార్గెట్ ఫిక్స్


కమల్ హాసన్

భారతీయుడికి టార్గెట్ ఫిక్స్ చేశారు దర్శకుడు శంకర్. 1996లో హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇండియన్'కి(తెలుగులో భారతీయుడు) సీక్వెల్‌గా తీస్తున్న 'ఇండియన్ 2' షూటింగ్ జరుగుతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ తైవాన్‌లో జరుగుతోంది. కమల్ హాసన్‌పై కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కిస్తున్నారు శంకర్. ఇందులో ఓ ట్రెన్ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉందని కోలీవుడ్ టాక్. అయితే 'ఇండియన్ 2' టాకీ పార్ట్ షూటింగ్‌ను జూన్‌కల్లా పూర్తి చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయట. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ''టాకీ పార్టు పూర్తి కాగానే ఓ పాట చిత్రీకరిస్తాం.. దీంతో మేజర్ షూటింగ్ పూర్తవుతుంది. జూన్ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను స్టార్ట్ చేస్తాం'' అన్నారు శంకర్. కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విరూపాక్ష అదిరిపోద్ది – సాయితేజ్

''విరూపాక్ష' చిత్రాన్ని దయచేసి థియేటర్లలో చూడండి.. సినిమా అదిరిపోద్ది. ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటుంది. మా సినిమాకి వాయిస్ ఓవర్ ఇచ్చిన తారక్ అన్నకి (ఎన్టీఆర్) థ్యాంక్స్.. ఆయన వాయిస్ మా మూవీకి చాలా ప్లస్ అయింది'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు.బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది.


బాపినీడు, బీవీఎస్ఎన్ ప్రసాద్, కార్తీక్, సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్


ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ–''అభిమానులు, ప్రేక్షకుల ఆశీర్వాదాల వల్లే నేను మళ్లీ ఈ వేదికపై నిలుచున్నా. మీ అందరి ప్రార్థనలు, సపోర్ట్ వల్లే 'విరూపాక్ష' బయటికి వచ్చింది. 2019లో సుకుమార్‌గారు ఫోన్ చేసి, 'విరూపాక్ష' కథ వినమన్నారు. ప్రేమకథ అయ్యుంటుందిలే చేసేద్దాం అనుకున్నా. కానీ, కార్తీక్ వచ్చి థ్రిల్లర్ అనగానే షాక్ అయ్యాను. 'విరూపాక్ష' కథ మొత్తం విన్నాక ఇది బ్లాక్‌బస్టర్ అవుతుంది, చేయాలని ఫిక్స్ అయిపోయాను. మా కొడుకులు 'విరూపాక్ష' సినిమా చేశారని మా అమ్మ, కార్తీక్ అమ్మ గర్వంగా చెబుతారు. సెట్స్‌లో నాకు ధైర్యం చెబుతూ సపోర్ట్ చేసిన ప్రసాద్, సుకుమార్, బాపినీడు గార్లకు, తోటి నటీనటులకు థ్యాంక్స్'' అన్నారు. ''2018లో సుకుమార్‌గారికి 'విరూపాక్ష' కథ చెప్పాను. కరోనా, లాక్‌డౌన్, తేజ్‌గారికి ప్రమాదం వల్ల సినిమా ఆలస్యం అయ్యింది'' అన్నారు కార్తీక్ దండు. ''విరూపాక్ష' యూనివర్సల్ సబ్జెక్ట్.. అందుకే పాన్ ఇండియా స్థాయిలో తీశాం'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్.


సమంత

నేను అలా అనుకోవడం లేదు – సమంత

''వైవాహిక జీవితానికి ముగింపు పలికిన కొన్నిరోజులు నాకు ఎంతో కష్టంగా గడిచాయి'' అన్నారు హీరోయిన్ సమంత. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'శాకుంతలం' సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ– ''స్వతంత్ర భావాలున్న ఓ బలమైన మహిళగా కొందరు నన్ను ఊహించుకుంటారు. కానీ, నేను అలా అనుకోవడం లేదు. జీవితంలో ఎన్నో కష్టాలు, బాధలు అనుభవించాను. నా జీవితంలోనూ కొన్ని చీకటి రోజులున్నాయి. ఆ సమయంలో (విడాకులు తీసుకున్న టైమ్‌లో) పిచ్చి పిచ్చి ఆలోచనలు నా మనసును ఉక్కిరిబిక్కిరి చేశాయి. నా స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సపోర్ట్‌తో ఆ పరిస్థితుల నుంచి బయటపడ్డాను. ఇంకా ఆ పరిస్థితుల తాలూకు బాధను అనుభవిస్తూనే ఉన్నాను. కానీ ఆ ప్రభావం ఇప్పుడు తగ్గింది'' అన్నారు. 2017లో వివాహం చేసుకున్న నాగ చైతన్య, సమంత ఆ తర్వాత 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.


నటుడు కాస్ట్యూమ్ కృష్ణ ఇక లేరు



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు, నిర్మాత కాస్ట్యూమ్ కృష్ణ (86) ఇకలేరు. చెన్నైలోని స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. కాస్ట్యూమ్ కృష్ణది ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా లక్కవరపు కోట. ఆయన అసలు పేరు మాదాసు కృష్ణ. సినిమా రంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా స్థిరపడిపోవడంతో ఆయన పేరు కాస్ట్యూమ్ కృష్ణగా ప్రాచుర్యం పొందింది. చెన్నైలో కాస్ట్యూమ్ డిజైనర్ అసిస్టెంట్‌గా పలు చిత్రాలకు పని చేసిన ఆయన ఆ తర్వాత 1954లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా సొంతంగా చిత్రాలను చేయడం ప్రారంభించారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలో ఎక్కువ రోజులు పని చేయడంతో ఆయన్ను 'సురేశ్' కృష్ణ అనేవారు. ఆ తర్వాత కాస్ట్యూమ్ కృష్ణగా ఆయన పేరు స్థిరపడింది. తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, వాణిశ్రీ, జయచిత్ర, జయప్రద, శ్రీదేవి వంటి ప్రముఖుల చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు కృష్ణ. కాగా ఈయనలోని యాక్టర్‌ని గుర్తించిన దర్శకుడు కోడి రామకృష్ణ 'భారత్ బంద్'(1991) చిత్రం ద్వారా నటుడిగా పరిచయం చేశారు. ఆ తర్వాత 'అల్లరి మొగుడు, దేవుళ్లు, మా ఆయన బంగారం, పెళ్లి పందిరి, పెళ్లాం చెపితే వినాలి, పుట్టింటికి రా చెల్లి, విలన్' వంటి పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందారాయన. అలాగే 'అశ్వద్ధామ' చిత్రం ద్వారా నిర్మాతగా మారిన కృష్ణ 'పెళ్లి పందిరి, అగ్ని రాముడు' వంటి ఎనిమిది సినిమాలు నిర్మించారు. వృద్ధాప్యం కారణంగా సినిమాలకు దూరంగా ఉంటున్న కాస్ట్యూమ్ కృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి, చికిత్స పొంది ఇంటికొచ్చారు. కాగా ఆదివారం అర్ధరాత్రి 1.45 నిమిషాల ప్రాంతంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కాస్ట్యూమ్ కృష్ణకి భార్య భారతి, కుమారులు శేఖర్, రవి, కుమార్తెలు ధనలక్ష్మి, వాణి ఉన్నారు. కాగా నేటి ఉదయం చెన్నై గిండీలోని శ్మశానవాటికలో కాస్ట్యూమ్ కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

బలగంకు మరో అవార్డు

అంతర్జాతీయ వేదికపై 'బలగం' సినిమా మరోసారి సత్తా చాటింది. ఉక్రెయిన్‌లో జరిగిన ఓనికో ఫిల్మ్ అవార్డ్స్‌లో ఈ మూవీకి ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అవార్డు లభించింది. ప్రియదర్శి, కావ్య జంటగా వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ సమర్పణలో హన్షిత, హర్షిత్ నిర్మించిన ఈ మూవీ మార్చి 3న విడుదలైంది.


బలగం పోస్టర్

మా ఊహ నిజమైంది – సుమన్

''పరారి' సినిమాలో నేను ఓ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేశాను. యూనిట్ అంతా చాలా కష్టపడి తీసిన ఈ చిత్రం హిట్ సాధించినందుకు సంతోషంగా ఉంది. మేము ఊహించినట్లుగానే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది'' అని నటుడు సుమన్ అన్నారు. యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ చిత్రం మార్చి 30న విడుదలైంది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో యోగేశ్వర్ మాట్లాడుతూ– ''హీరోగా 'పరారి' నా తొలి చిత్రం. నేను బాగా నటించానని అందరూ అభినందిస్తుంటే సంతోషంగా ఉంది. నా తొలి సినిమాలోనే సుమన్, అలీ, జీవా, భూపాల్ వంటి సీనియర్స్‌తో నటించడం హ్యాపీ'' అన్నారు. ''మా చిత్రానికి నేటి నుంచి థియేటర్స్ సంఖ్యను పెంచుతున్నాం'' అన్నారు జీవీవీ గిరి.



యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి



ఐపీఎల్‌కు విలియమ్సన్ దూరం

న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ జట్టు ప్లేయర్ కేన్ విలియమ్సన్ మోకాలి గాయంతో ఐపీఎల్ 2023 టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. ఈ విషయాన్ని డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 13వ ఓవర్లో బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో విలియమ్సన్ కుడి మోకాలికి గాయమైంది. గత ఏడాది వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన 32 ఏళ్ల విలియమ్సన్ ఈ సీజన్‌లో తొలిసారి గుజరాత్ తరఫున బరిలోకి దిగాడు.

హారిక తొలి విజయం

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి విజయం నమోదు చేసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి హారిక 47 ఎత్తుల్లో నినో బత్సియాష్‌విలి (జార్జియా)పై నెగ్గింది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ వైశాలి మూడో ఓటమి చవిచూసింది. షువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 43 ఎత్తుల్లో ఓడింది.



సన్‌రైజర్స్ ఢమాల్...

ఒక్క మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన లేదు. గెలిపించే భాగస్వామ్యమే రాలేదు. టాప్–5లో ఒక్కరూ కనీసం ఒక్క సిక్స్ అయినా కొట్టలేదు. ఇలాంటి ఆటతో ఐపీఎల్ మ్యాచ్ గెలవాలని ఏ జట్టయినా కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఆదివారం ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఇలాగే ఉంది. ముందుగా నియంత్రణ లేని బౌలింగ్‌తో రెండొందలకు పైగా పరుగులు ఇచ్చిన జట్టు ఆ తర్వాత బ్యాటింగ్‌లో పూర్తిగా చేతులెత్తేసింది. తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోయిన తర్వాత ఇక కోలుకునే అవకాశమే లేకపోయింది. ఫలితమే సొంత గడ్డపై భారీ ఓటమి. అన్ని రంగాల్లో రాణించిన రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయంతో తమ సీజన్ ప్రస్థానాన్ని మొదలు పెట్టింది.

- తొలి మ్యాచ్‌లో పేలవ ప్రదర్శన
- 72 పరుగుల తేడాతో ఓటమి
- రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం
- మెరిసిన సామ్సన్, బట్లర్, యశస్వి



చహల్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్ బౌల్డ్

సాక్షి, హైదరాబాద్: కొత్త ఐపీఎల్ సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ చెత్తగా ప్రారంభించింది. సొంత గడ్డపై జరిగిన తొలి పోరులో పేలవ ప్రదర్శనతో ఓటమిని మూటగట్టుకుంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ 72 పరుగుల తేడాతో సన్‌రైజర్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. జట్టులో టాప్–3 ఆటగాళ్లు అర్ధ సెంచరీలు సాధించడం విశేషం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోస్ బట్లర్ (22 బంతుల్లో 54; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ సంజూ సామ్సన్ (32 బంతుల్లో 55; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (37 బంతుల్లో 54; 9 ఫోర్లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 131 పరుగులు చేసి ఓడిపోయింది. అబ్దుల్ సమద్ (32 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్తాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ చహల్ (4/17) ఆకట్టుకున్నాడు.

ఓపెనర్ల జోరు...

పవర్‌ప్లేలో ఇద్దరు రాజస్తాన్ ఓపెనర్లు యశస్వి, బట్లర్ విధ్వంసం సృష్టించారు. సన్‌రైజర్స్ తాత్కాలిక కెప్టెన్ భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లో 6 పరుగులే వచ్చినా... ఆ తర్వాతి ఐదు ఓవర్లలో రాయల్స్ వరుసగా 14, 17, 19, 17, 12 పరుగులు రాబట్టింది. భువీ ఓవర్లో యశస్వి రెండు ఫోర్లు, బట్లర్ సిక్స్ కొట్టగా... వాషింగ్టన్ సుందర్ ఓవర్లో వరుస బంతుల్లో బట్లర్ రెండు సిక్స్‌లు బాదాడు. ఆపై నటరాజన్ ఓవర్లో బట్లర్ 4 ఫోర్లుతో చెలరేగాడు. ఫజల్ ఓవర్లో కూడా 3 ఫోర్లు కొట్టి 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న బట్లర్ అదే ఓవర్లో వెనుదిరిగాడు. దాంతో 85 పరుగుల (35 బంతుల్లో) తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. 7.4 ఓవర్లలో రాజస్తాన్ స్కోరు 100 పరుగులకు చేరింది. ఈ దశలో రాయల్స్ ఇన్నింగ్స్ బాధ్యతను కెప్టెన్ సామ్సన్ తీసుకున్నాడు. సామ్సన్ తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించగా, మరోవైపు 34 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ పూర్తయింది. ఉమ్రాన్ తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన సామ్సన్, అతని తర్వాతి మరో ఫోర్, సిక్స్ బాదాడు. తక్కువ వ్యవధిలో రాజస్తాన్ జట్టు యశస్వి, దేవదత్ పడిక్కల్ (2), రియాన్ పరాగ్ (7) వికెట్లను కోల్పోగా, 28 బంతుల్లో సామ్సన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో 7–15 మధ్య తొమ్మిది ఓవర్లలో రాజస్తాన్ 75 పరుగులు చేసింది.



యశస్వి జైస్వాల్



సామ్సన్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఆపై డెత్ ఓవర్లలో కూడా స్కోరును పెంచుకోవడంలో రాయల్స్ విఫలమైంది. మరోసారి హైదరాబాద్ బౌలర్లు చక్కటి బంతులతో ప్రత్యర్థిని నిరోధించగలిగారు. ఆఖరి ఐదు ఓవర్లలో సామ్సన్ వికెట్ కోల్పోయి రాజస్తాన్ 43 పరుగులే సాధించగలిగింది. భారీ ఓపెనింగ్ భాగస్వామ్యం కారణంగానే ఆ జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

సమష్టి వైఫల్యం...

భారీ లక్ష్య ఛేదనలో రైజర్స్‌కు ఆరంభంలోనే దెబ్బ పడింది. బౌల్ట్ వేసిన తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (0), రాహుల్ త్రిపాఠి (0) వెనుదిరిగారు. పేలవ ప్రదర్శన కారణంగా పవర్‌ప్లేను హైదరాబాద్ 30 పరుగులతోనే ముగించింది. ఘనమైన రికార్డులు, ఎన్నో అంచనాలతో తొలిసారి ఐపీఎల్‌లో అడుగు పెట్టిన ఇంగ్లండ్ హిట్టర్ హ్యారీ బ్రూక్ (21 బంతుల్లో 13; 1 ఫోర్) ప్రభావం చూపలేకపోయాడు. యజువేంద్ర చహల్ బౌలింగ్‌లో బ్రూక్ బౌల్డయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ (8) కూడా విఫలం కావడంతో 48 పరుగుల వద్ద హైదరాబాద్ సగం టీమ్ డగౌట్ చేరింది. తప్పనిసరి పరిస్థితుల్లో ధాటిగా ఆడే ప్రయత్నంలో మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 27; 3 ఫోర్లు) అవుట్ కావడంతో సన్‌రైజర్స్ గెలుపు ఆశలు కోల్పోయింది. చివర్లో సమద్ కొన్ని మెరుపులు మెరిపించినా అప్పటికే బాగా ఆలస్యమైపోయింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు ఓవర్లలో సమద్ 2 ఫోర్లు, 1 సిక్స్ కొట్టగా, ఉమ్రాన్ (19 నాటౌట్) 2 సిక్స్‌లు, ఒక ఫోర్ బాదాడు. సన్‌రైజర్స్ తన తదుపరి మ్యాచ్‌ను శుక్రవారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో ఆడుతుంది.



చహల్, సైనీ, అశ్విన్



బట్లర్

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మయాంక్ (బి) ఫజల్ 54; బట్లర్ (బి) ఫజల్ 54; సామ్సన్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 55; పడిక్కల్ (బి) ఉమ్రాన్ 2; పరాగ్ (సి) ఫజల్ (బి) నటరాజన్ 7; హెట్‌మైర్ (నాటౌట్) 22; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 203. వికెట్ల పతనం:** 1–85, 2–139, 3–151, 4–170, 5–187. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–36–0, ఫజల్ హఖ్ 4–0–41–2, సుందర్ 3–0–32–0, నటరాజన్ 3–0–23–2, ఆదిల్ రషీద్ 4–0–33–0, ఉమ్రాన్ 3–0–32–1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) బౌల్ట్ 0; మయాంక్ (సి) బట్లర్ (బి) చహల్ 27; త్రిపాఠి (సి) హోల్డర్ (బి) బౌల్ట్ 0; హ్యారీ బ్రూక్ (సి) చహల్ 13; సుందర్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 1; ఫిలిప్స్ (సి) ఆసిఫ్ (బి) అశ్విన్ 8; సమద్ (నాటౌట్) 32; రషీద్ (స్టంప్డ్) సామ్సన్ (బి) చహల్ 18; భువనేశ్వర్ (బి) చహల్ 6; ఉమ్రాన్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1–0, 2–0, 3–34, 4–39, 5–48, 6–52, 7–81, 8–95. **బౌలింగ్:** బౌల్ట్ 4–1–21–2, ఆసిఫ్ 3–0–15–0, హోల్డర్ 3–0–16–1, అశ్విన్ 4–0–27–1, చహల్ 4–0–17–4, నవదీప్ సైనీ 2–0–34–0.

సింధుకు నిరాశ

- స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా భారత స్టార్
- ఫైనల్లో ఇండోనేసియా ప్లేయర్ మరిస్కా చేతిలో ఓటమి



మాడ్రిడ్: ఈ ఏడాది ఫైనల్ చేరిన తొలి టోర్నీలో విజేతగా నిలిచి తొలి టైటిల్ సాధించాలని ఆశించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీలో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా తున్‌జుంగ్ (ఇండోనేసియా) కేవలం 29 నిమిషాల్లో 21–8, 21–8తో సింధును ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. గతంలో సింధుతో ఆడిన ఏడుసార్లూ ఓడిపోయిన మరిస్కా ఎనిమిదో ప్రయత్నంలో తొలిసారి గెలుపొందడం విశేషం. ఫైనల్లో సింధు ఏదశలోనూ మరిస్కాకు పోటీనివ్వలేకపోయింది. విన్నర్ మరిస్కాకు 15,750 డాలర్లు (రూ. 12 లక్షల 93 వేలు), రన్నరప్ సింధుకు 7,980 డాలర్లు (రూ. 6 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

విజేత వెర్‌స్టాపెన్

ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి



మెల్‌బోర్న్: తన కెరీర్‌లో లోటుగా ఉన్న ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో ఏడో ప్రయత్నంలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన సీజన్ మూడో రేసులో వెర్‌స్టాపెన్ 'పోల్ పొజిషన్'తో బరిలోకి దిగాడు. మూడుసార్లు ట్రాక్‌పై ఆయా జట్ల డ్రైవర్ల కార్లు అదుపు తప్పడం లేదా ఢీ కొట్టుకోవడంతో రేసుకు మూడుసార్లు అంతరాయం కలిగింది. చివరకు వెర్‌స్టాపెన్ నిర్ణీత 58 ల్యాప్‌లను 2 గంటల 32 నిమిషాల 38.371 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రేసును ప్రారంభించిన 20 మంది డ్రైవర్లలో 12 మంది మాత్రమే గమ్యానికి చేరారు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది రెండో విజయం. హామిల్టన్ (మెర్సిడెస్) రెండో స్థానంలో, ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని నాలుగో రేసు అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 30న జరుగుతుంది.

'సూపర్ ఓవర్'లో శ్రీలంక విజయం



అసలంక

ఆక్లాండ్: న్యూజిలాండ్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో శ్రీలంక 'సూపర్ ఓవర్'లో గెలిచింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. అసలంక (41 బంతుల్లో 67; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), కుశాల్ పెరీరా (45 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. అనంతరం న్యూజిలాండ్ కూడా 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. శ్రీలంక కెప్టెన్ షనక వేసిన 20వ ఓవర్ చివరి బంతికి కివీస్ బ్యాటర్ ఇష్ సోధి సిక్స్ కొట్టడంతో స్కోరు సమమైంది. ముందుగా 'సూపర్ ఓవర్' ఆడిన న్యూజిలాండ్ 2 వికెట్లకు 8 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంక 3 బంతుల్లో 11 పరుగులు చేసి గెలిచింది.

మార్‌క్రమ్ 175

రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలుపు



జొహన్నెస్‌బర్గ్: నెదర్లాండ్స్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 146 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2–0తో దక్కించుకుంది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 370 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (126 బంతుల్లో 175; 17 ఫోర్లు, 7 సిక్స్‌లు) వన్డేల్లో తన తొలి సెంచరీ సాధించాడు. డేవిడ్ మిల్లర్ (61 బంతుల్లో 91; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీని చేజార్చుకున్నాడు. నెదర్లాండ్స్ 39.1 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా పేసర్ మగాలా 43 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు.

బెంగళూరు బోణీ

- ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్లతో విజయం
- కోహ్లి, డు ప్లెసిస్ ధనాధన్ ఇన్నింగ్స్
- తిలక్ వర్మ మెరుపులు వృథా

బెంగళూరు: అందని ద్రాక్షగా ఉన్న ఐపీఎల్ టైటిల్‌ను ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఫాఫ్ డు ప్లెసిస్ నాయకత్వంలోని బెంగళూరు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. హైదరాబాద్ యువ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ (46 బంతుల్లో 84 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. తిలక్ వర్మ పుణ్యమాని ముంబై గౌరవప్రద స్కోరు సాధించగలిగింది. అనంతరం బెంగళూరు జట్టు ఆరంభం నుంచే దూకుడుగా ఆడి కేవలం 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 172 పరుగులు సాధించి గెలుపొందింది. ఓపెనర్లు విరాట్ కోహ్లి (49 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డు ప్లెసిస్ (43 బంతుల్లో 73; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) ముంబై బౌలర్ల భరతం పట్టారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 14.5 ఓవర్లలో 148 పరుగులు జోడించారు. డు ప్లెసిస్ అవుటయ్యాక వచ్చిన దినేశ్ కార్తీక్ ఖాతా తెరువకుండానే పెవిలియన్ చేరగా... మ్యాక్స్‌వెల్ (3 బంతుల్లో 12 నాటౌట్; 2 సిక్స్‌లు), కోహ్లి బెంగళూరును లక్ష్యానికి చేర్చారు.

టాపార్డర్ విఫలం...

గత సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన ముంబై ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఆశించిన ఆరంభం దక్కలేదు. పవర్‌ప్లే లోపే ముంబై మూడు కీలక వికెట్లను కోల్పోయింది. ఆదుకుంటాడనుకున్న సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 15; 1 ఫోర్) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. దాంతో ముంబై 48 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ, నేహల్ వధేరా కలిసి ముంబైను ఆదుకున్నారు. ముఖ్యంగా తిలక్ వర్మ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. 32 బంతుల్లో తిలక్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఒకవైపు ముంబై వికెట్లను కోల్పోతున్నా మరోవైపు తిలక్ తన జోరు కొనసాగించడంతో ముంబై జట్టుకు గౌరవప్రద స్కోరు సాధ్యమైంది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి, డు ప్లెసిస్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు ముంబై బౌలర్లపై తొలి బంతి నుంచే విరుచుకుపడ్డారు. దాంతో బెంగళూరు లక్ష్యం దిశగా సాగిపోయింది. అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో డు ప్లెసిస్.. గ్రీన్ బౌలింగ్‌లో దినేశ్ కార్తీక్ వెంటవెంటనే అవుటైనా... కోహ్లి, మ్యాక్స్‌వెల్ మిగతా పనిని పూర్తి చేశారు.



డు ప్లెసిస్



తిలక్ వర్మ



కోహ్లి

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) దినేశ్ కార్తీక్ (బి) ఆకాశ్‌దీప్ 1; ఇషాన్ కిషన్ (సి) హర్షల్ పటేల్ (బి) సిరాజ్ 10, గ్రీన్ (బి) టాప్లే 5; సూర్యకుమార్ యాదవ్ (సి) షహబాజ్ (బి) బ్రేస్‌వెల్ 15; తిలక్ వర్మ (నాటౌట్) 84; నేహల్ వధేరా (సి) కోహ్లి (బి) కరణ్ శర్మ 21; టిమ్ డేవిడ్ (బి) కరణ్ శర్మ 4; హృతిక్ షోకీన్ (సి) డు ప్లెసిస్ (బి) హర్షల్ పటేల్ 5; అర్షద్ ఖాన్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1–11, 2–16, 3–20, 4–48, 5–98, 6–105, 7–123. **బౌలింగ్:** సిరాజ్ 4–0–21–1, రీస్ టాప్లే 2–0–14–1, ఆకాశ్‌దీప్ 3–0–29–1, హర్షల్ పటేల్ 4–0–43–1, కరణ్ శర్మ 4–0–32–2, బ్రేస్‌వెల్ 2–0–16–1, మ్యాక్స్‌వెల్ 1–0–16–0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: విరాట్ కోహ్లి (నాటౌట్) 82; డు ప్లెసిస్ (సి) టిమ్ డేవిడ్ (బి) అర్షద్ ఖాన్ 73; దినేశ్ కార్తీక్ (సి) తిలక్ వర్మ (బి) గ్రీన్ 0; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (16.2 ఓవర్లలో రెండు వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1–148, 2–149. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3–0–37–0, అర్షద్ ఖాన్ 2.2–0–28–1, జోఫ్రా ఆర్చర్ 4–0–33–0, పియూష్ చావ్లా 4–0–26–0, కామెరాన్ గ్రీన్ 2–0–30–1, హృతిక్ షోకీన్ 1–0–17–0.

క్రికెటర్ సలీమ్ దురానీ కన్నుమూత



న్యూఢిల్లీ: సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో దూకుడైన ఆటకు మారుపేరుగా నిలిచిన అలనాటి మేటి భారత క్రికెటర్ సలీమ్ దురానీ ఆదివారం కన్ను మూశారు. 88 ఏళ్ల సలీమ్ దురానీ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో తన సోదరుడు జహంగీర్ దురానీ ఇంట్లో నివస్తున్నారు. సలీమ్ 1934లో డిసెంబర్ 11న అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో జన్మించారు. భారత్ తరఫున 29 టెస్టులు ఆడిన దురానీ 1,202 పరుగులు సాధించడంతోపాటు 75 వికెట్లు పడగొట్టారు. దురానీ ఒక సెంచరీతోపాటు ఏడు అర్ధ సెంచరీలు చేశారు. మైదానంలోని ప్రేక్షకులు సిక్స్ కొట్టాలి అని డిమాండ్ చేస్తే ఆ దిశగానే దురానీ సిక్స్‌లు కొట్టి అభిమానులను అలరించేవారు. 1971లో వెస్టిండీస్ గడ్డపై ఐదు టెస్టుల సిరీస్‌ను 1–0తో నెగ్గిన భారత జట్టులో దురానీ కీలక సభ్యుడిగా వ్యవహరించారు. భారత్ నెగ్గిన టెస్టులో దురానీ విండీస్ స్టార్స్ క్లయివ్ లాయిడ్, గ్యారీ సోబర్స్‌లను అవుట్ చేశారు. 1973లో చివరి టెస్టు ఆడిన దురానీ ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో కొనసాగారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు' అందుకున్న తొలి భారత క్రికెటర్‌గా ఘనత వహించిన దురానీ దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్, రాజస్తాన్, సౌరాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించారు. మొత్తం 170 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయన 14 సెంచరీలు, 45 అర్ధ సెంచరీలతో కలిపి 8545 పరుగులు చేసి, 484 వికెట్లు పడగొట్టారు. సలీమ్ దురానీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు బీసీసీఐ కార్యదర్శి జై షా, భారత దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, రవిశాస్త్రి, అనిల్ కుంబ్లే తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

13వ ప్రయత్నంలో సఫలం

మయామి ఓపెన్ విజేత క్విటోవా • రూ. 10 కోట్ల 36 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



క్విటోవా

ఫ్లోరిడా: ఎట్టకేలకు చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ పెట్రా క్విటోవా నిరీక్షణ ముగిసింది. ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 ప్రీమియర్ టోర్నమెంట్‌లో 33 ఏళ్ల క్విటోవా తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. గతంలో 12 సార్లు ఈ టోర్నీలో పాల్గొని ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయిన క్విటోవా 13వ ప్రయత్నంలో ఏకంగా టైటిల్ సాధించడం విశేషం. ప్రపంచ ఏడో ర్యాంకర్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్)తో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ క్విటోవా గంటా 42 నిమిషాల్లో 7–6 (16/14), 6–2తో విజయం సాధించింది. క్విటోవా కెరీర్‌లో ఇది 30వ సింగిల్స్ టైటిల్‌కాగా, డబ్ల్యూటీఏ–1000 విభాగంలో తొమ్మిదోది. ఈ గెలుపుతో క్విటోవా 2021 సెప్టెంబర్ తర్వాత మళ్లీ ప్రపంచ టాప్–10 ర్యాంకింగ్స్‌లోకి రానుంది. రెండు వారాల క్రితం ఇండియన్ వెల్స్ ఓపెన్ డబ్ల్యూటీఏ–1000 టోర్నీలో విజేతగా నిలిచి సూపర్ ఫామ్‌లో ఉన్న రిబాకినా ఫైనల్లో తొలి సెట్‌లో గట్టిపోటీ ఇచ్చింది. చివరకు 22 నిమిషాలపాటు జరిగిన టైబ్రేక్‌లో క్విటోవా పైచేయి సాధించి తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో క్విటోవా దూకుడుకు రిబాకినా చేతులెత్తేసింది. కేవలం రెండు గేమ్‌లు మాత్రమే ఆమె గెల్చుకుంది. విజేతగా నిలిచిన క్విటోవాకు 12,62,220 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 10 కోట్ల 36 లక్షలు), రన్నరప్ రిబాకినాకు 6,62,360 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 5 కోట్ల 43 లక్షలు) లభించాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,031	58,992
నిఫ్టీ ▲	279	17,360

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	12,222	▲	208
డోజోన్స్	33,274	▲	415
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,632	▲	11
డాక్స్	15,629	▲	106
షాంఘై	3,273	▲	12
నికాయ్	28,041	▲	259

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

పన్ను శూన్యం.. ఆదాయం అదనం

- పన్ను ఆదా చేసే పెట్టుబడి సాధనాలు
- పీపీఎఫ్, ఈపీఎఫ్, సుకన్య సమృద్ధిపై పన్ను సున్నా
- బీమా పాలసీలకూ ఇదే ప్రయోజనం
- ఈఎల్ఎస్ఎస్‌పైనా పన్ను లేకుండా చేసుకోవచ్చు
- కొన్ని షరతులు పాటిస్తే చాలు..

ఆదాయపన్ను ఆదాచేసే పెట్టుబడి సాధనాలకు మంచి డిమాండ్ ఉంది. మధ్యాదాయ వర్గాల వారికి పాత పన్ను విధానమే మెరుగైనది. అందులో పన్ను ఆదా, మినహాయింపునిచ్చే సెక్షన్లు చాలానే ఉన్నాయి. పన్ను ఆదా కోసం ఈ తరహా సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే వారు చాలా మంది ఉన్నారు. ఆర్థిక సంవత్సరం చివర్లో కాకుండా ఆరంభం నుంచే ఈ సాధనాల్లో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడం వల్ల చివర్లో ఏకమొత్తంలో సమకూర్చుకోవాల్సిన ఇబ్బంది తప్పుతుంది. అయితే, పన్ను ఆదా సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే ముందు లాభ, నష్టాల గురించి పూర్తిగా విచారించుకోవాలి. లాక్ ఇన్ పీరియడ్‌ను చూడాలి. రాబడిని చూడాలి. రిస్క్‌ను అర్థం చేసుకోవాలి. పన్ను బాధ్యత ఏ మేరకు అన్నది పరిశీలించాలి. ముందస్తు ఉపసంహరణలకు అవకాశం ఉందా? లేదా? తెలుసుకోవాలి. చాలా మంది పెట్టుబడిపై పన్ను ఆదానే చూస్తుంటారు. కానీ రాబడిపై పన్ను బాధ్యత గురించి తెలుసుకోరు. ముఖ్యంగా రిస్క్‌లేని సంప్రదాయ డెట్ సాధనాల్లో రాబడి 6–8 శాతం మించదు. కానీ, దీనిపై పన్ను చెల్లించాల్సి వస్తే.. ఇక మిగిలేది ఏముంటుంది? కనుక పెట్టుబడిపై పన్ను ఆదాయే కాదు, రాబడిపైనా పన్ను లేని సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అదనపు రాబడిని సంపాదించుకోవచ్చు. ఇలాంటి ముఖ్యమైన సాధనాల గురించి తెలియజేసే కథనమే ఇది.

2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేసే వారు పాత, కొత్త విధానాల్లో దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే కొత్త విధానంలో పన్ను ఆదా ప్రయోజనాలు పెద్దగా లేవు. స్టాండర్డ్ డిడక్షన్, ఉద్యోగి తరఫున యాజమాన్యం ఎన్‌పీఎస్ ఖాతాకు చేసే జమపైనే పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. పాత విధానంలో అయితే సెక్షన్ 80సీ, 80డీ సహా ఎన్నో సెక్షన్లు పన్ను భారాన్ని తగ్గిస్తున్నాయి. కనుక పాత, కొత్త విధానాల్లో ఒక దానిని ఎంపిక చేసుకునే ముందు తమ ఆదాయం, పెట్టుబడులు తదితర అంశాలన్నీ విశ్లేషించుకున్న తర్వాత ఎంపిక చేసుకోవాలి. పాత విధానంలో అయితే, ఇక్కడ చర్చించే సాధనాలు రిస్క్‌లేని రాబడిని, పన్ను లేని రాబడినిస్తాయి. కనుక ఇన్వెస్టర్లు వీటిని పరిశీలించొచ్చు.



పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్



పీపీఎఫ్ అన్నది ఎవరైనా ఇన్వెస్ట్ చేసుకోతగిన సాధనం. సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ మొత్తంపైనా ఎలాంటి పన్ను లేదు. అంతేకాదు ఈ సాధనానికి మూడు రకాల పన్ను మినహాయింపులు ఉన్నాయి. ఇందులో పెట్టుబడిపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ రాబడిపైనా పన్ను కట్టక్కర్లేదు. చివర్లో గడువు తీరిన తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపైనా పన్ను లేదు. భద్రత దృష్ట్యా చూస్తే.. సార్వభౌమ గ్యారంటీతో కూడిన పథకం ఇది. ప్రస్తుతం 7.1 శాతం వార్షిక రాబడి ఈ పథకంలో ఉంది. పీపీఎఫ్ అకౌంట్ కాల వ్యవధి 15 ఏళ్లు. లాకిన్ పీరియడ్ కూడా ఇంతే ఉంటుంది. ఈ పథకంలో పెట్టుబడి మొదలు పెట్టిన ఆర్థిక సంవత్సరం చివరి నుంచి 15 ఏళ్ల కాలం అమలవుతుంది. ఆరంభం నుంచి కాదు. ఖాతా ప్రారంభించిన ఆరో ఏట నుంచి రుణ సదుపాయం అమల్లో ఉంటుంది. ఖాతా ప్రారంభించిన ఏడో ఆర్థిక సంవత్సరం నుంచి పాక్షిక ఉపసంహరణకు అనుమతిస్తారు. ఇందుకు కొన్ని షరతులు అమలవుతాయి. పోస్టాఫీసు లేదా బ్యాంక్‌లో ప్రారంభించుకోవచ్చు. పోస్ట్ ఆఫీసు అయితే అక్కడ సేవింగ్స్ ఖాతా తెరవాలని షరతు పెడుతున్నారు.

సుకన్య సమృద్ధి యోజన

భేటీ బచావో భేటీ పడావో అనే పథకం కింద సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని కేంద్ర సర్కారు తీసుకొచ్చింది. కుమార్తెలకు సంబంధించిన డిపాజిట్ పథకం ఇది. ఆడపిల్ల విద్య లేదా వివాహం అవసరాల కోసం తల్లిదండ్రులు ఆమె పేరిట ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇలా ఒక్కరు ఇద్దరు కుమార్తెల పేరిటే ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోగలరు. ఇద్దరికి మించి కుమార్తెలు ఉంటే, వారి పేరిట ఇన్వెస్ట్‌మెంట్‌కు అవకాశం ఉండదు. పీపీఎఫ్ మాదిరే ఇందులోనూ పెట్టుబడిపై పన్ను లేదు. రాబడి, చివరిలో అందుకునే మొత్తంపై పన్ను ఉండదు. పన్ను లేని, మెరుగైన రాబడితో కూడిన డెట్ సాధనం ఇది. కేంద్ర ప్రభుత్వం గ్యారంటీతో వస్తుంది కనుక భద్రత పరంగా సందేహం అక్కర్లేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను సవరిస్తుంటుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రేటు 8 శాతం. బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే ఇందులోనే రాబడి కాస్తంత ఎక్కువగా ఉంటుంది. ఈ పథకంలో పెట్టుబడులకు 21 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ముందస్తు ఉపసంహరణలను కొన్ని షరతుల మేరకు అనుమతిస్తారు. కుమార్తెల వయసు 10 ఏళ్లు మించకుండా ఉంటే, వారిపైనే ఈ పథకం కింద ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవడానికి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో కనిష్ఠంగా రూ.250, గరిష్ఠంగా రూ.1.5 లక్షలను ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కుమార్తె వయసు 18 ఏళ్లు వచ్చే వరకు తల్లిదండ్రి లేదా సంరక్షకుడు ఖాతాను నిర్వహించొచ్చు. బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఈ ఖాతా తెరుచుకోవచ్చు.





ఉద్యోగుల భవిష్య నిధి, స్వచ్ఛంద భవిష్య నిధి

సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులు ఈపీఎఫ్ కిందకు వస్తారు. వేతనం నుంచి 12 శాతాన్ని ఈపీఎఫ్ ఖాతాకు ప్రతి నెలా జమ చేయాల్సి ఉంటుంది. పని చేయించుకునే సంస్థ కూడా ఉద్యోగి తరఫున అంతే మొత్తాన్ని జమ చేస్తుంది. ఉద్యోగులు తన వంతుగా జమ చేసే మొత్తంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్ నిధికి 12 శాతానికి మించి జమ చేసుకోవాలంటే అందుకు వీలు కల్పించేదే స్వచ్ఛంద భవిష్య నిధి (వీపీఎఫ్). ఈపీఎఫ్ నిబంధనలు వీపీఎఫ్‌కు సైతం వర్తిస్తాయి. ఈపీఎఫ్ వడ్డీ రేటే వీపీఎఫ్ జమలపైనా అమలవుతుంది. ఈపీఎఫ్ పథకాన్ని కేంద్ర సర్కారు నిర్వహిస్తోంది. కనుక నూరు శాతం భద్రత ఉంటుంది. గడిచిన ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్‌పై 8.1 శాతం వడ్డీ రేటు అమలు చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పథకం రిటైర్మెంట్ వరకు కొనసాగుతుంది. ముందస్తు ఉపసంహరణలు చేసుకోవచ్చు. ఉన్నత విద్య, వివాహం, వైద్య చికిత్సల కోసం ఈపీఎఫ్ బ్యాలెన్స్‌ను ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన పథకాల మాదిరే ఈపీఎఫ్‌పైనా పన్ను లేదు. కాకపోతే ఒక ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్, వీపీఎఫ్‌కు ఉద్యోగి చేసే జమ రూ.2.5 లక్షలు మించినప్పుడు.. అంతకుమించి చేసే జమలపై వచ్చే వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2.5 లక్షలకు మించి జమ చేసే వారు 5 శాతం మంది కూడా ఉండరు. వీపీఎఫ్, ఈపీఎఫ్ రెండు కలసి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల పరిమితిపైనే పన్ను ఆదా పరిమితం.



జీవిత బీమా పాలసీలు

సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ప్రయోజనం కలిగిన సాధనాల్లో జీవిత బీమా సాధనాలు కూడా ఉన్నాయి. టర్మ్ పాలసీలు, ఎండోమెంట్ పాలసీలు, యూనిట్ లింక్డ్ పాలసీల (యులిప్‌లు)కు ఏటా చెల్లించే ప్రీమియం మొత్తాన్ని సెక్షన్ 80సీ కింద చూపించుకోవచ్చు. జీవిత బీమాను పెట్టుబడి కోణంలో చూడొద్దు. కుటుంబానికి రక్షణ సాధనంగానే చూడాలి. అలా చూసినప్పుడు అసలైన బీమా ప్లాన్ అంటే టర్మ్ ప్లాన్ అనే చెప్పుకోవాలి. తక్కువ ప్రీమియంకే ఎక్కువ రక్షణ కవరేజీ లభిస్తుంది. పాలసీదారుడికి ఏదైనా జరిగితే కుటుంబం ఆర్థిక ఇబ్బందుల పాలు కాకుండా ఉంటుంది. గడువు తీరే వరకు జీవించి ఉంటే చివర్లో ఏమీ తిరిగి రాదు. అందుకే చాలా మంది దీని పట్ల విముఖత చూపిస్తుంటారు. దీనికి బదులు చివర్లో ఎంతో కొంత చెల్లింపులు చేసే ఎండోమెంట్ ప్లాన్ల వైపు వెళుతుంటారు. సంప్రదాయ పాలసీల్లో 20 ఏళ్లకు మించి కాలంపై రాబడి 4–6 శాతం మించదని గుర్తుంచుకోవాలి. యులిప్ ప్లాన్లు బీమా రక్షణ, పెట్టుబడితో కూడినవి. వీటిల్లోనూ ప్రీమియం అధికంగానే ఉంటుంది. యులిప్ ప్లాన్లలో పెట్టుబడులను ఈక్విటీ లేదా డెట్, లేదా ఈక్విటీ డెట్ కలసినవి ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ నుంచి డెట్‌కు, డెట్ నుంచి ఈక్విటీకి ఎలాంటి చార్జీల్లేకుండా మార్చుకోవచ్చు. గడువు తీరిన తర్వాత చివర్లో వచ్చే మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. యులిప్ ప్లాన్ల ప్రీమియం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2.5 లక్షలకు మించకుండా చూసుకుంటే మెచ్యూరిటీపై పన్ను పడదు. యులిప్‌లలో ఉన్న మరో ప్రతికూలత ఇవి చాలా తక్కువ టర్మ్‌తో వస్తుంటాయి. యులిప్ ప్లాన్లలోనూ రాబడులకు హామీ ఉండదు. అంచనా రాబడినే బీమా సంస్థలు వెల్లడిస్తాయి. ఇక సంప్రదాయ బీమా పాలసీలు (జీవించి ఉంటే మెచ్యూరిటీ చెల్లించేది) తీసుకునే వారు వార్షిక ప్రీమియం రూ.5 లక్షలు మించకుండా చూసుకోవాలి. అప్పుడే చివర్లో చేతికొచ్చే మొత్తం పన్ను రహితం. ఈ నిబంధన 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.




ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ పథకాలు



ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ పథకాలలో చేసే పెట్టుబడులపై పన్ను మినహాయింపు ఉంది. పైన చెప్పుకున్న వాటికి ఇది భిన్నం. సెక్షన్ 80సీ కింద గరిష్ఠంగా ఈ పథకాల్లో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఆ మొత్తంపై మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ పథకాలు పూర్తిగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక రిస్క్ ఉంటుంది. రాబడులు పన్ను పరిధిలోకి వస్తాయి. రాబడులపై హామీ ఉండదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా లాభ, నష్టాలు ఏవైనా రావచ్చు. కాకపోతే ఈక్విటీల్లో ఐదేళ్లకు మించిన కాలానికి నికరంగా రాబడులే వస్తాయని చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో పెట్టుబడులపై మూడేళ్ల లాకిన్ పీరియడ్ అమలవుతుంది. పన్ను ఆదా సాధనాల్లో తక్కువ లాకిన్ ఉన్నది ఇదే. ఈఎల్ఎస్ఎస్ నుంచి మూడేళ్లు నిండకుండా పెట్టుబడులు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. మూడేళ్ల లాకిన్ పీరియడ్‌లో ఈ పథకం నుంచి ఆదాయం రావాలని కోరుకుంటే, గ్రోత్ ఆప్షన్‌కు బదులు డివిడెండ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. దాంతో ఫండ్ డివిడెండ్ ప్రకటించిన ప్రతీ సందర్భంలోనూ ఇన్వెస్టర్‌కు ఎంతో కొంత ఆదాయం వస్తుంది. కాకపోతే డివిడెండ్ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలిపి, పన్ను వర్తించే ఆదాయం ఉన్నప్పుడే చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఏడాదికి మించిన కాలంపై వచ్చే లాభాన్ని దీర్ఘకాలిక మూలధన లాభంగా పరిగణిస్తారు. ఈఎల్ఎస్ఎస్ పథకాలు మూడేళ్ల లాకిన్‌తో ఉంటాయి కనుక.. ఇందులో వచ్చే రాబడులు దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.లక్ష వరకు ఉంటే ఎలాంటి పన్ను లేదు. ఈ పరిమితికి మించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాలి. అందుకే ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో గ్రోత్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకుని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందాలి. మూడేళ్లు నిండిన తర్వాత నుంచి ఏటా రూ.లక్ష లాభం మించకుండా ఉపసంహరించుకుని, తిరిగి ఆ మొత్తాన్ని మరొక ఈఎల్ఎస్ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. దీనివల్ల లాభంపై పన్ను పడదు. దీర్ఘకాలంలో మంచి నిధి జమవుతుంది.

మారుతీ సుజుకీ వాహనాల ధరల పెంపు

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ తన వాహన ధరలను పెంచింది. ఏప్రిల్ 1 నుంచి పెంచిన ధరలు అమల్లోకి వచ్చినట్లు ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. మోడళ్లలో సగటు ధర పెరుగుదల దాదాపు 0.8 శాతంగా (ఢిల్లీలో మోడళ్ల ఎక్స్ షోరూమ్) ఉంది. ద్రవ్యోల్బణం నియంత్రణ విధానాల కారణంగా సంస్థపై వ్యయ ఒత్తిడి ఉన్నట్లు తెలిపింది. ఇప్పటికే హోండా కార్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్‌తో సహా పలు వాహన తయారీదారీ కంపెనీలు ఏప్రిల్ నుండి ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఉద్గారాల స్థాయిలను పర్యవేక్షించడానికి వాహనాలు ఆన్-బోర్డ్ స్వీయ-నిర్ధారణ పరికరాన్ని వినియోగించాలన్న నిబంధన ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రావడం గమనార్హం.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
3-4-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
2-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

రిటర్న్స్‌లో ఫండ్స్ లాభాలు చూపాలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష లోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదు. అయినా ఈ లాభాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించాలా – వివేక్

మీరు పన్ను రిటర్నులను నిబంధనల ప్రకారం దాఖలు చేయాల్సి ఉంటే, అందులో లాభ, నష్టాలను వెల్లడించాలి. స్టాక్స్, లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను ఏడాదికి మించి కొనసాగించినప్పుడు వచ్చేవి దీర్ఘకాల లాభాలు. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాలి. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లో మూలధన లాభాల పన్ను వివరాలు ఉంటే, అవి పన్ను రిటర్నుల్లో ముందుగానే నింపి ఉంటాయి. ఒకవేళ మీ ఆదాయం బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటే, అప్పుడు మీరు రిటర్నులు దాఖలు చేయక్కర్లేదు. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకు పన్ను లేదు. 60 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.3 లక్షలు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలుగా ఉంది. మరింత వివరంగా అర్థం చేసుకునేందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం. వార్షిక ఆదాయం రూ.5లక్షల్లోపు ఉంటే సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ పొందొచ్చు. అప్పుడు పన్ను చెల్లించక్కర్లేదు. ఒకవేళ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు దాటిందని అనుకుంటే, అప్పుడు రిబేట్ వర్తించదు. అప్పుడు సాధారణ శ్లాబు రేటు ప్రకారం పన్ను వర్తిస్తుంది. అలాగే, పన్ను వర్తించే ఆదాయం ఉంది కనుక రూ.లక్షకు మించిన దీర్ఘకాల మూలధన లాభంపై 10 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. ఒకవేళ మీ వార్షిక ఆదాయం బేసిక్ పరిమితి లోపే, రూ.2 లక్షలుగానే ఉందని అనుకుందాం. అప్పుడు దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష మించినప్పుడు.. రూ.50వేల మొత్తాన్ని బేసిక్ పరిమితి కింద మిగిలి ఉంది కనుక చూపించుకోవచ్చు. అన్ని కేసుల్లోనూ దీర్ఘకాల మూలధన లాభాల వివరాలను రిటర్నుల్లో చూపించాల్సిందే.

ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్స్‌కు ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం) ప్రయోజనాన్ని తొలగించారని తెలిసింది. నూతన చట్టం అమలుపై స్పష్టత ఇవ్వగలరా? – గణేశ్

ఈ ఏడాది మార్చి 31 వరకు చేసే పెట్టుబడులకు లాభాల్లో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించే ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నాన్ ఈక్విటీ ఫండ్స్ పన్ను నిబంధనల్లో మార్పులు చేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించింది. దీంతో ఎంత కాలం పాటు పెట్టుబడులు కొనసాగించారనే దానితో సంబంధం లేకుండా.. డెట్ ఫండ్స్‌లో వచ్చే లాభం ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారికి వర్తించే శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ నూతన నిబంధన 2023 ఏప్రిల్ 1 నుంచి చేసే పెట్టుబడులకే అమలవుతుంది. దీనికంటే ముందు చేసే పెట్టుబడులకు ఇండెక్సేషన్ ప్రయోజనం వర్తిస్తుంది.

ఐసీఐసీఐ ప్రు.. గోల్డ్ పథకం



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గోల్డ్ పేరిట వినూత్న, దీర్ఘకాలిక పొదుపు పథకాన్ని ఆవిష్కరించింది. ఇటు వృత్తి, ఉద్యోగాల ద్వారా వచ్చే ఆదాయానికి తోడు అదనపు రాబడి అందుకోవాలనుకునే వారికి అనువైనదిగా ఇది ఉంటుందని సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా తెలిపారు. ఇది జీవిత బీమా కవరేజీతో పాటు కుటుంబానికి ఆర్థిక భద్రతను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రు గోల్డ్ మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. ఇమీడియట్ ఇన్‌కమ్, ఇమీడియట్ ఇన్‌కమ్ విత్ బూస్టర్, అలాగే డిఫర్డ్ ఇన్‌కమ్ వీటిలో ఉన్నాయి. మొదటి దానిలో పాలసీ జారీ చేసిన 30 రోజుల తర్వాత నుంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఇక రెండో వేరియంట్‌లో ప్రతి ఐదో ఏటా అదనంగా గ్యారంటీడ్ ఆదాయాన్ని కూడా అందుకోవచ్చు. మూడోదైన డిఫర్డ్ ఇన్‌కమ్ వేరియంట్‌లో ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులు ఆదాయాన్ని ఎప్పటి నుంచి పొందాలనుకుంటున్నది తామే నిర్ణయించుకోవచ్చు. అంటే పాలసీ తీసుకున్న రెండో ఏడాది నుంచే లేదా 13 ఏళ్ల తర్వాత నుంచైనా ఆదాయాన్ని అందుకోవడం ప్రారంభించవచ్చు. చెల్లింపులను సాధారణంగా తీసుకోవడానికి బదులుగా సేవింగ్స్ వాలెట్‌లో జమ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. దీన్ని కావాలంటే పూర్తిగా లేదా పాక్షికంగా విత్‌డ్రా చేసుకోవచ్చు. లేదా ప్రీమియం ఆఫ్‌సెట్ సదుపాయంతో తమ భావి ప్రీమియంలను కూడా ఈ మొత్తం నుంచి చెల్లించవచ్చు.

స్టాక్స్ వ్యూ

గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ | ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 139 **టార్గెట్:** రూ. 171

ఎందుకంటే: దేశీయంగా అత్యంత వృద్ధిలో ఉన్న రియల్టీ రంగంతో లబ్ధిని పొందనున్న కంపెనీలలో గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్‌ను ప్రధానంగా పేర్కొనవచ్చు. గుజరాత్‌లోని వడోదరలో మధ్యస్థాయి సాంద్రతగల ఫైబర్‌బోర్డ్(ఎండీఎఫ్) తయారీకి 2,40,000 క్యూబిక్ బోర్డ్ మీటర్(సీబీఎం) సామర్థ్యంతో ప్లాంటును ఏర్పాటు చేసింది. ఇందుకు రూ. 540 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24) ప్లాంటులో దశలవారీగా ఉత్పత్తి పుంజుకోనుంది. ఈ నేపథ్యంలో దేశీయంగా ప్లైవుడ్ తయారీ కంపెనీలలో రెండో పెద్ద సంస్థగా గ్రీన్‌ప్లై నిలుస్తోంది. ప్లాంటు సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే రూ. 600-650 కోట్ల ఆదాయానికి అవకాశముంది. 2025కల్లా 65 శాతం సామర్థ్యాన్ని వినియోగించుకున్నా అమ్మకాలలో పటిష్ట వృద్ధికి వీలుంటుంది. తాజా విస్తరణ తదుపరి రెండేళ్ల(2023-24, 2024-25)లో కంపెనీ అమ్మకాలు 18 వార్షిక వృద్ధిని సాధించగలవని అంచనా. ఈ బాటలో వార్షిక ప్రాతిపదికన నిర్వహణ లాభం(ఇబిటా) 45 శాతం, నికర లాభం 35 శాతం చొప్పున జంప్ చేయగలవని భావిస్తున్నాం. వడోదర ప్లాంటుతో విస్తరణపై కంపెనీ ప్రధాన పెట్టుబడులు పూర్తికానున్నాయి.



ఏబీ క్యాపిటల్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 154 **టార్గెట్:** రూ. 200

ఎందుకంటే: కంపెనీకి గల వివిధ బిజినెస్‌లు, అనుబంధ సంస్థలు తదితరాల విలువలను మదింపు చేసే(ఎస్‌వోటీపీ) పద్ధతిలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ కౌంటర్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇందుకు ప్రధానంగా మూడు అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి. వీటిలో ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీలతో కూడిన లెండింగ్ బిజినెస్‌ను తొలుత ప్రస్తావించవచ్చు. విభిన్న విభాగాలు, కొనుగోళ్ల చానల్, యూనిట్ ఎకనమిక్స్ వంటి అంశాలు లెండింగ్ బిజినెస్‌కు దన్నునిస్తున్నాయి. దీంతో వార్షికంగా లోన్‌బుక్‌లో 26 శాతం వృద్ధిని సాధించింది. తద్వారా 2024–25 వరకూ లాభాల్లో 31 శాతం పురోగతిని నిలుపుకునే అవకాశముంది. ఇక నియంత్రణ సంస్థల నుంచి ఎదురవుతున్న సవాళ్లలోనూ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ నిలదొక్కుకుంటోంది. ప్రస్తుతం విభిన్న పంపిణీ చానల్‌ను నిర్మించుకుంది. పట్టణ ప్రాంతాలను దాటి వృద్ధిని విస్తరించేందుకు దృష్టిని సారించింది. వెరసి పరిశ్రమలోనే అత్యధికంగా 20 శాతం కొత్త బిజినెస్(వీఎన్‌బీ) మార్జిన్లను సాధించగలదని అంచనా. కంపెనీకిగల మరో విభాగం ఏఎంసీ బిజినెస్‌ను పోలి మార్కెట్ వాటాను నిలుపుకుంటూ నాయకత్వ స్థాయిలో కొనసాగే వీలుంది. హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్‌లోనూ వృద్ధి దశ కొనసాగనుంది. నికర లాభాల్లో 30% వార్షిక వృద్ధికి వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

కరోనా టీకా వికటించి రాష్ట్రంలో 37 మరణాలు

కేంద్ర, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ నివేదిక

సాక్షి, హైదరాబాద్: కరోనా టీకా వేసుకున్న తర్వాత దాని దుష్ప్రభావాల ఫలితంగా తెలంగాణలో 37 మంది మరణించారని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. కోవిడ్ టీకా ప్రారంభమైన 2021 జనవరి 16 నుంచి ఈ ఏడాది మార్చి 15వ తేదీ వరకు సంభవించిన మరణాలు, టీకా తర్వాత దుష్ప్రభావాలపై ఒక నివేదికను వెలువరించింది. నివేదిక ప్రకారం టీకా తర్వాత దుష్ప్రభావాల కారణంగా దేశంలో 92,479 మంది ఆసుపత్రుల పాలయ్యారు. అందులో తెలంగాణలోనే 10,370 మంది ఆసుపత్రుల్లో చేరారు. ఈ తరహా కేసుల్లో దేశంలో తెలంగాణ రెండో స్థానంలో ఉండగా, మధ్యప్రదేశ్ మొదటి స్థానంలోఉంది. ఆ రాష్ట్రంలో 10,513 ఘటనలు చోటుచేసుకున్నాయి. గుజరాత్‌లో 10,127 ఘటనలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఈ మూడు రాష్ట్రాల్లోనే పదివేలకు పైగా ఇటువంటి ఘటనలు నమోదయ్యాయి. అలాగే మహారాష్ట్రలో 8,212, పశ్చిమబెంగాల్‌లో 8,130, కర్ణాటకలో 6,628 మంది ఆసుపత్రులపాలయ్యారు. కాగా,



టీకా అనంతరం దేశంలో మొత్తం 1,156 మంది మరణించారు. అందులో అత్యధికంగా కేరళలో 244 మంది మృతి చెందారు. ఆ తర్వాత మహారాష్ట్రలో 102 మంది, ఉత్తరప్రదేశ్‌లో 86 మంది మరణించారు. మధ్యప్రదేశ్‌లో 85, కర్ణాటకలో 75, పశ్చిమ బెంగాల్‌లో 70 మంది మరణించారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో కేవలం ఒకరే మృతిచెందడం గమనార్హం.

ప్రతి 19.03 లక్షల డోసులకు ఒక మరణం..

దేశంలో ఇప్పటివరకు కోట్లాది మందికి కరోనా వ్యాక్సిన్ వేశారు. అందులో కరోనా టీకా వేసుకున్న ప్రతీ 23 వేల మందిలో ఒకరు ప్రతికూల ప్రభావాలతో ఆసుపత్రుల్లో చేరారు. తెలంగాణలో ఇప్పటివరకు 3.24 కోట్ల మంది కరోనా టీకా మొదటి డోసు వేసుకున్నారు. ఇందులో 3.15 కోట్ల మంది రెండో డోసు, అలాగే 1.35 కోట్ల మంది బూస్టర్ డోసు తీసుకున్నారు.మొత్తం మూడు డోసులు కలిపి 7.75 కోట్ల డోసుల వ్యాక్సిన్ వేశారు. కాగా, రాష్ట్రంలో టీకా తీసుకున్నవారిలో 37 మంది చనిపోయారు. ఇప్పటివరకు దేశంలో 220 కోట్ల టీకా డోసులు ఇచ్చారు. అంటే ప్రతి 19.03 లక్షల డోసులకు ఒక మరణం సంభవించింది.తెలంగాణలో ప్రతీ 20.96 లక్షల డోసులకు ఒక మరణం సంభవించింది. వీటిని దుష్ప్రభావాలతో ఆస్పత్రుల్లో చేరిన తర్వాత జరిగిన మరణాలుగానే ప్రభుత్వం ప్రకటించింది. అంతేగానీ కరోనా వ్యాక్సిన్ వల్లే నేరుగా సంభవించిన మరణాలుగా ప్రకటించలేదని నిపుణులు అంటున్నారు. కోవిడ్ వ్యాప్తితీవ్రతతో సంభవించిన మరణాలతో పోలిస్తే టీకా అనంతర మరణాలు చాలా స్వల్పమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో 8.42 లక్షల మందికి కరోనా సోకగా, అందులో 8.38 లక్షల మంది కోలుకున్నారు. కరోనా కారణంగా అధికారికంగా 4,111 మంది చనిపోయారు.

కరోనా టీకాలతో ఇప్పటివరకు దేశవ్యాప్తంగా **1,156 మరణాలు**

దేశంలో అత్యధికంగా కేరళలో **244 మంది మృతి**

ఛత్తీస్‌గఢ్‌లో కేవలం ఒకరు మృతి

దేశంలో ఇప్పటివరకు **220 కోట్ల టీకా డోసులు**

టీకా తర్వాత దుష్ప్రభావాల కారణంగా దేశంలో **92,479 మంది ఆస్పత్రిపాలు**

తెలంగాణలో ప్రతీ **20.96** లక్షల డోసులకు ఒక మరణం

ప్రతి 19.03 లక్షల డోసులకు ఒక మరణం

తెలంగాణలో **10,370 మంది ఆస్పత్రిలో చేరిక**

ఇతర వ్యాక్సిన్లతోనూ ఇలాగే మరణాలు



ఇతర వ్యాక్సిన్లతోకూడా ఇదే తీరులో మరణాలు సంభవిస్తాయి. ప్రతీ మిలియన్ వ్యాక్సిన్ డోసుల్లో ఒక మరణం సంభవిస్తుంది. కరోనా వ్యాక్సిన్ అనంతరం జరుగుతున్న మరణాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. అయితే మరే ఇతర వ్యాక్సిన్ కూడా కరోనా టీకా అంత పెద్ద ఎత్తున అన్ని వర్గాలకు వేసినట్లు లేదు. అయినా కూడా సాధారణ స్థాయిలోనే మరణాలు ఉన్నాయి. కరోనా టీకాతోనే కాకుండా ఇతరత్రా అనారోగ్య సమస్యలున్నవారు మృతిచెందితే వారిని కూడా టీకా అనంతర మరణాల జాబితాలో చేర్చే అవకాశముంది. దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–ప్రొఫెసర్ కిరణ్ మాదల,
క్రిటికల్ కేర్ విభాగాధిపతి,
నిజామాబాద్ మెడికల్ కాలేజీ

క్లుప్తంగా...

ఈచేప బంగారం



ఖానాపురం: వరంగల్ జిల్లా ఖానాపురం మండలం బుధరావుపేట శివారు పెద్దాయ చెరువులో ఆదివారం మత్స్యకారులకు బంగారు వర్ణం కలిగి ఉన్న ఏడున్నర కేజీల చేప చిక్కింది. ఈ చేపను పలువురు ఆసక్తిగా తిలకించి కొనుగోలుకు పోటీ పడ్డారు. బుధరావుపేట గ్రామానికి చెందిన గుండెగాని దీపక్ రూ.1,050 ధరకు దక్కించుకున్నాడు.

ఆస్కార్ అవార్డు చల్లగరిగదే..

- ఇక్కడి పదాలతోనే 'నాటు నాటు'పాట: చంద్రబోస్



చిట్యాల: చల్లగరిగలో చిన్నప్పుడు నేర్చుకున్న పదాలతోనే 'నాటు నాటు'పాట పుట్టింది.. దీంతో ఊరికే ఆస్కార్ అవార్డు దక్కిందని.. సినీ గేయ రచయిత కనుకుంట్ల చంద్రబోస్ అన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాకు రాసిన 'నాటు నాటు'పాటకు వచ్చిన ఆస్కార్ అవార్డు స్వీకరించిన అనంతరం సొంత ఊరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగకు ఆదివారం వచ్చిన చంద్రబోస్ దంపతులు.. స్థానిక శివాలయంలో పూజలు చేశారు. ఇంటినుంచి పాఠశాల వరకు డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లారు. చంద్రబోస్ చదివిన పాఠశాల 1969–2022 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు అతన్ని ఘనంగా సన్మానించారు. అనంతరం చంద్రబోస్ మాట్లాడుతూ గ్రంథాలయం నుంచే తనకు అక్షర బీజం పడిందని.. ఇప్పుడు శిథిలావస్థలో ఉన్న గ్రంథాలయాన్ని పునర్నిర్మిస్తానని చెప్పారు. గ్రామస్తులతో చిన్నప్పటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

పది నెలలైనా మెస్ బిల్లులు ఇవ్వరా?: కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసినప్పటికీ రాష్ట్రంలో 700 బీసీ హాస్టళ్లలోని 70 వేల మంది మెస్‌చార్జీల బిల్లులు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా దివాలా తీసిందా? అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. అద్దె భవనాల బిల్లులు, కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లలో ఉండే వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కూరగాయలు, మాంసం, గుడ్ల బిల్లులు పది నెలలుగా చెల్లించడం లేదని, పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు చెల్లించకపోవడంతో ఈ వస్తువులు సరఫరా చేసే కాంట్రాక్టర్లు అప్పుల పాలై సరఫరా బంద్ చేస్తామంటున్నారని చెప్పారు. దీంతో హాస్టళ్లను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని కృష్ణయ్య ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టళ్ల కరెంటు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పరీక్షా సమయంలో హాస్టళ్లకు కరెంటు కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారని, పరీక్షలు ఎలా రాస్తారని ప్రశ్నించారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, నాయకులు జి.అనంతయ్య, సుధాకర్‌ముదిరాజ్, పగిళ్ల సతీశ్, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అమరజీవి చలమల పుస్తకావిష్కరణ




సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గుత్తి కోయల దాడిలో గత ఏడాది మృతి చెందిన అటవీ అధికారి శ్రీనివాసరావు స్మృత్యర్థం 'అమరజీవి చలమల శ్రీనివాసరావు' అనే పుస్తకాన్ని రాష్ట్ర విశ్రాంత అటవీ అధికారుల సంఘం అధ్యక్షుడు పి.కె.ఝా అవిష్కరించారు. విశ్రాంతి అటవీ అధికారులు కె. బుచ్చిరాంరెడ్డి, నాగభూషణం, అటవీ క్షేత్రాధికారి రామ్మోహన్‌లు సంకలనం చేసిన ఈ పుస్తకాన్ని ఆదివారం అరణ్యభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఝా మాట్లాడుతూ అడవుల రక్షణలో శ్రీనివాసరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అటవీ అధికారులు ఎంజె. అక్బర్, వి.వి. హరిప్రసాద్, మహ్మద్‌ఖాన్, స్వామిదాస్, రామన్‌గౌడ్, మహ్మద్ తయ్యబ్‌లతో పాటు రాష్ట్ర అటవీ క్షేత్రాధికారుల సంఘం కార్యదర్శి డి. నరేందర్, ఎస్. కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో కిడ్నీ మార్పిడులు 11,423

3,700 కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు

- దేశవ్యాప్తంగా పెరుగుతున్న బాధితుల సంఖ్య
- అవయవాల దానానికి ముందుకొస్తున్న దాతలు
- పదేళ్లలో మూడింతలైన అవయవ మార్పిడి చికిత్సలు
- కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: దేశంలో కిడ్నీ మార్పిడి చికిత్సలు గణనీయంగా పెరిగాయి. ఒక్క 2022 ఏడాదిలోనే ఏకంగా 11,423 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు జరిగినట్టు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ తాజాగా వెల్లడించింది. పదేళ్లలో ఈ చికిత్సలు దాదాపు మూడింతలు పెరిగినట్టు తెలిపింది. 2013లో 4,037 కిడ్నీ మార్పిడి చికిత్సలు జరిగాయి. ఆ తర్వాత ఏటా పెరుగుతూ 2019లో 9,751కు చేరాయి. కరోనా కారణంగా 2020లో 5,488, 2021లో 9,105 శస్త్రచికిత్సలు జరిగాయి. కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతుండటంతోపాటు అవయవ దానానికి ముందుకొస్తున్నవారిలో పెరుగుదల కూడా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పెరగడానికి కారణమని వైద్య నిపుణులు చెప్తున్నారు. అయితే ఇప్పటికీ పెద్ద సంఖ్యలో కిడ్నీ బాధితులు దాతల కోసం ఎదురుచూస్తున్నారని అంటున్నారు.

కిడ్నీ చికిత్సలే అధికం

సాధారణంగా కిడ్నీ, పాంక్రియాస్, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు దెబ్బతిన్నవారికి ఆయా అవయవాలను మార్పిడి చేస్తారు. దేశవ్యాప్తంగా అన్ని రకాల అవయవ మార్పిడి చికిత్సలు కలిపి 2013లో 4,990 జరగ్గా.. 2022 నాటికి 15,561కి పెరిగాయి. ఇందులో అధికంగా 11,423 కిడ్నీ మార్పిడి చికిత్సలే ఉన్నట్టు కేంద్ర ఆరోగ్యశాఖ నివేదికలో వెల్లడించింది. ఇక కాలేయ మార్పిడి చికిత్సలు 3,718, గుండె మార్పిడులు 250, ఊపిరితిత్తుల మార్పిడులు 138, పాంక్రియాస్ 24, కిడ్నీ–పాంక్రియాస్ 22 చికిత్సలు జరిగాయి.

'బ్రెయిన్‌డెడ్' దాతల నుంచి..

2022లో దేశవ్యాప్తంగా బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి సేకరించిన అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలు తెలంగాణలో ఎక్కువగా ఉన్నాయని కేంద్రం తెలిపింది. తెలంగాణలో ఇలా 655 శస్త్రచికిత్సలు జరగగా.. తమిళనాడులో 553, కర్ణాటక 435, గుజరాత్ 399, మహారాష్ట్రలో 305 అవయవ మార్పిడులు జరిగినట్టు తెలిపింది. ఇక బతికున్నవారి దాతల (లివింగ్ డోనర్) నుంచి తీసుకున్న అవయవ మార్పిడిలో ఢిల్లీ టాప్‌లో ఉంది. ఆ రాష్ట్రంలో అత్యధికంగా 3,623 లివింగ్ డోనర్ అవయవ మార్పిడులు జరిగాయి. తర్వాత తమిళనాడు 1,691, మహారాష్ట్ర 1,211, కేరళ 979, పశ్చిమ బెంగాల్ 928 అవయవ మార్పిడి చికిత్సలు జరిగాయి.

పెద్ద సంఖ్యలో బాధితులు

సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా, శస్త్రచికిత్సలు చేసే సదుపాయాలు అంతటా అందుబాటులోకి వచ్చినా.. అవయవాలు దొరక్క చాలా మంది బాధితులు ఇబ్బందిపడుతున్నారు. దాతల కోసం ఎదురుచూస్తూనే.. పరిస్థితి విషమించి మరణిస్తున్నవారు పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2019 నాటి లెక్కల ప్రకారం.. అంతకుముందు ఆరేళ్లలో తెలంగాణలో 4,728 మందికి అవయవ మార్పిడి అవసరమైతే, 2,402 అవయవాలు మాత్రమే అందించగలిగారు.

జీవన్‌దాన్ నెట్‌వర్క్‌తో..

ప్రమాదాల్లో మరణించిన, బ్రెయిన్‌డెడ్ అయినవారి నుంచి అవయవాలను సేకరించి.. అవసరమైన వారికి అందించేందుకు జీవన్‌దాన్ నెట్‌వర్క్‌తో కీలకంగా పనిచేస్తోంది. ఈ నెట్‌వర్క్‌తో అనుసంధానమైన ఆస్పత్రుల్లోని రోగులకు రొటేషన్ పద్ధతిలో అవయవాలు అందేలా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలో ఇలాంటి ఆస్పత్రులు 27 ఉన్నాయి. అవయవాలు కావాల్సిన రోగులు ప్రభుత్వ జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేరు, వివరాలు నమోదు చేయించుకోవాలి. వారికి సీరియల్ నంబర్ ఇస్తారు. అవయవ దాతలు దొరికినప్పుడు సీరియల్ నంబర్ ప్రకారం రోగులకు చికిత్సలు చేస్తారు. మృతుల కుటుంబ సభ్యులకు అవయవ మార్పిడిపై అవగాహన కల్పించి, ఒప్పించేదిశగా జీవన్‌దాన్ కృషి చేస్తోంది. మన రాష్ట్రంలో ప్రైవేటు ఆసుపత్రులతోపాటు నిమ్స్, గాంధీ, ఉస్మానియా ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలు చేస్తున్నాయి.

కరెంట్ ప్రమాదాలను కట్టడి చేయండి

- వినియోగదారులకు అవగాహన కల్పించాలి
- సిబ్బందికి రక్షణ పరికరాలు అందించాలి
- డిస్కంలకు ఈఆర్సీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసాధారణ రీతిలో కరెంట్ ప్రమాదాలు, మరణాల సంఖ్య పెరిగిపోయిన నేపథ్యంలో నివారణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఆదేశించింది. ప్రమాదాల నివారణ కోసం ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగం సిబ్బందికి రక్షణ పరికరాలు అందజేయాలని కోరింది. రక్షణ విషయంలో వినియోగదారుల్లో అవగాహన కల్పించడానికి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించింది. రిటైల్ సప్లై టారీఫ్ ఆర్డర్ 2023–24లో ఈ మేరకు డిస్కంలకు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. విద్యుత్ ప్రమాదాల సంఖ్య, మరణాల్లో తెలంగాణ రాష్ట్రం 2020–21లో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఇటీవల సెంట్రల్ ఎలక్ట్రిసిటీ ఆథారిటీ ఓ నివేదికలో వెల్లడించింది. ఆ ఏడాది దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో 4,676 విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోగా, ఏకంగా 1,241 మంది మరణించారు. 219 మంది క్షతగాత్రులయ్యారు. 2,876 పశువులు సైతం మరణించాయి.

100% బకాయిలు వసూలు చేయాలి..

వినియోగదారులతో పాటు ప్రభుత్వ శాఖల నుంచి రావాల్సిన విద్యుత్ బిల్లుల మొండి బకాయిలను 100 శాతం వసూలు చేయాలని ఈఆర్సీ.. డిస్కంలను ఆదేశించింది. వచ్చే 12 నెలల్లోగా అన్ని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లకు మీటర్లు అమర్చాలని, ఈ విషయంలో త్రైమాసిక పురోగతి నివేదికలను సమర్పించాలని కోరింది. అంతర్గత సామర్థ్యం పెంచుకోవడం ద్వారా నష్టాలను అధిగమించాలని సూచించింది. విద్యుత్ పొదుపు పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని, డిమాండ్ గరిష్ఠంగా ఉండే వేళల్లో వినియోగం తగ్గించుకునేలా సూచనలు చేయాలని కోరింది.

నేడు కంటైనర్ సబ్ స్టేషన్ ప్రారంభం

విజయవాడ గొల్లపూడిలో నిర్మాణం • తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిది ఇదే

గొల్లపూడిలో ప్రారంభానికి సిద్ధమైన కంటైనర్ సబ్ స్టేషన్



సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో నిర్మించిన కంటైనర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ)తో అతి తక్కువ స్థలంలో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె.పద్మజనార్దనరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తొలి కంటైనర్ సబ్‌స్టేషన్ ఇదే కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ఈ కంటైనర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించింది. విజయవాడ సమీపంలోని గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ ట్రయల్ రన్ ఇప్పటికే విజయవంతమైంది. ఈ సబ్‌స్టేషన్ 4.5 మీటర్ల వెడల్పు, 13 మీటర్ల పొడవున ఉంది. అందులోనే సబ్ స్టేషన్‌కు సంబంధించిన పరికరాలు అన్నింటినీ ఏర్పాటు చేశారు. అత్యాధునిక రీతిలో తక్కువ స్థలంలో కంప్యూటర్ ఆధారంగా ఆపరేట్ చేసేలా ఈ కంటైనర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. దీని నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సరఫరా చేస్తారు. పూర్తి ఆటోమేషన్ విధానంలోనే ఈ కంటైనర్ సబ్ స్టేషన్ పనిచేస్తుంది. ఈ సబ్ స్టేషన్‌తో అర్బన్ ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాలున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

- కంటైనర్ సబ్‌స్టేసన్‌లో సమస్య తలెత్తితే వెంటనే సెన్సార్ల ద్వారా ఆటోమేటిక్‌గా తలుపులు తెరచుకొంటాయి.
- వీడియో కాల్ ద్వారా సబ్‌స్టేషన్ పనితీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చి సమస్యలను పరిష్కరించే వెసులుబాటు ఉంది.
- సబ్‌స్టేషన్ లోపల ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లు తెగిన వెంటనే ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోయే వ్యవస్థ ఉంది.
- ఏ వీధిలో అయినా సమస్య తలెత్తితే సబ్‌స్టేసన్‌లో తెలుసుకొనే వీలుంది.
- వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని చోట రిమోట్ లోకేషన్ నుంచి కంప్యూటర్ ద్వారా ఆపరేట్ చేయొచ్చు.

వామ్మో.. 35 నాగులు!

భయంతో చంపేసిన గ్రామస్తులు


దేగానిపల్లెలో గ్రామస్తులు చంపేసిన పాములు

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా): ఇంటిముందు అరుగు బండ కింద 35 పాములు బయటపడ్డాయి. వీటిని చూసిన గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై వాటిని చంపేశారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట సమీపంలోని డేగానిపల్లెలో మంజు ఇంటివద్ద పొడవాటి అరుగు బండ ఉంది. దాని అడుగు నుంచి ఓ పాము బయటకు రాగా.. గమనించిన గ్రామస్తులు భయంతో చంపేశారు. ఆ తరువాత ఒకదాని వెంట మరొకటిగా పాములు రావడంతో గ్రామస్తులు బండను తొలగించి చూడగా.. మొత్తం 35 పాములు కనిపించడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నివాస గృహాల మధ్య అరుగు బండకింద పాము గుడ్లు పెట్టగా.. వాటి నుంచి పిల్లలు బయటకొచ్చాయి. ఇవన్నీ నాగుపాము జాతికి చెందినవని గ్రామస్తులు తెలిపారు.

కారుణ్య నియామకాలపై కరుణించింది!

జీసీసీలో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ | ఫైల్‌పై సంతకం చేసిన సీఎం కేసీఆర్

- అర్హతలున్న వారికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం
- 30 మంది పేర్లను ప్రతిపాదించిన జీసీసీ యంత్రాంగం



సాక్షి, హైదరాబాద్: గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్(జీసీసీ)లో కారుణ్య నియామకాలపై రాష్ట్ర ప్రభుత్వం కరుణించింది. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదుల సంఖ్యలో ఉద్యోగులు వివిధ కారణాలతో మృత్యువాత పడ్డారు. అయితే వరుసగా మూడేళ్ల లాభాలతో కొనసాగినప్పుడే కారుణ్య నియామకాలు చేపట్టాలని అప్పట్లో ప్రభుత్వం నిర్ణయించింది. అయితే రాష్ట్ర ఏర్పాటు తర్వాత మూడేళ్ల నుంచి లాభాలు గడించినప్పటికీ కోవిడ్–19 కారణంగా ఆ తర్వాత నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. ప్రస్తుతం ఈ సంస్థ లాభాల బాటలో ఉంది. ఈ నేపథ్యంలో జీసీసీ కారుణ్య నియామకాలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పచ్చజెండా ఊపారు. ఈ ఫైలుపై సీఎం సంతకం చేశారు. దీంతో కారుణ్య నియామకాల ఆర్జీలకు అతి త్వరలో మోక్షం కలగనుంది.

330 మంది ఉద్యోగులతో...

తెలంగాణ రాష్ట్ర గిరిజన కోఆపరేటీవ్ కార్పొరేషన్(టీఎస్‌జీసీసీ) పరిధిలో 330 మంది ఉద్యోగులు శాశ్వత, తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్నారు. మూడు డివిజినల్ కార్యాలయాలు, 18 సొసైటీలు, 311 రెగ్యులర్ డిపోలు, 158 సబ్ డిపోలు న్నాయి. మరో 125 స్వయం సహాయక సంఘాలతోనూ జీసీసీ అనుసంధానమై కార్యకలాపాలు సాగిస్తోంది. జీసీసీ ద్వారా తేనె, ఇప్పపువ్వు, గమ్, చింతపండు వంటి అటవీ ఉత్పత్తులతోపాటు సబ్బులు, షాంపూలు, కారం, పసుపు, కందిపప్పు, ఇతర ఆహార మసాలాలు, సుగంధ ద్రవ్య పొడి(పౌడర్)లు తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలకు వంట సరుకులన్నీ దాదాపు జీసీసీ ద్వారానే సరఫరా చేస్తున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ముందు జీసీసీ హైదరాబాద్ కేంద్రంగా ఉన్నప్పటికీ తయారీ యూనిట్లు విశాఖ కేంద్రంగా నడిచేవి. అయితే రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో ప్రతి యూనిట్ కొత్తగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. దీంతో జీసీసీకి ఏటా కేటాయింపులు జరిపినప్పటికీ రాబడి అంతంత మాత్రంగా ఉండేది. ఇప్పుడు లాభాల బాటలో కార్పొరేషన్ ముందుకు సాగుతోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. టీఎస్‌జీసీసీ పరిధిలో ఎనిమిదేళ్లలో 30 ఉద్యోగులు వివిధ కారణాలతో మరణించారు. ఇందుకు సంబంధించి క్లెయిమ్స్ పూర్తి చేసినప్పటికీ కారుణ్య నియామకాలకు అర్హులైన వారసులు 30 మంది దరఖాస్తులు సమర్పించారు. తాజాగా వీరి దరఖాస్తులు పరిశీలించి కారుణ్య నియామకాలు చేపట్టేందుకు మార్గం సుగమం అయింది.

గత ఐదేళ్లలో జీసీసీ టర్నోవర్ ఇలా (రూ.కోట్లలో)

సంవత్సరం	టర్నోవర్
2018–19	231.56
2019–20	291.70
2020–21	250.00
2021–22	380.28
2022–23	403.00

కాశీకి పోలేము రామా హరీ..!

ఈ నెల 22 నుంచి గంగానదీ పుష్కరాలు

- రాష్ట్రం నుంచి వేలాది మంది భక్తుల ప్రయాణ ఏర్పాట్లు
- ఉన్న ఒక్క దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో 400 దాటిన వెయిటింగ్ జాబితా
- అదనపు రైలు లేక అవస్థలు


పుష్కరాల సమయంలో వెయిటింగ్ లిస్టు ఇలా..

సాక్షి, హైదరాబాద్: సికింద్రాబాద్ నుంచి వారణాసి మీదుగా వెళ్లే దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వెయిటింగ్ లిస్టు 400ను దాటింది. మే మొదటివారం వరకు ఇదే పరిస్థితి. గత రెండు నెలల నుంచి వచ్చేనెల వరకు వెయింటింగ్ చూపుతున్నా ఈ మార్గంలో మరో అదనపు రైలును అధికారులు నడపటం లేదు. వారణాసి పుణ్యక్షేత్రానికి నిత్యం తెలంగాణ నుంచి దాదాపు రెండు వేలమంది భక్తులు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తులు ఎంతో ప్రత్యేకంగా భావించే గంగానదీ పుష్కరాలు ఈ నెల 22 నుంచి మే మూడో తేదీ వరకు కొనసాగనున్నాయి. పుష్కరాలు జరిగే తేదీలతోపాటు వాటికి అటూ ఇటూగా దాదాపు 2లక్షల మందికిపైగా భక్తులు కాశీ యాత్రకు వెళ్తారన్నది ఓ అంచనా. సాధారణ రోజుల్లోనే ఈ ఒక్క రైలు సరిపోక, రోడ్డు మార్గాన అంత దూరం వెళ్లలేక భక్తులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. అలాంటిది పుష్కరాల వేళ, రద్దీ అంతకు పదిరెట్లు పెరుగుతున్నా అదనపు రైలు ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించలేకపోవటం గమనార్హం.

భారీగా పెరిగిన విమాన చార్జీలు

సాధారణ రోజుల్లో కాశీకి విమాన టికెట్ ధర రూ.5 వేల నుంచి రూ.8 వేలుగా ఉండేది. డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు టికెట్ ధర పెంచుకునే డైనమిక్ ఫేర్ విధానాన్ని ఇప్పుడు విమానయాన సంస్థలు బాగా వినియోగించుకుంటున్నాయి. గంగా పుష్కరాలకు భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుండటంతో ఒక్కో టికెట్ ధరను రెట్టింపు చేసి విక్రయిస్తున్నాయి. కీలక రోజుల్లో అది మరింత ఎక్కువగా ఉంటోంది. అంత ధరను భరించే పరిస్థితి లేనివారు దానాపూర్ ఎక్స్‌ప్రెస్ వైపే చేస్తున్నారు.

ఆ క్లోన్ రైలును పునరుద్ధరించాలి

కాశీ విశ్వనాథుడిని దర్శించుకునేందుకు వెళ్లే దక్షిణ భారత యాత్రికుల్లో తెలుగువారే ఎక్కువ. రైల్లో కాశీకి వెళ్లేవారికి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఒక్కటే దిక్కు. హైదరాబాద్, ఇతర పట్టణాల్లో పనిచేస్తున్న బీహార్ వలస కూలీలు కూడా ఈ రైలు మీదే ఆధారపడుతుంటారు. దీంతో గతంలో ఈ రైలుకు అనుబంధంగా ఓ క్లోన్ రైలు నడిపేవారు. అంటే అదే మార్గంలో అరగంట తేడాతో నడిచే మరో రైలు అన్నమాట. ముందు రైలుకున్న ఫ్రీ సిగ్నల్ క్లియరెన్స్ సమయంలోనే ఈ క్లోన్ రైలు నడుస్తుంది. కోవిడ్ ఆంక్షల సమయంలో రద్దయిన ఈ రైలును తిరిగి పునరుద్ధరించలేదు. అది రద్దీ మార్గం కావటం, దానికి తగ్గ అదనపు లైన్లు లేకపోవటం, ఉన్న అవకాశాలను ఇతర జోన్లు వినియోగించుకుంటుండటమే దీనికి కారణమని స్థానిక రైల్వే అధికారులు పేర్కొంటున్నారు. రద్దయిన మన క్లోన్ రైలును వేరే రాష్ట్రం ఒత్తిడి తెచ్చి వినియోగించుకుంటున్నట్టు సమాచారం. ఇప్పుడు దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులతోపాటు రాష్ట్రప్రభుత్వం కూడా రైల్వే బోర్డుపై ఒత్తిడితెచ్చి ఆ క్లోన్ రైలును పునరుద్ధరిస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.